






www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



ప్రజాస్వామ్య ముసుగు కప్పుకొన్న అమెరికా ఉగ్రవాదం

అల్‌ఖైదా అనుబంధ సంస్థకు చెందినషామా పర్వీన్ అరెస్టు

నిమిషప్రియ మరణశిక్ష రద్దు అవాస్తవం

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 240 | గురువారం | 31-07-2025 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00




'గొర్రెల' స్కామ్

## కళ్యాణ్‌కుమార్ ఇంటిపై ఇడి దాడులు

- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వద్ద ఒఎస్‌డిగా పనిచేసిన కళ్యాణ్ కుమార్
- భారీగా నగదు పట్టుకున్న అధికారులు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో చోటుచేసుకున్న గొర్రెల కుంభకోణంలో డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు దూకుడు పెంచారు. ఈ క్రమంలోనే బుధవారం బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దగ్గర గతంలో ఒఎస్‌డిగా పనిచేసిన కళ్యాణ్‌కుమార్ ఇంటిపై ఇడి అధికారులు దాడి చేశారు. ఈ సందర్భంగా భారీగా నగదు బయటపడినట్లు సమాచారం. ప్రత్యేకంగా కౌంటింగ్ మిషన్లను తెప్పించి నగదును ఇడి అధికారులు లెక్కించారు. ఈ సందర్భంగా మాజీ ఒఎస్‌డి కళ్యాణ్ కుమార్‌ను ఇడి అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గొర్రెల పంపిణీ స్కీంలో రూ. 700 కోట్ల కుంభకోణం జరిగినట్లు ఎసిబి నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఇడి అధికారులు కళ్యాణ్ ఇంటితో సహా హైదరాబాద్‌లోనిని ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో పలు కీలక డాక్యుమెంట్లు, భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. కళ్యాణ్‌ను సుమారు 7 గంటల పాటు విచారించినట్లు సమాచారం. ఈ కేసు గత ప్రభుత్వం హయాంలో అమలు చేసిన గొర్రెల పంపిణీ స్కీంలో జరిగిన ఆర్థిక అక్రమాలకు సంబంధించినది కాగా... ఈ స్కీంలో రూ. 700 కోట్ల నిధులు దుర్వినియోగం అయినట్లు ఎసిబి తరువాయి 2లో

## 25% భారత్‌పై సుంకం

- జరిమానా విధించిన అమెరికా
- రేపటినుండే అమల్లోకి
- రష్యాతో వాణిజ్యాన్ని తప్పుపట్టిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- మరోసారి భారత్–పాక్ యుద్ధ ప్రస్తావన
- సుంకాల ప్రభావంపై అధ్యయనం చేస్తున్నాం : భారత్



**వాషింగ్టన్ :** 'డియర్ ఫ్రెండ్ భారత్'పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 25 శాతం సుంకాలు విధించారు. రష్యాతో భారత్ వాణిజ్య భాగస్వామ్యాన్ని తప్పుపట్టారు. భారత్ తమ మిత్రదేశమని చెబుతూనే విమర్శలు చేశారు. రెండు దేశాలమధ్యా వాణిజ్య చర్చలు స్తంభించాయని వార్తలు వచ్చిన నేపథ్యంలో ట్రంప్ ప్రకటన వెలువడింది. భారత్ నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై శుక్రవారం (ఆగస్టు 1వ తేదీ) నుండీ పెంచిన సుంకాలు అమలులోకి వస్తాయనీ, 25 శాతం సుంకాలతోపాటు పెనాల్టీని భారత్ చెల్లించాల్సి ఉంటుందని ట్రంప్ చెప్పారు. అమెరికా చాలా తక్కువ వాణిజ్యం చేసినాగానీ భారత్‌తో తమ దేశానికి సామూహికంగా భారీ వాణిజ్యలోటు ఏర్పడిందన్నారు. ట్రంప్ విధించిన గడువు ఆగస్టు ఒకటోతేదీతో ముగుస్తుంది. ఈ లోపు వాణిజ్య ఒప్పందాలు చేసుకోని దేశాలపై భారీగా సుంకాలు విధిస్తామని ట్రంప్ మొదట్లోనే స్పష్టం చేశారు. ప్రపంచంలో అందరికంటే చాలా ఎక్కువగా భారతదేశం తమ దిగుమతులపై సుంకాలు వసూలు చేస్తోందని, తమ రెండు దేశాలమధ్యా సుంకాలలో సమతౌల్యం లేదని, భారత్‌తో అమెరికా వాణిజ్యలోటు చాలా తరువాయి 2లో

### మోదీ మౌన ఫలితమే

**సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా ధ్వజం**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశాన్ని రాజకీయంగా, ఆర్థికంగా, నైతికంగా లక్ష్యంగా చేసుకుంటున్నా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజల విషయంలో గానీ, పార్లమెంట్ విషయంలో గానీ నిజాయితీగా లేకపోవడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆక్షేపించింది. రష్యా నుండి చమురు దిగుమతులపై పెనాల్టీలు సహా భారత్‌పై 25శాతం సుంకాలు విధిస్తున్నామని తరువాయి 2లో

### ట్రంప్ మోదీ మధ్యనున్న 'తారిఫ్' కొద్దిగే అర్థమయ్యింది

కాంగ్రెస్ ఎద్దేవా


అమెరికా అధ్యక్షుడితో తన స్నేహం పెద్దగా అర్థం కాదని చెప్పిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై బుధవారం కాంగ్రెస్ తీవ్రస్థాయి విమర్శలు చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 25శాతం సుంకాలు, జరిమానాలు విధించిన అనంతరం కాంగ్రెస్ స్పందించింది. మాజీ తరువాయి 2లో

## రష్యా తీరంలో భారీ భూకంపం



రిక్టర్ స్కేలుపై 8.8 తీవ్రత

- పసిఫిక్ సముద్రంలో అనేక దేశాలకు సునామీ భయం
- కమ్చట్కాలో బద్దలవుతున్న అగ్నిపర్వతం
- సెవెరో–కురిల్స్క్ పట్టణ ప్రజల తరలింపు
- అనేక దేశాలకు సునామీ హెచ్చరిక
- 20 లక్షలమంది ప్రజలను అప్రమత్తం చేసిన జపాన్
- మెల్లిగా అనేకచోట్ల హెచ్చరికలు ఉపసంహరణ





**మాస్కో:** రష్యా తీరంలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 8.8 తీవ్రతతో నమోదైన ఈ భూకంపంవల్ల పసిఫిక్ సముద్రంలో రష్యా, హవాయ్ దీవులకు సునామీ ప్రమాదం ముంచుకొచ్చింది. అనేకమంది గాయపడినప్పటికీ తీవ్రత లేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం భారీనష్టాలు జరగలేదు. ప్రజలు ఎత్తైన పర్వత ప్రాంతాలకు చేరుకోవాలని ప్రభుత్వం హెచ్చరించింది. రష్యా, జపాన్ సహా అనేక దేశాలలో సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. తర్వాత వాటిని మెల్లిగా ఉపసంహరించారు. రష్యా కామ్చాట్కా తీరంలో 15 మీటర్ల ఎత్తు వరకూ అలలు ఎగసిపడి ప్రజలను భయభ్రాంతులు చేశాయి. ప్రజలు ఆ ప్రాంతాలు ఖాళీ చేశారు. ఐతే కామ్చాట్కా ద్వీపకల్పంలో సు నామీ హెచ్చరికలు రద్దుచేసినట్లు రష్యా అధికారు లు ప్రకటించారు. కామ్చాట్కాలో తర్వాత అనేకసార్లు భూమి కంపించింది. ఈ ఏడాది జులైనెలలో తొలుత కామ్చాట్కా ప్రాంతంలో ఐదుసార్లు 7.4 తీవ్రంతతో భూకంపాలు సంభవించాయి. ఉత్తర అమెరికా,దక్షిణ అమెరికా, ఓసియానా (ఆస్ట్రేలియాఖండం), ఆసియాలలో సునామీ అలల తీవ్రతను బట్టి ప్రజలకు హెచ్చరికలు, అప్రమత్తతలు, సలహాలు జారీ చేశారు. 73 సంవత్సరాల తర్వాత రష్యాలో సంభవించిన అతిభారీ భూకంపం ఇదే. రష్యాలో కామ్చాట్కా ద్వీపకల్పం, సఖలిన్ ద్వీపం, ఉత్తర కురిల్ దీవులలోని సెవెరో కురిల్స్క్ పట్టణాన్ని అప్రమత్తంచేసి తక్షణ సహాయ చర్యలు చేపట్టారు. కమ్చాట్కా,జపాన్ మధ్య ప్రాంతంలో ఉన్న కురిల్స్ ప్రాంత ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. ఇళ్ళలోంచి బయటకు పరుగులు తీశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అనేక భవంతులు దెబ్బతిన్నాయి. తమ కళ్ళ ఎదుటే బరువైన సామాన్లు కదలిపోయి కిందపడిపోతూ ఉండటాన్ని తాము చూసి చావు తప్పదని భయపడ్డామని కొందరు చెప్పారు. ఐతే బుధవారం రాత్రినాటికి అనేక ప్రాంతాలలో సునామీ హెచ్చరికలను, సలహాలను ఉపసంహరించారు. ఫ్రెంచ్ పోలినేసియా తీరంలో సుమానీ ప్రమాదం పొంచి ఉందని, అధికారులు, సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సోషల్ మీడియాలో తొలుత పోస్టింగ్ పెట్టారు. 1952 తర్వాత ఇంత భారీ భూకంపం రావడం మళ్ళీ ఇదే మొదటిసారి తరువాయి 2లో





## నింగిలోకి నిసార్

- జిఎస్‌ఎల్‌వి ఎఫ్- 16 రాకెట్ ప్రయోగం ఘన విజయం
- షార్ నుండి అద్భుత ప్రయోగం

**సూళ్లూరుపేట:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుండి బుధవారం జిఎస్‌ఎల్‌వి ఎఫ్16 రాకెట్ ద్వారా నిసార్ ఉపగ్రహాన్ని శాస్త్రవేత్తలు బుధవారం సాయంత్రం 5.40 గంటలకు నింగిలోకి పంపారు. 18 నిమిషాల 40 సెకండ్లలో నిసార్ ఉపగ్రహం నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో, నాసా శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఇది ఇస్రో శాస్త్రవేత్తల ఘనవిజయమని చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. ఇస్రో ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు చైర్మన్ అభినందనలు తెలిపారు. శ్రీహరికోట నుండి మరిన్ని భారీ ప్రయోగాలు ప్రయోగించనున్నామని తెలిపారు. శాస్త్రవేత్తలు భూ పరిభ్రమణంలో వస్తున్న మార్పులు, భూగోళంలో ఏమి జరుగుతుందో ప్రతి రోజూ ఒకసారి స్కానర్‌లో సమగ్ర సమాచారాన్ని అరచేతిలో పెట్టేందుకు రూపకల్పన చేసిన ఓ అద్భుత రాకెట్ ప్రయోగానికి ఇస్రో, నాసా రూపకల్పన చేసిన నిస్సార్ ఉపగ్రహ ప్రయోగ ఘన విజయం సాధించింది. నిసార్ డ్యూయెల్ రాడార్ సిస్టమ్ను కలిగి ఉంది. ఎస్ బ్యాండ్ సిథటిక్ ఎపర్చర్ రాడారు తరువాయి 2లో



## మోదీ... ట్రంప్‌ను నిలదీయగలరా?

- యుద్ధాన్ని అర్థాంతరంగా ఎందుకు ఆపారు?
- రాజ్యసభలో సిపిఐ ఎంపి సందోశ్ కుమార్ ప్రశ్నలు
- అగ్నివీర్ పథకం ఉపసంహరణకు డిమాండ్

**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌ను అర్థాంతరంగా ఎందుకు ఆపారో కేంద్రం సమాధానం ఇవ్వాలని రాజ్యసభలో సిపిఐ ఎంపి సందోశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల ఫ్యాక్టరీగా ఉన్న పాకిస్థాన్ నుంచి ఫోన్ రాగానే దాడులు ఆపేయడం ఎందుకని ప్రశ్నించారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషించే పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చినట్లు గొప్పలు పోయే సర్కారు.... ఆ దేశం నుంచి ఫోన్ కోసమే వేచివున్నట్లుగా అది జరిగిన మరుక్షణం దాడులు ఆపేసిందని విమర్శించారు. కాల్పుల విరమణ ప్రకటించడం కోసం వారిని ఒత్తిడి చేసినదేమిటని ప్రశ్నించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత నైతిక సార్వభౌమాధికారాన్ని అవమానిస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రధాని మోదీని సిపిఐ ఎంపి ప్రశ్నించారు. ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో అత్యధిక మంది ఫాలోవర్లు కలిగిన నాలుగో వ్యక్తిగా ఉన్న నరేంద్ర మోదీ.... ట్రంప్‌ను నిలదీస్తూ కనీసం ఒక్క పోస్టు పెట్టగలరా అంటూ సందోశ్ కుమార్ సవాల్ విసిరారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆపరేషన్ సైలెన్స్‌ను మోదీ చేపట్టారని ఎద్దేవా చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా ఉంటే, జాతీయ ఐక్యతను రాజకీయ గుత్తాధిపత్యంగా మార్చే ప్రయత్నాన్నీ బిజెపి చేసిందని సందోశ్ కుమార్ తరువాయి 2లో



## ఫీల్డ్ అసిస్టెంట్లకు సమాన వేతనం

- ఉపాధి హామీలో కొనసాగుతున్న 7111 మందిని ఒకే కేటగిరిలో చేర్చాలి
- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం
- ఫీల్డ్ అసిస్టెంట్లను బదిలీ చేయనున్నట్లు ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉపాధి హామీ పథకంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న 7111 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు సమానవేతనం అమలు చేయాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ సీతక్క అధికారులకు ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్ అందరినీ ఒకే కేటగిరిలో చేర్చి, ఒకే రకమైన వేతనాన్ని అమలు చేయాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల బదిలీల చేయనున్నట్టు ప్రకటించారు.గ్రూప్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్, హెల్త్ కార్డులు కూడా మంజూరు చేస్తామని, ఫీల్డ్ అసిస్టెంట్ల ఎక్స్‌గ్రేషియా రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు పెంపు, ఉపాధి కూలీల హాజరు నమోదు తరువాయి 12లో



## పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి పక్కా ఇండ్లు నిర్మించాలి

- కమ్యూనిస్టులుగా ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం
- వరంగల్ జిల్లా ద్వితీయ మహాసభల్లో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/ వరంగల్



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలను ఆదుకోవాలని, పేదలు వేసుకున్న గుడిసెలకు, ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి, పక్కా ఇళ్లు నిర్మించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. నిరంతరం పేదల, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడే కమ్యూనిస్టులుగా తాము ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని చెప్పారు. రానున్న రోజులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలుచేయాలని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బుధవారం వరంగల్ జిల్లా సిపిఐ ద్వితీయ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక అబ్బాస్ ఫంక్షన్ హాల్ లో జరిగిన సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా చాడ వెంకట్ రెడ్డి హాజరై ప్రసంగించారు. కార్పొరేట్ వర్గాలకు తరువాయి 12లో

## జస్టిస్ యశ్వంత్‌వర్మ ధోరణిపై 'సుప్రీం' అసహనం

కమిటీ నివేదికను వ్యతిరేకిస్తుంటే కమిటీ ముందు హాజరెందుకని? బెంచ్ ప్రశ్న



**శ్రీనగర్ :** అధికారిక నివాసంలో నోట్ల కట్టలు బయటపడ్డ కేసులో జస్టిస్ యశ్వంత్‌వర్మను బుధవారం సుప్రీంకోర్టు తప్పు పట్టింది. మీ ప్రవర్తన ఆత్మవిశ్వాసాన్ని ప్రేరేపించదని, అంతర్గత విచారణ కమిటీ నివేదిక చెల్లనిదిగా ప్రకటించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన జస్టిస్ యశ్వంత్‌వర్మకు ధర్మాసనం పదునైన ప్రశ్నలు సంధించింది. కమిటీ నివేదిక చెల్లుబాటును మీరు వ్యతిరేకిస్తున్నప్పుడు ఇంతకు ముందు అంతర్గత విచారణ కమిటీ తరువాయి 12లో

## ట్రంప్ వ్యాఖ్యలు అబద్ధమని మోదీ ఎందుకు చెప్పట్లేదు


ప్రధాని తన బండారం బయటపడుతుందని జంకుతున్నారు : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 30 సార్లు చెప్పినప్పటికీ, అది అబద్ధమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పలేకపోతున్నారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలు నిస్సందేహంగా తిరస్కరించడానికి నిరాకరిస్తున్నారన్నారు. ఎందుకంటే ట్రంప్ సత్యాన్ని బయటపెడుతారని తరువాయి 12లో

## 42 శాతం బిసి కోటాపై ఢిల్లీలో ఉద్యమం

- 5న పార్లమెంటు ఉభయ సభల్లో ఎంపిల వాయిదా తీర్మానం, చర్చకు పట్టు
- టిపిసిసి నిర్ణయం
- మూడు రోజుల ఉద్యమ కార్యాచరణ పకడ్బందీగా ప్రణాళికా రూపకల్పన
- ప్రత్యేక రైలులో రాష్ట్రం నుంచి కాంగ్రెస్ నాయకులు, బిసి శ్రేణుల తరలింపు



ప్రజాపక్షం/ హైదరాబాద్

తెలంగాణలో 42 శాతం బిసి రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం ఢిల్లీలో ప్రతిష్ఠాత్మకంగా బిసి ఉద్యమాన్ని చేపట్టాలని, ఆగస్టు 5న పార్లమెంటు ఉభయ సభల్లో ఎంపిల వాయిదా తీర్మానం, చర్చకు పట్టుబట్టాలని టిపిసిసి నిర్ణయించింది. ఢిల్లీకి ప్రత్యేక రైలులో పెద్దఎత్తున తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిసి శ్రేణులను తరలించి మూడు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## పాలస్తీనా గుర్తింపు కోసం 'న్యూయార్క్ కాల్' పేరుతో 15 దేశాల పిలుపు

**న్యూయార్క్ :** పాలస్తీనా దేశ స్వయంప్రతిపత్తిని గుర్తించాలని ఫ్రాన్స్ మరో 14దేశాలు పిలుపు ఇచ్చాయి. ఐక్యరాజ్యసమితి నిర్వహించిన ప్రత్యేక సదస్సు సందర్భంగా ఈ 15 దేశాలూ "న్యూయార్క్ కాల్" పేరుతో ప్రపంచదేశాలకు ఒక ప్రగాఢమైన విజ్ఞప్తి చేశాయి. జులై 20–30 తేదీలలో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం న్యూయార్క్‌లో సదస్సు అనంతరం 15 దేశాల నాయకులూ బుధవారంనాడు ఈ "న్యూయార్క్ కాల్" ఇచ్చారు. పాలస్తీనా స్వయంప్రత్తి సాధనకు, ఆ దేశాన్ని గుర్తించేందుకు ప్రపంచంలోని అన్ని దేశాలూ పూనుకోవాలని పిలుపు ఇచ్చారు. ఫ్రాన్స్, సౌదీ అరేబియా దేశాల ప్రధాన ప్రోద్బలంతో ఐక్యరాజ్యసమితి ఈ ప్రత్యేక సదస్సు నిర్వహించింది. అండొర్రా, ఆస్ట్రేలియా,కెనడా, ఫిన్లాండ్, ఫ్రాన్స్, ఐస్‌లాండ్, ఐర్లాండ్, లగ్జెంబర్గ్, మాల్టా, న్యూజిలాండ్, నార్వే, పోర్చుగల్, శాన్ మారినో, స్లోవేనియా,స్పెయిన్ దేశాలు ఈ "న్యూయార్క్ కాల్" ఇచ్చాయి.

## థాయ్–కాంబోడియా మధ్య చైనా ఎంట్రీ

### షాంఘైలో త్రైపాక్షిక సమావేశం
### కాల్పుల విరమణ పునరుద్ఘాటన

**బీజింగ్ :** ట్రంప్ మధ్యవర్తిత్వం తర్వాత కూడా కాంబోడియా–థాయ్‌లాండ్ దేశాలమధ్య పరస్పర దాడుల ఆరోపణలు సర్దుమణగకపోవడంతో ఆసియాలో బాధ్యతగల పొరుగుదేశంగా చైనా జోక్యం చేసుకుంది. ఈ మూడు దేశాలమధ్యా షాంఘైలో బుధవారంనాడు త్రైపాక్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంబోడియా–థాయ్‌లాండ్ దేశాలు కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటామని చైనాకు పునరుద్ఘాటించాయి. బుధవారం మధ్యాహ్నం త్రైపాక్షిక సమావేశం తర్వాత రెండు దేశాల ప్రతినిధులు నవ్వు ముఖాలతో మీడియా ఎదుట ఫొటోలు తీయించుకున్నారు. చైనా ఉపమంత్రి సన వైడాంగ్ ఈ సమావేశంలో మధ్యవర్తిగా పాల్గొన్నారు. డోనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకుని వాణిజ్యాన్ని అడ్డుపెట్టి ఒప్పందం కుదిర్చిన తర్వాత కూడా, కాంబోడియా తమ సరిహద్దుల్లో దాడులు కొనసాగిస్తోందని, మలేసియా నగరం పుత్రజయలో కుదిరిన ఒప్పందాన్ని ఉల్లంఘించిందని థాయ్‌లాండ్



ఆరోపించింది. ఈ విషయంపై బీజింగ్‌లో చైనా విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గుయో జియాకున్ బుధవారంనాడు మీడియాతో మాట్లాడుతూ, రెండు దేశాలకూ బాధ్యతగల ఒక పొరుగుదేశంగా చైనా ఈ త్రైపాక్షిక సమావేశం నిర్వహించిందన్నారు. కాంబోడియా–థాయ్‌లాండ్ విదేశాంగమంత్రులతో చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ వేరువేరుగా సమావేశాలు నిర్వహించారు. రెండు దేశాల మధ్యా ఉద్రిక్తతలను సడలింపజేసేందుకు చైనా తనదైన శైలిలో మధ్యవర్తిత్వం చేసిందని వాంగ్ యీ చెప్పారు. మలేసియా నగరం పుత్రజయలో జులై 21న "ఏసియన్" (ఆగ్నేయ ఆసియా దేశాల సంఘం) అధినేత, మలేసియా ప్రధాన మంత్రి అన్వర్ ఇబ్రహీం మధ్యవర్తిగా కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ కాంబోడియా కాల్పుల విరమణను ఉల్లంఘించిందని థాయ్‌లాండ్ ఆరోపణలు చేస్తోంది. ఈ రెండూ "ఏసియన్"ల సభ్యదేశాలే. రెండు దేశాలమధ్యా సరిహద్దు ఘర్షణలు మొదలయ్యాక జులై 19వ తేదీ రాత్రి పొద్దుపోయాక థాయ్–కాంబోడియా నాయకులతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఫోన్ సంభాషణలు చేశారు. రెండు దేశాలూ శత్రుత్వం కొనసాగిస్తే వారితో వాణిజ్యం చేసే ప్రసక్తే లేదని బెదిరించారు. దీంతో రెండు దేశాలు బేషరతుగా కాల్పుల విరమణపై చర్చలకు సుముఖత వ్యక్తం చేశాయి. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ట్రంప్ ప్రకటించిన తర్వాత కూడా ఆ మాటను ఉల్లంఘిం చి రెండు దేశాలూ పోరాటాన్ని కొనసాగించాయి.

1907లో కాంబోడియా తమ వలస కేంద్రంగా ఉన్నకాలంలో ఆనాటి ఫ్రెంచ్ ప్రభుత్వం సరిహద్దులు నిర్దేశించి ఒక పటాన్ని రూపొందించింది. దీనిని థాయ్‌లాండ్ వ్యతిరేకిస్తోంది. ఈ రెండు దేశాలమధ్యా 817కి.మీ సరిహద్దు ప్రాంతం ఉంది. ఫ్రాన్స్ నిర్దేశించిన ఈ సరిహద్దులలో అనేకచోట్ల దశాబ్దాలుగా వివాదం కొనసాగుతోంది. తమ దేశానికి చెందిన అనేక చారిత్రక ప్రదేశాలు కాంబోడియాలోకి వెళ్ళాయని థాయ్‌లాండ్ ప్రతిఘటిస్తున్నది.

## సమస్య పరిష్కారంపైనే దృష్టి సారిద్దాం



### ఇజ్రాయెల్–పాలస్తీనాపై భారత్ పునరుద్ఘాటన

**న్యూయార్క్:** ఇజ్రాయెల్–పాలస్తీనా రెండు దేశాల పరిష్కారానికే భారత్ కట్టుబడి ఉందని, ప్రపంచం ఇప్పుడు దీనిమీదే దృష్టిసారించాలని ఐక్యరాజ్యసమితి రాయబార కార్యాలయంలో మనదేశ శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ పునరుద్ఘాటించారు. పాలస్తీనాపై న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి సదస్సు రెండు దేశాల పరిష్కార సాధనకు ఒక గొప్ప అవకాశమని బుధవారం ఆయన చెప్పారు. ఉపయుక్తమైన చర్చల ప్రక్రియ, దౌత్యమార్గాల ద్వారా ఏ విధంగా ఈ సమస్యను పరిష్కరించాలన్న విషయంమీదే భారతదేశం ఇప్పుడు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించిందని ఆయన అన్నారు. ఇప్పు డు మనం అందరం ఆ విషయంపైనే దృష్టి సారించి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. రెండు దేశాల పరిష్కారం తప్ప దీనికి మరో ప్రత్యామ్నాయం లేదని ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ ప్రగాఢంగా విశ్వసిస్తున్నాయని అన్నారు.

(జులై 28–30)న్యూయార్క్‌లో సదస్సు కూడా ఇదే విషయాన్ని బలంగా ఉద్ఘాటించింది. కాగితాలపై కసరత్తుచేస్తే ఉపయోగం లేదని, ఆచరణాత్మకంగా ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.

ఈ రెండు రోజుల సదస్సులో చేసిన తీర్మానం ప్రకారం 25 పేజీల ఒక నివేదికను రూపొందించారు. "పాలస్తీనా సమస్య–రెండు దేశాల సాధనకు శాంతియుత పరిష్కారం–న్యూయార్క్ ప్రకటన" అనే శీర్షికతో ఐక్యరాజ్యసమితి సదస్సు తీర్మానం వెలువడింది. ఈ నివేదిక ప్రకారం గాజాలో తక్షణం యుద్ధాన్ని విరమింపజేయాల్సిన అవసరం ఉందని, హమాస్ సంస్థ అనివార్యంగా గాజాలో తన పరిపాలనకు తెర దించాలని, తన ఆయుధాలను పాలస్తీనా అథారిటీకి స్వాధీనం చేయాలని ఈ తీర్మానపత్రం ప్రకటించింది. హమాస్ తన అధికారం నుండి వైదొలగిన తర్వాత తక్షణం ఒక పరివర్తనదశ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కూడా తీర్మానం పేర్కొంది. ఈ చర్యల కంటే మరో ఉత్తమ ప్రత్యామ్నాయం లేనే లేదని పర్వతనేని హరీశ్ చెప్పారు.

## ఒప్పందం లేకుండానే ముగిసిన అమెరికా–చైనా వాణిజ్య చర్చలు

**స్టాక్‌హోం:** స్వీడన్ నగరం స్టాక్‌హోంలో చైనా–అమెరికా మధ్య జరిగిన ఉన్నతస్థాయీ వాణిజ్య చర్చలు ఏ ఒప్పందం లేకుండానే ముగిశాయి. నాలుగోవిడత చర్చలు తదుపరి జరిగే అవకాశం ఉంది. రెండు దేశాల ఉన్నత స్థాయీ ప్రతినిధులు భారీ టారిఫ్‌లకు సంబం ధించిన గడువు తేదీని పొడిగించుకునే విషయంపై కసరత్తు చేసేందుకు అంగీకరించారు. ఐతే అమెరికా కోశాగార మంత్రి స్కాట్ బెస్సెంట్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ, ఆగస్టు 12వ తేదీ నాటితో ముగిసే గడువు తేదీని పొడిగించాలా? వద్దా? అనే విషయంపై డోనాల్డ్ ట్రంప్‌తో చర్చిస్తామన్నారు. చైనా ఉప ప్రధానమంత్రి హే లీఫెంగ్ బుధవారం ఈ విషయం చెప్పారు. చైనాపై 24 శాతం టారిఫ్‌లు వేసేందుకు అమెరికా సిద్ధమైంది. అందుకు ప్రతిగా చైనా కూడా సుంకాలు భారీగా విధించేందుకు సిద్ధపడింది. ఐతే రెండు దేశాల మధ్యా ఉన్న అపోహలు తొలగించుకుని, సహకా రాన్ని వృద్ధి చేసుకునే దిశగా ముమ్మర ప్రయత్నాలు కొనసాగించాలని స్టాక్‌హోం చర్చల్లో పాల్గొన్న లీ ఫెంగ్, స్కాట్ బెస్సెంట్ ఒక అంగీకారానికి వచ్చారు. ప్రపంచదేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడంతో చైనా ప్రభుత్వం ట్రంప్‌కు ఒక అతిపెద్ద సవాలుగా మారింది. అమెరికాతో సమానంగా చైనా కూడా గౌరవాన్ని కోరు కుంటూ పరస్పర మర్యాదపూర్వకమైన, పరస్పర ప్రయోజనకరమైన ఒప్పందం ఉండాలని చెబుతున్న మాటలు ట్రంప్‌కు మింగుడు పడటం లేదు. కాగా బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గుయో జియాకున్ మీడియాతో మాట్లాడుతూ.. రెండు దేశాల అగ్ర నాయకులు వ్యక్తం చేసిన ఏకాభిప్రాయం దిశగా కింది స్థాయీ యంత్రాంగం పరిష్కారాల సాధనకు కృషి చేస్తాయన్నారు.



## ఇమ్రాన్‌ఖాన్ బెయిల్ నిరాకరణ పిటిషన్లపై విచారణ 13 రోజులు వాయిదా



**ఇస్లామాబాద్:** పలు కేసుల్లో బెయిలు నిరాకరించిన లాహోర్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్‌ఖాన్ దాఖలు చేసిన పలు పిటిషన్లను ఆ దేశ సుప్రీంకోర్టు ఆగస్టు 12వ తేదీకి వాయిదా వేసింది. 2023 మే 9వ తేదీన పాకిస్థాన్ వ్యాప్తంగా పెద్ద ఎత్తున హింసాత్మక అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లలో ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పిటిఐ పార్టీ ప్రధానపాత్ర పోషించింది.

పాకిస్థాన్ సంకీర్ణ ప్రభుత్వం మే తొమ్మిదో తేదీని బ్లాక్ డేగా అభివర్ణిస్తున్నది. దేశవ్యాప్తంగా పాకిస్థాన్ తెహ్రీక్ యే ఇన్సాఫ్ పార్టీ అల్లర్లవల్ల 1.98 బిలియన్ డాలర్ల మేరకు ఆస్తుల నష్టం వాటిల్లిందని, గృహదహనాలు, లూటీలు, హింస, విద్వేష చర్యలకు పిటిఐపార్టీ పాల్పడిందని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ఆరోపిస్తున్నది. దీనిపై అనేక కేసులు ఇమ్రాన్‌ఖాన్, వారి ప్రధాన కార్యకర్తలపై బనాయించారు. సైనిక వ్యవస్థ ఆస్తులను ధ్వంసం చేయడమే కాకుండా పోలీసు వ్యవస్థ ఆస్తులను కూడా పిటిఐ కార్యకర్తలు ధ్వంసం చేశారని ప్రభుత్వం పేర్కొంటున్నది. దీనికి సంబంధించి లాహోర్ హైకోర్టు ఇమ్రాన్‌ఖాన్‌పై విచారణ జరిపింది. తొమ్మిది కేసులలో ఆయనకు బెయిలు నిరాకరించింది. దీనిని ఇమ్రాన్ ఖాన్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ అల్లర్లు జరిగిన సమయం లో తాను జైలులో ఉన్నానని, అల్లర్లు జరిగితే తనపై కేసులు ఎలా పెడతారని ఇమ్రాన్ ఖాన్ ప్రశ్నిస్తున్నారు. లాహోర్‌లో పిఎంఎల్–ఎన్ పార్టీ కార్యాలయంపైన, షాద్మాన్ పోలీస్‌స్టేషన్‌పైన ఇతర ప్రాంతాల్లో దాడులు చేసిన ఘటనపై దాఖలైన ఎనిమిది కేసులలో ఉగ్రవాద వ్యతిరేక కోర్టు గత ఏడాది నవంబరులో ఇమ్రాన్‌ఖాన్‌కు ఇప్పటికే బెయిలు తిరస్కరించింది. రెండేళ్ళక్రితం పదవీచ్యుతుడైన తర్వాత నుండీ తనను రాజకీయంగా బలిచేసి తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారని దేశవ్యాప్తంగా భారీ ఎత్తున ప్రచారం చేసేందుకు పిటిఐ పార్టీ ప్రయత్నం చేస్తున్నది.

## నిలదీయగలరా?
(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. విద్వేష ప్రచారాలకు పరిమితమైందని, ఇందులో గోదీ మీడియా ప్రధాన పాత్ర పోషించిందని అన్నారు. యుద్ధోన్మాదాన్ని ప్రోత్సహించేలా 'గోదీ' మీడియా ప్రసారాలు చేసిందన్నారు. జాతీయవాదాన్ని వర్గీకరించే బిజెపి వైఖరిని ఆయన ఎండగట్టారు. కల్నల్ సోఫియా ఖురేషిని బిజెపి నాయకులు లక్ష్యంగా చేసుకోవడాన్ని ప్రస్తావించారు. ఉగ్రవాదం పేరిట ఓట్లు అడిగే చరిత్రగల బిజెపి తమకు జాతీయవాదం నేర్పాలనుకోవడం హాస్యాస్పదమన్నారు. బజరంగ్ దళ్ వంటి స్థానిక ఉగ్రవాద సంస్థలపైనా దృష్టి పెట్టాలంటూ... ఇటీవల చత్తీస్‌గఢ్‌లో సన్యాసినులు(నన్స్)పై దాడిని సందోశ్ కుమార్ గుర్తుచేశారు. 1965లో పాక్‌ను ఓడించినప్పుడు రామ్‌లీలా మైదానంలో అప్పటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ప్రసంగిస్తూ పాకిస్థాన్‌తో పోరు రాజకీయమైనదే తప్ప మతపరమైనది కాదని అన్నారని గుర్తుచేశారు. పాకిస్థాన్‌ను రాజకీయ విరోధిగా ఆయన వర్ణిస్తే... ప్రస్తుత ప్రభుత్వం ఇందుకు పూర్తి భిన్నంగా మతోన్మాదాన్ని పెంచిపోషిస్తూ, ప్రతి ఊరువాడలో ఇండోపాక్ పరిస్థితి సృష్టించేందుకు యత్నిస్తోందని సందోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. యుద్ధోన్మాదాన్ని ప్రోత్సహించే మీడియా ప్రసారాలు, నినాదాలను కట్టడి చేయాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ఏ రాజకీయ పార్టీ వ్యతిరేకించలేదని, సైనికులకు అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు ఇచ్చాయని తెలిపారు. ఉగ్రవాదం వ్యతిరేక చర్యకు మద్దతిచ్చాయని గుర్తుచేశారు. కేంద్ర విదేశాంగ మంత్రి గతంలో చెప్పిన మాటాలకు, ఇప్పుడు మాట్లాడేదానికి పొంతన లేదన్నారు. యుద్ధం ఏ సమస్యకు పరిష్కారం కాదని నమ్మే పార్టీకి సిపిఐ అని చెప్పారు. 2008లో ముంబై దాడులు జరిగినప్పుడు అప్పట్లో గురాత్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి నేరుగా ప్రధానిని బలహీనుడిగా విమర్శించడం ఆమోదయోగ్యమా అని ప్రశ్నించారు. ఉగ్రవాదం పేరిట రాజకీయం చేయడం బిజెపికే చెల్లిందని సందోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. అసలు అఖండ భారత సిద్ధాంతాన్ని ఆర్‌ఎస్‌ఎస్‌ను అనుసరించే వారు నిజంగా నమ్ముతారా అన్న సందేహాన్ని సిపిఐ ఎంపి వ్యక్తం చేశారు. దేశ ప్రజలను విభజించేందుకు ఇది సమయం కాదని నొక్కిచెప్పారు. నిజమైన దేశ భక్తి, లౌకికవాదం, ఐక్యత కోసం సిపిఐ కట్టుబడి ఉందని సందోశ్ కుమార్ తెలిపారు. తన ప్రసంగం ప్రారంభంలో అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకం ద్వారా సైనికులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. 'ఆపరేషన్ సిందూర్‌లో 3000 మంది అగ్నివీరులు పాల్గొన్నారని, వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అగ్నివీర్ మురళీనాయక్ ఒకరని చెప్పారు. మురళీనాయక్ కుటుంబానికి పింఛన్‌గానీ మరే ఇతర ప్రయోజనాలుగానీ అందలేదని తెలిపారు. సైనికులకు, వారి కుటుంబాలకు అక్కరకు రాని ఇలాంటి పథకాన్ని రద్దు చేయడానికి ఇదే సరైన సమయమని సంతోశ్ కుమార్ అన్నారు. ప్రస్తుతం సైన్యంలో లక్షకుపైగా ఖాళీలు ఉన్నాయని, వీటిని సాధ్యమైనంత త్వరగా భర్తీ చేయాలని సీపీఐ ఎంపీ కోరారు.

## భారీ భూకంపం
(మొదటి పేజీ తరువాయి)

అని, దీని ఫలితంగా కమ్చట్కాలోని క్లూచెవ్స్కా సోప్కా అగ్ని పర్వతం బద్దలవుతోందని రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో భూగర్భసేవల విభాగాన్ని ఉటంకిస్తూ టాస్ వార్తాసంస్థ ప్రకటించింది. అగ్ని పర్వతం బద్దలయ్యే విస్ఫోటన దృశ్యాన్ని కూడా అకాడమీ టెలిగ్రామ్ ఛానల్‌లో పోస్టు చేసింది. రష్యా కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 11.25 గంటలకు ఈ భూకంపం సంభవించింది. రష్యాలోని సెవెరో కురిల్స్క్ పట్టణాన్ని ప్రజలు ఖాళీ చేశారు. ఈ తీరప్రాంత పట్టణంలో ఉన్న ఓడరేవు మునిగిపోయింది. అలలు 13 అడుగుల ఎత్తుకు ఎగసిపడ్డాయి. ఈ ఓడరేవులో చేపలను శుద్ధిచేసి ప్రాసెసింగ్ ఫుడ్ తయారుచేసే విభాగాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న రెండువేల మంది ప్రజలను రష్యా సురక్షిత ప్రాంతాలకు తరలించింది. భారీ నష్టం వాటిల్లలేదని పోర్టు మేయర్ ప్రకటించారు. రష్యాలో ఇప్పటివరకూ సంభవించిన అతి శక్తిమంతమైన భూకంపాలలో ఇది ఆరో భూకంపమని అమెరికా భూగర్భ సర్వే విభాగం (యుఎస్‌జిఎస్) ప్రకటించింది. గతం లో 2011 మార్చినెలలో జపాన్ ఈశాన్యప్రాంతంలో 9.0 తీవ్రతతో అత్యంత బలమైన భూకంపం సంభవించింది. ఆ తర్వాత ఆ స్థాయీ భూకంపం రావడం మళ్ళీ ఇదే.

ఆసియాలో జపాన్ పసిఫిక్ కోస్తా తీరానికి సునామీ హెచ్చరికలు చేశారు. తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. తైవాన్, పిలిప్పైన్స్, మెక్సికో, చైనాలోని షాంఘై, ఝెఝియాంగ్ ప్రాంతాలను అప్రమత్తం చేశారు. దక్షిణ అమెరికాలో చిలీ, కోస్టారికా, నికరాగువా, మెక్సికో, ఎల్‌సాల్వడార్‌లకు హెచ్చరికలు జారీ చేశారు. ఆస్ట్రేలియా ఖండంలో న్యూజిలాండ్, పపువా న్యూగినియా, సోలోమన్ ఐలాండ్స్, ద మార్క్వెసాస్, ఉవాహుకా ఐలెండ్స్, నుకూహివా, వనియాతా ప్రాంతాలకు హెచ్చరికలు ఇచ్చారు. ఉత్తర అమెరికాలో కాలిఫోర్నియా తీరం, హంబోల్ట్ నుండి ఒరెగాన్ సరిహద్దు వరకూ హెచ్చరికలు జారీ చేశారు. వాషింగ్టన్ తీరప్రాంతాలు, హవాయ్, ఓరెగాన్, దక్షిణ అలాస్కా, బ్రిటిష్ కొలంబియా తదితర ప్రాంతాల ప్రజలను జాగ్రత్తగా ఉండమని సలహాలు జారీ చేశారు.

ఈ భూకంపం కారణంగా జపాన్‌కు కూడా పెద్ద ప్రమాదం వాటిల్లడంతో ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేసింది. 20 లక్షలమందికి సునామీ హెచ్చరిక చేసిన జపాన్ ప్రభుత్వం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఐతే తర్వాత ఈ సునీమా హెచ్చరికను ఒక సలహాస్థాయికి కుదించారు. జపాన్‌లోని అణు విద్యుత్ కర్మాగారానికి అసాధారణస్థాయిలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. 2011 లో వచ్చిన భూకంపం, సునామీలో తీవ్రంగా నష్టపోయిన ఫుకుషిమా డైచీ కర్మాగారం నిర్వాహకుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమ కర్మాగారంలో 4,000 మంది కార్మికులు ప్లాంట్ భవంతి పైభాగానికి చేరుకుని భద్రంగా ఉన్నారని చెప్పారు. సునామీ హెచ్చరికవల్ల జపాన్‌లో రవాణావ్యవస్థ అస్తవ్యస్థమైంది. ఫెర్రీలు, రైళ్ళ స్లు, విమానాశ్రయాలలో కార్యకలాపాలు స్తంభించాయి. ఇవాత్‌లోని కుజీపోర్టు, హొక్కైడోలోని హమనరలో 60 సెంటీమీటర్లు సునామీ రికార్డయింది. అనేక ప్రాంతాలలో 20 సెంటీమీటర్ల మేరకు సునామీలు నమోదయ్యాయి. జపాన్‌లోని ఉత్తర తీర ప్రాంత పట్టణం మత్సుషిమాలో దజన్లమంది ప్రజలు ఇళ్ళు ఖాళీచేసి శరణార్థ ప్రాంతానికి చేరుకున్నారు. రష్యా తూర్పుతీరంలో వచ్చిన సునామీ అలలు అమెరికా పశ్చిమ ప్రాంతాన్ని కూడా తాకాయి. పెరూ దేశంలో కూడా సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి.

## నింగిలోకి నిసార్
(మొదటి పేజీ తరువాయి)

ఇస్రో, ఎల్ బ్యాండ్ సింథటిక్ ఎపర్చర్ రాడార్ను నాసా రూపొం దించాయి. ఇది మేఘాలను దాటిన తర్వాత కూడా సెం టీమీటర్ స్థాయిలో భూమిపై కదలికలను పసిగట్ట గలదు. నిసాన్ ఉపగ్రహం ప్రతి 12 రోజులకు మొత్తం భూమిని స్కాన్ చేస్తుంది. ప్రతి కదలిక లేదా మార్పును క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తుంది. బెంగ ళూరులోని యూఆర్ రావు స్పేస్ సెంటర్ (యూ ఆర్‌ఎస్సీ)లో ఈ శాటిలైటు రూపొం దించారు. ఈ ఉపగ్రహం ద్వారా భూమికి సంబంధించిన మొత్తం సమాచారాన్ని సేకరించే ప్రయత్నాలు జరుగు తున్నాయి. భూ సమాచారాన్ని సేకరించే పనిలో నిమగ్నం పెరుగుదల సహా భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు, కొండచరియలు విరిగి పడడం వంటి ప్రకతి విపత్తుల ముందస్తు సమాచా రాన్ని అందిస్తుంది. ముఖ్యంగా భూకం పాలు, అగ్ని పర్వత విస్ఫోటనాలు, కొండ చరియలు విరిగిపడటం, వరదలు, భూమి కుంగిపోవడం వంటి ప్రకతి వైప రీత్యాలను పర్యవేక్షించడంలో అర్థం చేసుకోవ డంలో శాస్త్రవేత్తలకు సహాయం చేయడమే ఈ మిషన్ లక్ష్యం.ఈ ఉపగ్రహం బరువు దాదాపు 2,800 కిలోలు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి డ్యూయెల్ఫ్రీక్వెన్సీ రాడార్తో భూమిని పరిశీలించే ఉపగ్రహం. సముద్రంపై మంచు కదలికల పరిశీలన అటు అంటార్కిటిక్ పోలార్ స్టేషన్ల చుట్టూ ఉన్న సముద్రాల మీద ఉండే లక్షణాలు పరిస్థితులను పర్యవేక్షిస్తుంది. మరోవైపు పర్యావరణ వ్యవస్థలు, వక్ష సంపద, జీవవైవిధ్యం, భూగర్భ జలాలు, సముద్ర మట్టం ఇస్రో ప్రయోగ వాహనం నిస్సార్ ఉపగ్రహాన్ని 98.40 వంపుతో 743 కిలోమీటర్ల సూర్యసమకాలిక కక్ష్య (ఎస్‌ఎస్‌ఓ)లోకి ప్రవేశపెట్టింది. ఎస్‌ఎస్‌ఓ అనేది ఒక ధ్రువ కక్ష్య. ఇక్కడ ఒక ఉపగ్రహం ప్రతిరోజూ అదే స్థానిక సౌర సమయంలో భూమిపై ఏదైనా ఇచ్చిన బిందువుపై వెళ్తుంది. నిరంతర ప్రకాశం కోసం సూర్యు డికి సంబంధించి స్థిరమైన కోణాన్ని నిర్వహిస్తుంది. ఇమేజింగ్ లేదా ఇతర సమయసున్నితమైన పనులకు ఇది అవసరం. నిసార్ మిషన్.. నాసా, ఇస్రో మధ్య సమాన భాగస్వామ్యం కలిగిఉన్నది. ఇది నాసా, ఇస్రో మధ్య మొదటి హార్డ్వేర్ సహకారాన్ని సూచిస్తుంది. అంతరిక్ష సంస్థ రాడార్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ టె క్నాలజీ, శాస్త్రీయ పరికరాలను అందిస్తోంది. ఇస్రో అంతరిక్ష నౌక, ప్రయోగ వాహనం, కార్యాచరణ మద్దతును అందిస్తోంది అని శాస్త్రవేత్తలు తెలిపారు. షార్ డైరెక్టర్ రాజరాజన్ మాట్లాడుతూ ఈ ప్రయోగం ఒక అద్భుతమని, ప్రపంచ దేశాలు ఇక భారత వైపు చూస్తాయన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు అందరికీ కతజ్ఞతలు తెలిపారు. ఎస్.ఉన్ని కష్ణన్ నాయక్ డైరెక్టర్ విఎస్‌ఎస్‌సి మాట్లాడుతూ ఈ ప్రయోగం ఒక చారిత్రాత్మక ప్రయోగమని ఇది ఇస్రో ,నాసా, శాస్త్రవేత్తల కషి ఫలితం అని తెలిపారు. ఈ ప్రయోగం విజయవంత ఆమనడంతో సులూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయ్ శ్రీ, శ్రీ సిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, కొండేపాటి గంగా ప్రసాద్, తదితరులు ఇస్రో, నాసా, శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

## ఇడి దాడులు
(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించింది. కళ్యాణ్ కుమార్, తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ సిఇఒ సబావత్ రామ్‌చందర్, ఇతర అధికారులతో కలిసి నకిలీ లబ్ధిదారుల పేరిట భారీగా నిధులను దారి మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో గత 2024 ఫిబ్రవరి 22న కెమెరెడ్డి వెటర్నరీ హిస్పిటల్‌లో అసిస్టెట్ డైర్టెర్ రవి, మేడ్చల్ పశుసంవర్ధక శాఖలో అసిస్టెంట్ డైర్టెర్ ఆధిత్య, రంగారెడ్డి జిల్లా గ్రౌండ్ వాటర్ ఆఫీసర్ రఘుపతిరెడ్డి, వైయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ గణేష్‌ను, 2024 మే31న తెలంగాణ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ సిఇఒ, మాజీ టిజిఎస్‌జిడిసి ఎఫ్ ఎండి సబావత్ రాంచదర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్‌డి కళ్యాణ్‌కుమార్‌లను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఎసిబి నమోదు చేసిన ఈ కేసుపై ఇడి కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుంది. ఈ క్రమంలోనే ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎమ్‌ఎల్‌ఏ) కింద కేసును నమోదు చేసి, ఆర్థిక లావాదేవీలను ఇడి పరిశీలిస్తోంది. ఈ స్కీంలో భారీగా నిధులు నకిలీ ఖాతాలకు బదిలీ అయినట్టు ఎసిబి గుర్తించింది. ఇందులో కళ్యాణ్ కీలక పాత్ర పోషించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే తలసాని ప్రత్యేక అధికారి కావడంతో ఆయనకు కూడా ఏమైనా ఈ స్కామ్ లో ఏమైనా సంబంధం ఉందా అని ప్రజలు అనుమానిస్తున్నారు.

## కొద్దిగే అర్థమయ్యింది
(మొదటి పేజీ తరువాయి)

ప్రధానమంత్రి ఇందిరాగాంధీని స్ఫూర్తిగా తీసుకుని ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడిని ఎదిరించాలని సూచించింది. ఆయనకు, హౌడీ మోడీకి మధ్య ఉన్న టారిఫ్ అంతా చాలా తక్కువ అని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ తన 'ఎక్స్' పోస్ట్‌లో ఎద్దేవా చేశారు. భారతదేశంపై అమెరికా అధ్యక్షుడు చేసిన అవమానాలపై ప్రధా ని మోదీ మౌనంగా ఉన్నాడని, ఆపరేషన్ సిందూర్‌ను తానే ఆపానని 30సార్లు ట్రంప్ మాట్లాడినా ఖండించకపోవడంతో ఆయన ఏకంగా పాకిస్థాన ఆర్మీచీఫ్‌కు ప్రత్యేక విందు ఇచ్చారని జైరామ్ రమేష్ చెప్పారు. అంతేకాకుండా పాకిస్థాన్‌కు అమెరికా మద్దతుతో అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్‌నుంచి ఆర్థిక ప్యాకేజీలు దక్కాయన్నారు. ప్రధానమంత్రి మోదీ ఇప్పటికైనా మాజీ ప్రధాని ఇందిరాగాంధీని స్ఫూర్తిగా తీసుకుని అమెరికా అధ్యక్షుడికి తన వైఖరిని గట్టిగా చెప్పాలని జైరామ్‌రమేష్ డిమాండ్‌చేశారు.

## మోదీ మౌన ఫలితమే
(మొదటి పేజీ తరువాయి)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేయడంపై సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన ఇక్కడొక ప్రకటన విడుదల చేశారు. వాణిజ్యాన్ని పరపతిగా ఉపయోగించి భారతదేశం పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు తాను మధ్యవర్తిత్వం వహించానని డొనాల్డ్ ట్రంప్ దాదాపు 30సార్లు ప్రకటించినా బిజెపి ప్రభుత్వం మౌనంగా ఉండటాన్ని ఆయన తప్పుపట్టారు. ఇప్పుడు ట్రంప్ మరొక అడుగు ముందుకేసి, భారతదేశంపై 25 శాతం సుంకం విధిస్తున్నామని ప్రకటించాడని, దీనికి తోడు రష్యా నుండి చమురు దిగుమతులపై జరిమానాలు (పెనాల్టీలు) కూడా ఉన్నాయని చెబితే మోదీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం సిగ్గుచేటని సిపిఐ అగ్రనేత డి.రాజా ధ్వజమెత్తారు.

## 25శాతం సుంకం
(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువగా ఉందని చెప్పా రు. పైగా భారత్‌తో అమెరికా చేస్తున్న వాణి జ్యం కూడా చాలా తక్కువేనని ట్రంప్ చెప్పారు. భారత్ ఎక్కువగా రష్యా నుండి రక్షణరంగ పరికరాలు, చమురు దిగుమతి చేసుకుంటోందని, అంతేకాకుండా భారత్–రష్యా మధ్య డబ్బుతోపనిలేకుండా గర్హనీయమైన సరుకుల మార్పిడి వ్యాపారం జరుగుతోందని విమర్శించారు. చైనా తర్వాత భారతదేశమే రష్యాతో భారీ ఎత్తున వాణిజ్యం చేస్తున్న రెండోదేశమని ట్రంప్ తప్పుపట్టారు.

అమెరికా వాణిజ్యలోటు భర్తీ చేసుకునేవిధంగా అన్ని దేశాలతో ఇక మీదట పరస్పర సమానస్థాయీ టారిఫ్‌లు అమలులోకి వస్తాయని ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన ట్రంప్ ప్రకటించారు. కానీ వీటి అమలును జులై తొమ్మిదో తేదీ వరకూ 90 రోజులు వాయిదా వేశారు. తర్వాత మళ్ళీ ఈ గడుపు ఆగస్టు 1 వరకూ పొడిగించారు. కానీ భారత్ మార్కెట్లలు తమకు పూర్తిగా అందుబాటులోకి రావాలని ట్రంప్ విధిస్తున్న షరతులవల్ల చర్చల్లో ఆటంకాలు ఏర్పడ్డాయి. ట్రంప్ 25 శాతం సుంకాలు విధిస్తూ తాజా నిర్ణయం ప్రకటించారు. ఐతే డెడ్‌లైన్స్ (గడువుతేదీలు) చట్రంలో ఇరుక్కుని వాణిజ్యంలో సమస్యలు కొనితెచ్చుకోవడం ఇష్టంలేదని భారత్ చెబుతున్నది.

అమెరికా విధించే వాణిజ్య సుంకాల భారం 15 శాతం మించకూడదని భారతదేశం కోరుతున్నది. ఇందుకు పరిహారంగా అమెరికా నుండి ఆయుధాలను, అణు రియాక్టర్లను, సహజవాయువును కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని భారత్ వాగ్దానం చేసింది. అమెరికా–భారత్ మధ్య వాణిజ్య చర్చల్లో ఎలాంటి పురోగతీ లేకపోవడంవల్ల ప్రస్తుతం ఈ సంప్రదింపులు నిలిచిపోయాయని 'ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనాన్ని ఉటంకిస్తూ టాస్ వార్తాసంస్థ బుధవారం ఒక నివేదిక ప్రచురించింది. కాగా అమెరికా–భారత్ మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక ఒప్పందంపై తదుపరి ఆరో విడత విడత వాణిజ్య చర్చలు ఆగస్టు 25వ తేదీన జరుగుతాయి. ఇందు కోసం అమెరికా బృందం భారత్‌లో పర్యటిస్తుందని న్యూఢిల్లీలో అధికారులు మంగళవారంనాడు ప్రకటించారు. గతవారంలో వాషింగ్టన్‌లో రెండు దేశాలమధ్యా ఐదో విడత వాణిజ్య చర్చలు ముగిశాయి. 25 శాతం సుంకాల ప్రకటన నిర్ణయానికి ముందు,స్కాట్‌లాండ్ నుండి వాషింగ్టన్‌కు తిరిగివస్తూ, ఎయిర్‌ఫోర్స్–1 విమానంలో ట్రంప్ బుధవారం పాత్రికేయులతో మాట్లాడారు. ఈ వారంలో గనుక వాణిజ్య ఒప్పందం చేసుకోవడంలో విఫలమైతే భారతదేశం భారీస్థాయిలో 25 శాతం మేరకు సుంకాలను ఎదుర్కోవలసి వస్తుందన్నారు.

**మళ్ళీ భారత్–పాక్ యుద్ధ ప్రస్థావన**

భారత్–పాకిస్థాన్ యుద్ధం గురించి ట్రంప్ మళ్ళీ ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఆయన మిత్రుడుగా అభివర్ణించారు. "మీకు తెలుసు, నా విజ్ఞప్తి మేరకు వాళ్ళు పాకిస్థాన్‌తో యుద్ధాన్ని ఆపేశారు, అది చాలా గొప్ప విషయం, అదేవిధంగా పాకిస్థాన్ కూడా...మేం చాలా చేశాం, ఎన్నో గొప్ప పరిష్కారాలు సాధించాం, ఈమధ్య కాంబోడియా–థాయల్‌లాండ్‌లో కూడా మేం పరిష్కారం చేశాం, మీకు తెలుసు" అని ట్రంప్ అన్నారు. వాణిజ్యాన్ని ఆయుధంగా ఉపయోగించి వారిమధ్య యుద్ధాన్ని ఆపానని ట్రంప్ మరోసారి చెప్పారు. ఏ ఇతరదేశమూ వసూలు చేయనంతగా అమెరికా నుండి భారత్ ఇప్పటివరకూ దిగుమతి సుంకాలు వసూలు చేసిందని ఆయన అన్నారు. ఇప్పుడు తాను అధికారంలోకి వచ్చినందువల్ల ఇకమీదట అలా వీలుకాదని కూడా అన్నారు. "నా ఉద్దేశం ప్రకారం పలు దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చాలా బాగా జరుగుతున్నాయి, ప్రతిఒక్కరూ ఆశాభావంతోనే ఉన్నారు, భారత్ మార్కెట్‌లో కొన్ని అమెరికా వస్తువులను ఎలాంటి టారిఫ్‌లూ లేకుండా అనుమతించమని కోరుతున్నాం" అన్నారు.

భారీ సుంకాలు ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలో, ఒప్పందం జరగకపోతే భారత్‌పై భారీ సుంకాలు విధిస్తారా? అని పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు, "ఔను, నేనూ అలాగే అనుకుంటున్నాను" అన్నారు. "వారు 25 శాతం సుంకాలు చెల్లిస్తారు" అని ట్రంప్ అన్నారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిందా? అని విమాన ప్రయాణంలో పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు ఇంకా ఒప్పందం కుదరలేదని ట్రంప్ చెప్పారు. స్కాట్‌లాండ్‌లోని తన సొంత గోల్ఫ్‌కోర్స్ లగ్జరీ భవంతిలో గడిపిన ట్రంప్ కొన్ని అధికార కార్యక్రమాలు కూడా నిర్వహించారు. స్కాట్‌లాండ్‌లో తన కొత్త గోల్ఫ్‌కోర్సును కూడా ఆయన ఈ సందర్భంగా ప్రారంభించారు. గోల్ఫ్ ఆటలు ఆడారు. ప్రైవేటు టూర్ కార్యక్రమం కింద ఆయన స్కాట్‌లాండ్ వెళ్ళి తిరిగివస్తూ భారత్‌పై విధించాలనుకుంటున్న సుంకాల విషయం పాత్రికేయులతో చెప్పారు.


**సుంకాల ప్రభావంపై అధ్యయనం చేస్తున్నాం : భారత్**

భారత్‌పై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంపై భారత్ స్పందించింది. ట్రంప్ ప్రకటించిన సుంకాల ప్రభావం ఏ మేరకు ఉంటుందనేదానిపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపింది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. రైతులు, వ్యాపారవేత్తలతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## జోగులాంబ దేవాలయ అభివృద్ధికి రూ.382.5కోట్లు : మంత్రి కొండా సురేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్: అలంపూర్ జోగులాంబ దేవాలయాన్ని సమగ్రం గా అభివృద్ధి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ దేవాలయాన్ని మూడు విడతల్లో అభివృద్ధి చేస్తున్నామని, మొత్తం రూ. 382.5కోట్లతో అభివృద్ధి చేపడుతున్నట్లు వివరించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం జోగులాంబ ఆలయ మాస్టర్ ప్లాన్‌పై ఎండోమెంటు ఉన్నతాధికారులతో మంత్రి సురేఖ, సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎండోమెంటు డిపార్టుమెంటు ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకటరావు, తెలంగాణ ధార్మిక్ అడ్వజర్ గోవింద హరి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ...కృష్ణ తుంగభద్ర నదుల సంగమ ప్రాంతంలో జోగులాంబ శక్తి పీఠం ఉందని... ఈ టెంపుల్ ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## అందరు కలిసి పనిచేయడమే...
# మానవ అక్రమ రవాణా మాఫియాకు అడ్డుకట్ట
### మంత్రి సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్: మానవ అక్రమ రవాణాను నిరోధించే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. రెడ్ హిల్స్‌లోని ఫ్యాప్సీ భవనంలో అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజ్వల ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా వెనుక పెద్ద ముఠాలు ఉంటాయని, ఆ ముఠా గురించి మాట్లాడాలంటే సామాన్యులు భయపడతారన్నారు. అలాంటిది ప్రాణాలకు తెగించి మానవ అక్రమ ముఠాపై పోరాటం చేస్తున్న ప్రజలందరికీ స్ఫూర్తిదాయకం అని తెలిపారు. మహిళల శరీరాలతో వ్యాపారం చేసే దుర్మార్గులు సమాజంలో ఉన్నారని, వీళ్ళతో వ్యాపారం చేసి ఆస్తులు కూడ పెట్టే వారికి తల్లి, అక్క, చెల్లెలు లేరా? అని ప్రశ్నించారు. ఇంట్లో మహిళలను పెట్టుకుని, ఇతర మహిళలతో వ్యాపారాలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. మహిళా భద్రత కోసం తమ కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళల్లో ఉండే పేదరికం నిర్మూలించేందుకు సెర్ప్ ద్వారా ఎన్నో కార్యక్రమాలను చేపట్టాం, వేల కోట్ల మేర బ్యాంకులో నుంచి రుణ సదుపాయం కల్పించామని, వారి వడ్డీలను కూడా బ్యాంకులకు ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. మహిళా సంఘ సభ్యురాళ్లకి 10 లక్షల ప్రమాద బీమా, రెండు లక్షల లోన్ బీమా అమలు చేస్తున్నామని అన్నారు.

మహిళా స్వయం సహాయక సంఘం అంటే కేవలం ఆర్థిక స్వావలంబనే కాదు అది మహిళల్లో సామాజిక భద్రతను, మానసిక ధైర్యాన్ని కలిగిస్తోందన్నారు. మానవ అక్రమ రవాణాపై సమిష్టి పోరాటం చేయడం ద్వారా ఆ భూతాన్ని అంతం చేయవచ్చునన్నారు. అన్ని విద్యాసంస్థల్లో లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా పై అవగాహన సదస్సులు నిర్వహిస్తాంమన్నారు. శిక్ష తోపాటు శిక్షణ ఇవ్వడం ద్వారా మహిళల పై నేరాలను అరికట్టవచ్చునన్నారు. ప్రజ్వల ఫౌండేషన్ ఛైర్మన్ సునీత కృష్ణన్ 32వేల మంది అమ్మాయిలు, మహిళలని వ్యభిచార కూపం నుంచి విముక్తి కల్పించారని అన్నారు. ఆమె బాటలో అమ్మాయిలు మహిళల కోసం పనిచేస్తున్న ఆరుగురు ప్రముఖులను ఈ సందర్భంగా మంత్రి సన్మానించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ సర్వీస్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ సిహెచ్.పంచాక్షరి, అడిషనల్ డిజిపి మహేష్ భగవత్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సెర్ఫ్ సిఇఒ దివ్య దేవరాజన్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ
# వేడుకలకు విస్తృత ఏర్పాట్లు
### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్: ఆగస్టు 15న గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో బుధవారం సీనియర్ అధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నివాళులు అర్పించనున్నారని, అనంతరం చారిత్రాత్మక గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారని, అందుకు కావాల్సిన ఏర్పాట్లపై అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని, ఈ కార్యక్రమానికి ప్రముఖులు హాజరవుతున్న సందర్భంగా తగిన భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా తెలంగాణ శాసనసభ, హైకోర్టు, రాజ్‌భవన్, సచివాలయం, తెలంగాణ తల్లి విగ్రహాలు వంటి ప్రముఖ ప్రభుత్వ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. గోల్కొండ కోటలో జరిగే అధికారిక వేడుకల్లో భాగంగా రాష్ట్ర వారసత్వం, దేశభక్తిని ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని సాంస్కృతిక శాఖను ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను దృష్టి పెట్టుకుని అందుకు అవసరమైన అగ్నిమాపక భద్రతా సిబ్బంది, అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అగ్నిమాపకశాఖ అధికారులను ఆదేశించారు. వేడుకలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిజిపి డాక్టర్ జితేందర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ

(కేంద్ర చట్టము 30/2013 యొక్క సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర రూల్ 25 (1) అనుసరించి కలెక్టర్ / అధనపు కలెక్టర్ / రాజస్వ మండలాధి కారి హుజూర్ నగర్ ( భూసేకరణ)

ఫారం-7 రూఢీ ప్రకటన

జిల్లా కలెక్టర్, సూర్యాపేట ఫైల్ నం. జి /946/2024 తేదీ: 28.07.2025
రెవెన్యూ డివిజినల్ అధికారి ఫైల్ నం. ఎఫ్/348/2024 తేదీ: 26.07.2025
హుజూర్‌నగర్
గెజిట్ నెంబర్ : 37/2025 తేదీ: 28.07.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్ట పరిచిన సూర్యాపేట జిల్లాలో మట్టంపల్లి మండలం వరదాపురం గ్రామ రెవెన్యూలో సర్వే 143 & 148 లలో గల విస్తీర్ణం **ఎ.3-03 1/2 కుంటలు** పట్టా భూమి ప్రజా ప్రయోజనం నిమిత్తం, అనగా సంత్ సేవాలాల్ రైల్వే స్టేషన్, రాఘవపురం లైన్ నుండి ఎన్సిఎల్ ఫ్యాక్టరీ మట్టపల్లి వరకు రైల్వే లైన్ ఏర్పాటు కొరకు అవసరమైనదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 లోని సెక్షన్ 19(1) అనుసరించి భూసేకరణ నిమిత్తము రూఢీ ప్రకటన జారీ చేయనైనది.

ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 ( తెలంగాణా సవరణ) చట్టం 2016 హేతుబద్ధమైన (చట్టం 21 ఆఫ్ 2017) నను సరించి సదరు భూసేకరణ చట్టం 30/2013 చాప్టర్ (2) లోని సామాజిక ప్రభావం సెక్షన్- 10 A ఆహారభద్రత పరిరక్షణ మినహాయింపు అధ్యయన నివేదిక మరియు చాప్టర్-3 ప్రకారం ఇవ్వనైనది.

కావున సూర్యాపేట జిల్లా, మట్టంపల్లి మండలం వరధాపురం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 143 & 148 లలో గల విస్తీర్ణం **ఎ.3-03 1/2 కుంటలు** గల భూమి ప్రజా ప్రయోజనం నిమిత్తం, అనగా సంత్ సేవాలాల్ రైల్వే స్టేషన్, రాఘవపురం లైన్ నుండి ఎన్సిఎల్ ఫ్యాక్టరీ మట్టపల్లి వరకు రైల్వే లైన్ ఏర్పాటు కొరకు అవసరమైనదని భావించినందున ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం రూఢీ ప్రకటన జారీ చేయనైనది.

గ్రామం: వరదాపురం మండలం: మట్టంపల్లి జిల్లా: సూర్యాపేట

| క్రమ సంఖ్య | సర్వే నెంబర్ | యాజమాన్య రకము | భూమి రకము | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణం | పట్టాదారు పేరు / ఆసక్తిగల వ్యక్తుల పేరు / చిరునామా | అనుభవదారు | సరిహద్దులు | | | | చెట్లు / నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | | | | 9 |
| 1 | 143/16/1 | [illegible] | మెట్ట | 0.03 | రూపవత్ సాలి భర్త బిచ్చ | రూపవత్ బిచ్చ తండ్రి గోల్యా | 143/1 | 143/3 | 143/2 | 143/1 | పైప్‌లైన్& తాటిచెట్టు |
| 2 | 143/10/2 | [illegible] | మెట్ట | 0.12 1/2 | రూపావత్ రాము తండ్రి తుల్స్యా | రూపావత్ లచ్చ తండ్రి రాము | | | | | బోర్ & పైప్‌లైన్ |
| 3 | 143 | [illegible] | మెట్ట | 0.09 | - | రూపవతు హర్య తండ్రి హర్జ | | | | | తాటిచెట్టు నిమ్మచెట్టు గుడి& సమాధి |
| 4 | 143 | [illegible] | మెట్ట | 0.07 | కాలువ | కాలువ | 143/2 | 143/4 | 143/1 | 143/1 | - |
| 5 | 143 | [illegible] | మెట్ట | 0.00 1/2 | - | రూపవత్ గోపా తండ్రి గోలియా | 143/3 | 143/2 | 143/1 | 143/1 | నిమ్మచెట్టు పైప్‌లైన్2 &సమాధి |
| 6 | 143 | [illegible] | మెట్ట | 0.09 1/2 | - | రూపవతు హర్య తండ్రి హర్జ | | | | | - |
| 7 | 143/లు/10/1 | [illegible] | మెట్ట | 0.12 1/2 | రూపవత్ ద్వాలి భర్త రాము | రూపవత్ రంగా తండ్రి సైదా | | | | | నిమ్మ-2 బోర్ & గుడి |
| 8 | 143లు10/2/1 | [illegible] | మెట్ట | 0.13 1/2 | రూపావత్ రామా S/o సైదా | రూపవత్ రామా S/o సైదా | | | | | - |
| 9 | 143-2/1 | [illegible] | మెట్ట | 0.00 1/2 | భూక్యా సక్కి భర్త పంతు | భూక్యా పంతు తండ్రి దీప్లా | | | | | - |
| 10 | 143/10/1 | [illegible] | మెట్ట | 0.15 | భూక్యా రామా తండ్రి బాలు | భూక్యా రామా తండ్రి బాలు | | | | | బోర్ & పైప్‌లైన్ |
| 11 | 143/32/2 | [illegible] | మెట్ట | 0.28 | భూక్యా బాలు తండ్రి వస్రం | భూక్యా బాలు తండ్రి వస్రం | | | | | గుడి & పైప్‌లైన్ |
| 12 | 148/ఇ3 | [illegible] | మెట్ట | 0.01 1/2 | రూపావత్ గోపా తండ్రి గోలియా | రూపావత్ గోపా తండ్రి గోలియా | 148/1 | 149 | 148/1 | 143/2 | - |
| 13 | 148/ఆ5 | [illegible] | మెట్ట | 0.05 | బానోత్ దేవ్లా తండ్రి గోలియా | రూపావత్ దేవ్లా తండ్రి గోలియా | | | | | - |
| 14 | 148/ఆ3/3 | [illegible] | మెట్ట | 0.05 1/2 | రూపావత్ బిచ్చ తండ్రి గోలియా | రూపావత్ బిచ్చ తండ్రి గోలియా | | | | | - |
| 15 | 148 | [illegible] | మెట్ట | 0.00 1/2 | - | రూపావత్ లచ్చ తండ్రి రాము | | | | | - |
| మొత్తం విస్తీర్ణం | | | | 3.03 1/2 | | | | | | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూ సేకరణ పై వచ్చిన అభ్యంతరాలు పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించుట లేదు.

ఆ భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, ప్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన భూమిని భూ సేకరణ చేయు భూములు యొక్క నమూనా భూ సేకరణ అధికారి మరియు రాజస్వమండలాధికారి హుజూర్ నగర్ నందు కార్యాలయపు పనివేళల నందు చూసుకొనవచ్చును.

సం/- భూసేకరణ అధికారి & రెవిన్యూ డివిజినల్ అధికారి హుజూర్‌నగర్
సం/- అదనపు కలెక్టర్ సూర్యాపేట
సం/- జిల్లా కలెక్టర్ సూర్యాపేట

DIPR RO NO.432/LA/PP/Advt/Pub/2025-26


# సకాలంలో ఎరువుల సరఫరాపై అవగాహన
### బిజెపి నేతలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హితవు

ప్రజాపక్షం/హైదరాబాద్: పంట కాలాలు, ఎరువుల కేటాయింపులు, సరఫరాలపై బిజెపి నాయకులు కనీస అవగాహన పెంచుకుంటే మంచిదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బిజెపి నేతలు చేస్తున్న రాజీనామా సవాళ్లు రాజకీయ స్వార్థంకోసం కాకుండా, ఎరువులను సకాలంలో సరఫరా చేయాలని కేంద్రంపై ఒత్తిడి పెంచేలా చేస్తే బాగుటుందని మంత్రి తుమ్మల హితువు పలికారు. కేటాయింపుల ప్రకారం యూరియా ఇవ్వకుంటే రాజీనామా చేస్తా అంటే తెలంగాణ రైతాంగం హర్షిస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఖరీఫ్ కోసం కేటాయించిన ఎరువులను అడుగుతుంటే.. రాష్ట్ర బిజెపి నాయకులు మాత్రం అరిగిపోయిన గ్రామఫోన్‌లాగా పదేపదే 2024–25 యాసంగి గురించి మాట్లడటం వారి అవివేకానికి అద్దం పడుతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుయ్యబట్టారు. 2024–25 యాసంగికి సంబంధించిన మిగులు యూరియా 1.92 మెట్రిక్ లక్షల టన్నులు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఉన్నందువల్లే, కేంద్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ లో కేటాయింపుల ప్రకారం ఇవ్వకపోయిన కూడా మా అధికారులు ఇప్పటివరకు సర్దుబాటు చేయగలిగారని పేర్కొన్నారు.. ఒక రాష్ట్రానికి బిజెపి అధ్యక్ష పదవిలో ఉంటూ, ఇలాంటి అర్థరహిత మాటలు మాట్లాడటం సరికాదన్నారు. వారికి లెక్కలు తెలియకుంటే.. తెలుసుకొని మాట్లాడాలి కానీ.. ఎవరో రాసిచ్చిన మాటలను మాట్లాడొద్దని హితవు పలికారు. మీ అధ్యక్ష పదవిపై మీ పార్టీ నాయకులకు చాలా మందికి కోరిక ఉందని, కావున మీ చేత ఇలాంటి మాటలు మాట్లాడించి.. రాజీనామా చేయించాలనిచూస్తున్నారని, కాని తాము మాత్రం మీరు చాలా రోజులు ఈ అధ్యక్ష పదవిలో కొనసాగాలని కోరుకుంటున్నామన్నారు. ఖరీఫ్‌లో రాష్ట్ర అత్యధిక యూరియా వినియోగం 10.48 లక్షల మెట్రిక్ టన్నులు అని, దానిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్ కోసం 11.50 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా అడిగిందని, కాని రాష్ట్రం వద్ద 2024–25 యాసంగికి సంబంధించిన మిగులు యూరియా 1.92 మెట్రిక్ లక్షల టన్నులు ఉన్నందున, 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందని మంత్రి తెలిపారు.ఇందులో నెలవారిగా కేటాయింపుల ప్రకారం జులై నెలవరకు రాష్ట్రానికి 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా ఇప్పటి వరకు సరఫరా చేసింది కేవలం 4.36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమేనని మంత్రి వెల్లడించారు. దీంతో జులై వరకు 2.24 లక్షల మెట్రిక్ టన్నులు లోటు ఏర్పడిందన్నారు. ఖరీఫ్ మొత్తానికి రావాల్సిన యూరియా పరిమాణం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కాగా రాష్ట్రానికి అందింది 4.36 లక్షల మెట్రిక్ టన్నులు పోను రానున్న రెండు నెలల్లో 5.44 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రం రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉందన్నారు. ఇది సకాలంలో అందే విధంగా కేంద్రం పై ఒత్తిడి తీసుకురావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బిజెపి నేతలకు సూచించారు.

## ప్రభుత్వ విధానాల కారణంగా
# అయోమయంలో అంగన్‌వాడీ టీచర్లు
### కరుణ కుమారి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా రాష్ట్రంలో ఉన్న దాదాపు 65 వేలమంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పరిస్థితి అయోమయంగా మారిందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నండూరి కరుణ కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. 65ఏళ్లు నిండిన తర్వాత రిటైర్ అవుతున్న అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.1లక్ష చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ టీచర్లను సర్వీసును బట్టి సూపర్‌వైజర్ పోస్టులలో నియమించాలని కోరారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18వేలు వేతనంతో పాటు కనీస పెన్షన్ రూ. 5వేలు ఇవ్వాలని, సెంటర్ అద్దెలు, గ్యాస్, ఆరోగ్య లక్ష్మి బిల్లులు ప్రతినెలా చెల్లించాలన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో 1000పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ స్కూల్స్ నిర్వహించాలని రూ.33కోట్లు కేటాయించడం అదే విధంగా నాలుగేళ్ళు నిండిన చిన్నారులను మాత్రమే ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చేర్చుకోవాలి అనే నిబంధనలు అంగన్‌వాడీ కేంద్రాలకు, నూతన విద్యా విధానం మధ్య తేడాలు స్పష్టమైన సమాచారం లేక అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూల్స్‌గా మారిస్తే టీచర్లను, ఆయాలను మొదటి ప్రాముఖ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ వీరికి పోటీగా తాత్కాలిక పద్ధతిలో ఒక టీచర్, ఒక ఆయాను నియమించడం సరికాదన్నారు. ఇందుకు బదులుగా అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు వేతనాలు పెంచి అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, భవిష్యత్ పోరాటాలకు సిద్ధంగా ఉన్నారని కరుణ కుమారి హెచ్చరించారు.

# దొడ్డ పద్మకు అంతిమ వీడ్కోలు
### పలువురు సిపిఐ నాయకుల సంతాపం



ప్రజాపక్షం/కోదాడ: హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే దొడ్డ నర్సయ్య సతీమణి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ దొడ్డ పద్మ ఆశయాలను సాధించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం చిలుకూరులో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధురాలు దొడ్డ పద్మ మృతదేహం వద్ద నివాళులర్పించి ఆమె అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కొరియర్‌గా సేవలు అందించిన ఘనత దొడ్డ పద్మ అని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సమయంలో తన భర్త దొడ్డ నర్సయ్యతో కలిసి నల్లమల అడవుల్లో మూడేళ్లపాటు అజ్ఞాతవాసం చేసిన మహోన్నత వ్యక్తి దొడ్డ పద్మ అన్నారు. సిపిఐ నాయకులు దొడ్డ పద్మను స్ఫూర్తిగా, ఆదర్శంగా తీసుకుని ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. ఆమె మరణం సిపిఐ పార్టీకి తీరనిలోటు అన్నారు. ఆమె సేవలను కొనియాడారు. అనంతరం చిలుకూరు గ్రామంలో కామ్రేడ్ దొడ్డ పద్మ అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా ఆమె అంత్యక్రియల్లో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల నాయకులు పాల్గొని సంతాపం వ్యక్తంచేసి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, కోదాడ, మునుగోడు మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, ఉజ్జిని యాదగిరిరావు, ఎఐటియుసి రాష్ట్ర నాయకుడు ఉజ్జిని రత్నాకర్, పార్టీ జాతీయ నాయకులు పశ్య పద్మ, పోటు కళావతి, సిపిఐ సూర్యాపేట, ఖమ్మం జిల్లాల కార్యదర్శులు బెజవాడ వెంకటేశ్వర్లు, దండి సురేష్, రాష్ట్ర మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యల్లావుల రాములు, ధనుంజయనాయుడు, మేకల శ్రీనివాసరావు, ఉస్తేల నారాయణరెడ్డి, బద్దం కృష్ణారెడ్డి, ఎస్‌కె లతీఫ్, బత్తిని హనుమంతరావు, దేవరం మల్లేశ్వరి, గుండు వెంకటేశ్వర్లు, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు కొండా కోటయ్య, దొడ్డ వెంకటయ్య, రెమిడాల రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్తవరపు పాండురంగారావు, వేనేపల్లి వెంకటేశ్వర్లు, బుర్రి శ్రీరాములు, వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

## సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా దామోదర్ రెడ్డి



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా యానాల దామోదర్ రెడ్డి ఎన్నికైనారు. సహాయ కార్యదర్శులుగా బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య ఎన్నికయ్యారు. వలిగొండ మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా 4వ మహాసభలో 17 మంది కార్యవర్గ సభ్యులను, 45 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభల్లో జిల్లాలోని ప్రధాన సమస్యలపై చర్చించి 15 తీర్మానాలు చేశామని, తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని రాష్ట్ర నాయకత్వం ప్రకటించారని యానాల దామోదర్ రెడ్డి తెలిపారు.

# ధర్మస్థల ఘటనపై ప్రత్యేక బృందంతో విచారణ
### మహిళా సంఘాల నేతలు డిమాండ్




ప్రజాపక్షం/హైదరాబాద్:ధర్మస్థల ఘటనపై నిష్పక్షపాతమైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆధ్వర్యంలో అన్ని కోణాలలోనూ దర్యాప్తుచేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. జాతీయ మహిళా కమిషన్ చొరవ తీసుకొని ధర్మస్థల లో నిజనిర్ధారణ చేయాలని, బాధితుల కుటుంబాలకు సరైన న్యాయం, పునరావాసం, ప్రభుత్వ పరంగా మద్దతు లభించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ లోని రాజ్ బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో బుధవారం భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ధర్మస్థల ఘటనపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఎం.సదా లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా మహిళా సమాఖ్య జాతీయ సహాయ కార్యదర్శి డాక్టర్ కె.రజని, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, శ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ ప్రేమపావని, ఎస్.ఛాయాదేవి, కృష్ణకుమారి, పడాల నళిని, ఐద్వా ఆశా లత, సామాజిక కార్యకర్త ఖలీదా పర్వీన్, పిఒడబ్ల్యూ అనసూర్య, సిఎంఎస్ జ్యోతి, తిరుమల, సవితలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థల పుణ్యక్షేత్రంలో వెలుగులోకి వచ్చిన ఘటన సమాజాన్ని తీవ్రంగా కలచివేస్తోందన్నారు. గతంలో అక్కడ స్వచ్ఛతా (పారిశుద్ధ్య) కార్మికుడిగా పనిచేసిన వ్యక్తి స్వయంగా పోలీస్ స్టేషనుకు వెళ్లి 1995 నుండి 2014 మధ్య వందమందికి పైగా హత్యకు గురయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసేంత వరకు కూడ స్థానిక పోలీసులు ఇతర ప్రభుత్వ యంత్రాంగం పసిగట్టలేకపోవడం దారుణమన్నారు. ఈ దారుణ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని మానవ హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఇందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హత్యకు గురైనవారిలో కొంతమందిపైన లైంగికదాడులు జరిగినట్టుగా ఫిర్యాదు చేసిన వ్యక్తి ఆరోపించిన నేపథ్యంలో దీనిపై సమగ్ర డిమాండ్ చేపట్టాలని మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అదేవిధంగా ధర్మస్థలను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. తెలంగాణ నుండి మహిళా సంఘాలతో కూడిన నిజ నిర్ధారణ కమిటీ ధర్మస్థలకు వెళ్లనుందని తెలిపారు.

## జిఒలతో బిసిల రిజర్వేషన్ల పెంపు సాధ్యం కాదు

ప్రజాపక్షం/హైదరాబాద్: బిసిలకు రిజర్వేషన్లను పెంచని బిజెపి, బిసి వ్యక్తిని ఎలా ముఖ్యమంత్రి చేస్తుందని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ ప్రశ్నించారు. జిఒ, ఆర్డినెన్స్‌ల ద్వారా బిసిల రిజర్వేషన్ల పెంపు సాధ్యం కాదన్నారు. రాజ్యాంగం 243డి ని సవరిస్తే బిసిల రిజర్వేషన్లు పెంచవచ్చని, మోదీకి చిత్తశుద్ధి ఉంటే ఆ ఈ పని చేయవచ్చని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల పెంపు విషయంలో సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ లో ధర్నాలు చేయాల్సిన అవసరం లేదని, రాహుల్ గాంధీతో మాట్లాడి ప్రధాని మోదీపై ఒత్తిడి పెంచాలని, సిఎం తన వెంట రాహుల్‌ను తీసుకుని మోదీ వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి పంపిన బిల్లులను పార్లమెంటులో ఆమోదించాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ ఇద్దరూ తలచుకుంటే పార్లమెంటు లో ఏ బిల్లునైనా ఆమోదించవచ్చన్నారు. ప్రతిపక్షనాయకునిగా రాహుల్ గాంధీ పార్లమెంటులో బిసి రిజర్వేషన్ల ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టవచ్చని ఆయన చెప్పారు. ఒక అంశంపైన బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు ఆర్డినెన్స్ ఆమోదానికి నోచుకోబోదని తొమ్మిదో షెడ్యూల్ లో చేర్చనిదే రిజర్వేషన్ల పెంపు సాధ్యం కాదని వినోద్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సోమభరత్ కుమార్, లీగల్ సెల్ ప్రతినిధులు జక్కుల లక్ష్మ ణ్, సి.కళ్యాణ్ రావులు పాల్గొన్నారు.


**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం - రామాయంపేట్**

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

1) e-NIT No.s: E1/MCR/S/D of Fogging Machines, Autos, Home Stead Plants and Engage of JCB, Labours/under MGF/15th FCG Tide Grants/GB 2025


**పనుల సంఖ్య:** 4 నెం.లు, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ:** 31.07.2025న ఉ.10.30గం.లకు, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేదీ:** 02.08.2025న సా.5.30గం.ల వరకు, **ప్రైస్ బిడ్ ప్రారంభ తేది (ఫైనాన్షియల్ బిడ్ స్టేజ్):** 02.08.2025న సా.5.35గం.లకు. **గమనిక:** టెండర్ గురించి పూర్తి వివరాలను tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఇతర సమాచార కోసం కమిషనర్ & ఇంజనీర్, రామాయంపేట మున్సిపాలిటీకి చెందిన వారి నుండి పొందవచ్చు. ఫోన్ నెం. 7989695428, 9948296849.

సం/- కమిషనర్, రామాయంపేట మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 5779-PP/CL/ADVT/1/2025-26, Date: 30-07-2025

# ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** ట్రాక్టర్ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మండల పరిధిలోని కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామ పంచాయతీ లోని బాపూజీ నగర్ స్టేజీ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ మండలం తాటికోల్ గ్రామానికి చెందిన దమ్మోజు ఆంజనేయాచారి(37) కొండమల్లేపల్లి పట్టణంలోని తమ బంధువుల ఇంటికి పని నిమిత్తం వచ్చి పని ముగించుకొని తిరిగి మధ్యాహ్నం తాటికోల్‌కు వెళుతుండగా ఉప్పువాగు సమీపాన బాపూజీనగర్ స్టేజీ వద్ద యూటర్న్ వద్ద ఆకస్మాతుగా వచ్చిన ట్రాక్టర్ ఆంజనేయచారి వెళుతున్న బుల్లెట్‌ను ఢీ కొట్టడంతో ఆంజనేయచారి అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మృతుడి అక్క ఈశ్వరమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీర రమేష్ తెలిపారు.



# సిఎంఆర్ బకాయిలు ఉంటే కేటాయింపులు ఇవ్వొద్దు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** సిఎమ్మార్ ధాన్యం పెండింగ్ ఉన్న మిల్లులకు వచ్చే సీజన్‌లో ఎట్టి పరిస్థితుల్లో కేటాయించేది లేదని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ అధికారులు, అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి 2023/24 పెండింగ్‌పై జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బకాయిలు పెండింగ్‌లో ఉన్న మిల్లర్లు గడువులోగా సిఎమ్మార్ ధాన్యాన్ని అందించాలని అదేశించారు. సిఎమ్మార్ పెండింగ్‌లో ఉన్న మిల్లర్లకు వచ్చే సీజన్‌లో సిఎమ్మార్ కేటాయించేది లేదన్నారు. బకాయి ఉన్న మిల్లర్లు 100 శాతం బ్యాంక్ గ్యారెంటీ ఇస్తేనే ఆ మిల్లులకు సిఎమ్మార్ ధాన్యాన్ని కేటాయించడం జరుగుతుందని తెలిపారు. మిల్లర్లు సిఎమ్మార్ ధాన్యాన్ని వేగంగా అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌వో మోహన్‌బాబు, ఎసిఎస్‌వో శ్రీనివాసరెడ్డి, ఎఎం బెనర్జి, డిటిలు, ఆర్ఐ లు పాల్గొన్నారు.



# యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతులకు యూరియాను అందుబాటులో ఉంచాలని కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో ఆయన సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా అధికారులు వెంటనే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే గత ప్రభుత్వాల కంటే ముందుగానే సాగునీటిని విడుదల చేశామని, ఎరవులు కొరత లేకుండా, బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా, దుకణాదారులు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా నిరంతరం సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. తమ సమస్య ఏదైనా ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నట్లయితే 15రోజుల్లో సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు కృషి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు

దేవరకొండ శాసనసభ్యులు బాలునాయక్



**ప్రజాపక్షం/చింతపల్లి :** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేస్తామని దేవరకొండ శాసనసభ్యులు నైనావత్ బాలునాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఆహార భద్రత కార్డులను ఎమ్మెల్యే బాలు నాయక్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో లబ్ధిదారులకు బుధవారం రేషన్ కార్డులు అందజేశారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమం, అభివృద్ధి పేరుతో పేదలకు పథకాలు అందజేస్తుందన్నారు. చింతపల్లి మండలానికి 1666 నూతన రేషన్ కార్డులు మంజూరు అయ్యాయన్నారు. ప్రజా ప్రభుత్వం పేదల కోసం రేషన్ కార్డులు పంపిణీతో పాటు, సన్న బియ్యం ఇచ్చే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఏక కాలంలో 2లక్షల రూపాయల వరకు రైతు రుణమాఫీని రైతుల ఖాతాలో జమ చేసిన ఏకైక ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్నారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, అంగిరేకుల నాగభూషణ్, కొండూరి భవాని పవన్ కుమార్, ముచ్చర్ల యాదగిరి, వెంకటయ్య గౌడ్, యాచారం యాదయ్య గౌడ్, జితేందర్ రెడ్డి, నర్సిరెడ్డి, గోవర్ధన్, శ్రీనివాస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేసుల దర్యాప్తులో సమగ్ర విచారణ

జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్



**ప్రజాపక్షం/మర్రిగూడ:** శాంతి భద్రతల పరిరక్షణకు అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలు అందుబాటులో ఉంటూ పని చేయాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆదేశించారు. బుధవారం దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలోని మర్రిగూడ పోలీస్ స్టేషన్ లో జిల్లా ఎస్పి ఆకస్మిత తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ లో సిబ్బంది పని తీరు,పోలీసు స్టేషన్ పరిధిలోని పరిసరాలు,స్థితిగతులు గురించి యస్.ఐ ని అడిగి తెలుసుకుని రిసెప్షన్ మేనేజ్మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్,స్టేషన్ రైటర్, లాక్ అప్, యస్.హెచ్.ఓ రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించి, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివరాలు,స్టేషన్ రికార్డ్ లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని దర్యాప్తులో ఉన్న కేసులను సమగ్ర విచారణ చేపట్టి చట్టప్రకారం శిక్ష పడే విధంగా కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పి మౌనిక,ఎస్.ఐ కృష్ణా రెడ్డి స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# బిసిలకు 42శాతం రిజర్వేషన్ల కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో కల్పించేలా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని, రిజర్వేషర్లను బిజేపి ప్రభుత్వం వ్యతిరేకించడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఊర రామ్మూర్తియాదవ్, జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్ లు అన్నారు. జిల్లా కేంద్రంలోని మహావీర్ ఫుడ్‌కోర్టులోని మిని ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జనసేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు తగుళ్ల జనార్ధన్ యాదవ్ ఆధ్వర్యంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా కుల గణనతో పాటు, బీసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ క్యాబినెట్ తీర్మానించడం హర్షణీయమని తెలిపారు. బిఆర్ఎస్ హాయంలో బిసిలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. తమిళనాడు తరహాలో తెలంగాణ రాష్ట్రం బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టపల్లి సైదులు, వెంకట్, సైదులు, గుండు వెంకన్న యాదవ్, సందీప్, బొల్లెద్దు వినయ్, భద్రబోయిన సైదులు, బడుగుల నాగార్జున, కోలా కరుణాకర్, బొమ్మగాని వినయ్, మల్లేష్, శివ పాల్గొన్నారు.



# ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి

నూతన రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావు చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్యమాట్లాడుతూ పేదోళ్ల ఆత్మ గౌరవానికి ప్రతిక అయిన తెల్లరేషన్ కార్డును అర్హులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో అందించడం జరుగుతుందని అన్నారు. రైతులు ఆనందంగా ఉన్నప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని నమ్మి రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగు నీరు అందించడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల పదేళ్ల నిరీక్షణకు తెరదించి సుమారుగా 8 లక్షల నూతన రేషన్ కార్డులు జారీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డిదని అన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ఎవరు అధైర్య పడవద్దని తెలిపారు. గుండాల మండలంలో నూతనంగా 522 రేషన్ కార్డులు మంజూరు కావడం జరిగిందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని అలాంటిది తమ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవానికి రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. తమ ప్రభుత్వంలో ఎస్సి వర్గీకరణతో పాటు 42 శాతం బిసి రిజర్వేషన్‌కు సిఫారస్ చేయడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పేదలకే చేరాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు రైతు భరోసా ఇచ్చిందని, రుణమాఫీ చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరిగౌడ్, పిఏసిఎస్ చైర్మన్ బిక్షం, మండల పార్టీ అధ్యక్షులు రాంరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ విమల వెంకటేశ్వర్లు, ఎంపిడివో, సివిల్ సప్లై అధికారి, కుమార్, డా. వెంకన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



**ప్రజాపక్షం/నూతన్‌కల్:** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు మంజూరు చేయడంతో పాటుప్రతి ఒక్కరికి ఆరుకేజీల చొప్పున సన్నబియ్యం అందజేయడం, అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి పేదింటికలను నెరవేర్చి రాష్ట్రంలోని ప్రతి పేదవాడి కళ్లలో ఆనందాన్ని నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఏ ప్రభుత్వం పేద ప్రజలను పట్టించుకోలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నాయకత్వంలో జిల్లాలో సన్నబియ్యం, నూతన రేషన్‌కార్డుల పంపిణీ చేశారని గుర్తు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ మాట్లాడుతూ మండలంలో 1959 నూతన రేషన్‌కార్డులు మంజూరు చేయడం జరిగిందని, మొత్తం 6398 మంది నూతన రేషన్‌కార్డు సభ్యుల పేర్లు నమోదు చేయడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు రేషన్‌కార్డు కోసం ఎప్పుడైన దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రీయ అని అన్నారు. అర్హులైన, నిరుపేద, ఇల్లులేని వారికి మండలంలో 280 మంది ఇండ్లు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఎర్రపహడ్ గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్ర నూతన భవన నిర్మాణానికి, దిర్శనచర్ల గ్రామంలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాదవరావు, మండల స్పెషల్ ఆఫీసర్ యాదగిరి, మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, వైస్ చైర్మన్ సిహెచ్ వెంకన్న, పిఏసిఎస్ చైర్మన్ నాగం జయసుధ, తహసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునిత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ నాయకులు జన్నారెడ్డి పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేద్దాం

యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి

జిల్లాలోని ప్రధాన సమస్యల పైన 15 తీర్మాలను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన జిల్లా మహాసభ



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** రానున్న రోజుల్లో సిపిఐని యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్మాణ పరంగా బలోపేతం చేసి, మహాసభలో చేసిన 15 తీర్మానాలపై భవిష్యత్తులో పోరాటాలు ఉద్యమాలు నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని, స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నూతనంగా ఎన్నికైన సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం భువనగిరి పట్టణంలోని రాఘవేంద్ర బ్యాంకెట్ హాలో నిర్వహించిన వేలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ వలిగొండ మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్‌లో 29 జూలై 2025న జరిగిన సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా 4వ మహాసభలో ముఖ్యఅతిధులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోద శ్రీరాములు హాజరైనారని రాష్ట్ర నాయకత్వం సమీక్షంలో 17 మంది కార్యవర్గ సభ్యులుగా 45 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. అందులో సిపిఐ జిల్లా కార్యదర్శిగా యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులుగా బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, కార్యవర్గ సభ్యులుగా బండి జంగమ్మ, కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, ఎండి ఇమ్రాన్, బోడ సుదర్శన్, ఉప్పల ముత్యాలు, చెక్క వెంకటేష్, బచ్చనగోని గాలయ్య, కుసుమని హరిచంద్ర, ఏశాల అశోక్, పల్లె శేఖర్ రెడ్డి, పెరబోయిన మహేందర్, చిగుర్ల లింగం, కురిమిద్ద శ్రీనివాస్‌లను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ మహాసభల్లో జిల్లాలోని ప్రధాన సమస్యలపై చర్చించి 15 తీర్మానాలు చేశామని, తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని రాష్ట్ర నాయకత్వం ప్రకటించారని యానాల దామోదర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు జిల్లా సమితి సభ్యులు అంజయ్య, ఉప్పల శాంతి కుమార్, మూల పోచయ్య, భారతమ్మ, మండల కార్యదర్శి దాసరి లక్ష్మ య్య పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, గనబోయిన వెంకటేష్, మల్లేశం పాల్గొన్నారు.

# అమ్మకు భరోసా

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలతో పాటు సాధారణ ప్రసవాలు పెంచడమే లక్ష్యంగా భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఏర్పాటు చేసిన అమ్మకు భరోసా కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోనీ గర్భిణీ దడిపల్లి మమతను ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లతో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి కలిసి పండ్లు, పౌష్టికాహారం ఇచ్చి పుట్టింటివారు జరిపినట్లు సీమంతం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ సర్కారు దవాఖానల్లో అందిస్తున్న సదుపాయాలను వివరించారు. సాధారణ ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేసి, ఆపరేషన్తో కలిగే ఆర్థిక, ఆరోగ్య నష్టం గురించి అర్థమయ్యేలా తెలియజేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎంసి కవిత ఆర్పి, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ అంగన్వాడి టీచర్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# మూడేళ్లలో డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తాం

వానాకాలం పంటకు డిండి ప్రాజెక్టు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/డిండి :** డిండి ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగానికి వానాకాలం పంటకు సంబంధించి డిండి ప్రాజెక్టు నీటిని లెఫ్ట్ కెనాల్ ద్వారా దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ ఇరిగేషన్ అధికారులతో కలిసి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ ప్రాజెక్టు నీటిని ఇంజనీర్లు అధికారులు రైతులు సమన్వయంతో పంటలు పండే విధంగా నీటిని పొదుపుగా వాడుకొని ఇబ్బంది లేకుండా పంటలు పండేలా కృషి చేయాలన్నారు. ఎగువన కురిసిన వర్షాల వల్ల ప్రాజెక్టులోకి నీరు రావడం జరుగుతుందని కేఎల్ఐ ద్వారా నడిచే మోటార్లతో ఎగువ నుండి నీటిని తీసుకురావడానికి ప్రయత్నాలు సాగిస్తున్నామని తెలిపారు. వరుణుడు సైతం కనికరించి వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి జులై నెలలో మీరు రావడం శుభ పరిణామం అని అన్నారు. గత సంవత్సరం సైతం పూర్తి స్థాయిలో పంటలు పండడం జరిగిందని కేఎల్ఐ ద్వారా నీటి కోసం సిఈ, ఎస్ఈలతో మాట్లాడి సానుకూల వాతావరణంలో నీరు అందించేందుకు వీలుందని రైతులతో సమన్వయం చేసుకొని అధికారులు నీటినందించాలన్నారు. ఎదుల నుండి డిండి ప్రాజెక్టులోకి నీటిని తరలించేందుకు డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని అన్నారు. ఈప్రాంత రైతాంగానికి సాగునీరు అందించేందుకు డిండి లిఫ్ట్ ఇరిగేషన్ దోహదపడుతుందని తెలిపారు. అనంతరం ఆర్బి ఆర్బి గురుకుల పాఠశాలలో 10.80లక్షల హెచ్‌డిఎఫ్‌సి నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు ఐమాస్ట్ లైట్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కెజిబివి పాఠశాలలో 8లక్షల హెచ్‌డిఎఫ్‌సి నిధులతో మౌలిక సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. అనంతరం భవిత సెంటర్‌ను పరిశీలించారు. బయట సెంటర్‌లో అన్ని సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. డిండి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఎల్‌ఏ పరిశీలించారు. భోజన నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో మౌలిక సదుపాయాలు కల్పన, ప్రహరీ గోడ నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, ప్రాజెక్టు ఈఈ ఎలమందయ్య, డిఈ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, మండల పార్టీ అధ్యక్షులు రాజేష్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, కనకాచారి, మైనోద్దిన్, వెంకటరమణ, నాయకులు భాస్కర్‌రెడ్డి, రుక్మారెడ్డి, నాగార్జున్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్ గౌడ్, ఎంఈవో గోప్యానాయక్ పాల్గొన్నారు.




# అపార్ట్‌మెంట్ అడ్డాగా పేకాట

ఐదుగురిని వలపన్ని పట్టుకున్న స్పెషల్ బ్రాంచ్ పోలీసులు

రూ. 4,600 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు సీజ్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** గుట్టుచప్పుడు కాకుండా ఓ అపార్ట్‌మెంట్‌ను అడ్డగా చేసుకుని గత కొంతకాలంగా సాగుతున్న పేకాట స్థావరాన్ని సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్ పోలీసులు బుధవారం నమ్మదగ సమాచారంతో వలపన్ని పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి నుండి రూ.4600 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ వసుధ ఎలైట్ అపార్ట్‌మెంట్‌లోని ఐదవ ఫ్లోర్‌లో ఉన్న ఓ ఫ్లాట్‌లో ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీస్ వాహహంలో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామానికి చెందిన గార్లాపాటి వెంకటరెడ్డి తో పాటు జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు బోల్ల సంజీవరెడ్డి, శ్రీశ్రీనగర్‌కు చెందిన మరో రిటైర్డ్ ఉపాధ్యాయులు నిమ్మల వెంకటేశ్వర్లు, మోతె మండలం రావిపహాడ్ గ్రామానికి చెందిన యర్రా లక్ష్మారెడ్డి, చివ్వెంల మండలం తిరుమలగిరి గ్రామ రేషన్‌డీలర్ కంచర్ల లింగారెడ్డి లు ఉన్నారు.

# అనుమానంతో భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** అనుమానంతో కట్టుకున్న భార్యనే కడతేర్చేందుకు కత్తితో దాడి చేసిన సంఘటన భువనగిరి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని రాయిగిరి గ్రామంలో నివాసం ఉంటున్న వరంగల్ జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగబోయిన లావణ్య కొంత కాలంగా భర్త రవితో విభేదాల కారణంగా దూరంగా ఉంటూ తమ నలుగురు పిల్లలతో కలిసి గత కొన్ని నెలలుగా భువనగిరి మున్సిపల్ పట్టణంలోని రాయిగిరిలో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తన భార్య లావణ్య, శంకర్ అనే మరో వ్యక్తితో కలిసి ఉండటాని రవి చూసినట్లు చెప్పారు. వీరు కలిసి ఉండటాన్ని తట్టుకోలేక పోయిన రవి తన భార్య లావణ్యను కోడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. స్థానికులు గమనించి 108 సహాకారంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికీ తరలించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న భువనగిరి రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడు రవిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ప్రజావాణిలో వృద్ధుల మొర

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బిడ్డ,కొడుకు చేతిలో మోసపోయామని ప్రత్యేక ప్రజావాణిలో వృద్ధ దంపతులు తమ మొరను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆలకించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండలంలోని ఆలగడప గ్రామపంచాయతీ ఆలగడప క్యాంపులో నివసిస్తున్న యాట్ల దుర్గమాంబ వృద్ధురాలు నడవలేని స్థితిలో ఉన్న భర్త యాట్ల నరసింహామూర్తి తాము మోసపోయామని ఫిర్యాదు చేశారు. వృద్ధ దంపతుల వద్దకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వెళ్లి వారి ఫిర్యాదును రాసి స్వీకరించారు. సర్వే నెం.543/2లో ఉన్న 4.25ఎకరాల భూమిలో తనకున్న నలుగురు సంతానంలో పెద్ద కుమారుడు యాట్ల శ్రీనివాస్‌రావు తన భార్య పేరిట 2 ఎకరాలు, కూతురు ఈదర భారతి అలియాస్ సుబ్బలక్ష్మి భర్త వీరభద్రరావులు మోసపూరితంగా 2 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఉన్న భూమి కాస్త ఇద్దరు తీసుకున్నారని తమను పోషించడం లేదన్నారు. తమకు న్యాయం చేయాలని వారు ఎమ్మెల్యేను వేడుకున్నారు. 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని వృద్ధ దంపతులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



# ఎరువులు పురుగు మందుల దుకాణాల తనిఖీలు

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** మండల పరిధిలోని ఎరువులు పురుగు మందులు దుకాణాలను తనిఖీలు చేసి పరిశీలిస్తున్నట్లు ఉండవెల్లి మండల వ్యవసాయ అధికారి అనిత తెలిపారు. బుధవారం అల్లంపూర్ చౌరస్తాలోని చెరువులను పురుగుమందుల దుకాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను పరిశీలించారు. రైతులకు అన్యాయము ఇబ్బందులు కలగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖచ్చితమైన ధరల పట్టిక నమోదు చేసి స్టాక్ వివరాలను పొందుపరచాలని వారు డీలర్లకు సూచించారు. అల్లంపూరు చౌరస్తాలోని షణ్మిక అగ్ర ఏజేన్సీ పవన్ ట్రేడర్స్ తదితర దుకాణాల డీలర్లే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. కొనుగోలు చేసిన రైతులకు ఖచ్చితంగా రసీదు ఇవ్వాలనే వారు తెలిపారు. ఎరువులు ఈ పాస్ మిషన్ ద్వారా ఆధార్‌కార్డు నమోదు చేసి చిన్న సన్న కారు రైతులకు ఉపయోగపడే విధంగా డీలర్లు పనిచేయాలని వారు తెలిపారు. ఎరువులు పురుగుల మందుల విషయాలపై అనుమతి లేని వాటిని విక్రయిస్తే లైసెన్సు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## మధ్యప్రదేశ్‌లో 23,000 మంది మహిళలు, బాలికలు మిస్సింగ్

**భోపాల్:** మధ్యప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 23,000మంది మహిళలు, బాలికలు కనిపించడం లేదు. అత్యాచారం, మహిళలపై జరిగిన నేరాలతో సంబంధం ఉన్న 1,500 మంది నిందితులు పరారీలో ఉన్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ విషయాలను స్వయంగా అసెంబ్లీకి వెల్లడించారు. బిజెపి పాలిత మధ్యప్రదేశ్‌లో మహిళలు, బాలికలు అదృశ్యమవుతున్నారు. మహిళలపై అత్యాచార కేసులు కూడా పెరుగుతున్నాయి. మాజీ హోంమంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలా బచ్చన్ దీనిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కేసుల వివరాలను అసెంబ్లీలో కోరారు. కాగా, దీనిపై మధ్యప్రదేశ్ సిఎం మోహన్‌యాదవ్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2024 జనవరి 1 నుంచి 2025 జూన్ 30 వరకు 21175 మంది మహిళలు, 1954 మంది బాలికలు అదృశ్యమయ్యారు. ఏడాదికిపైగా ఆ రాష్ట్రంలో తప్పిపోయిన మహిళల సంఖ్య 23129కు చేరుకున్నదని ఆయన వెల్లడించారు. మరోవైపు అత్యధికంగా సాగర్ జిల్లాలో 1,069 మంది మహిళలు మిస్సింగ్ అయ్యారు.

## ఏడోరోజూ పార్లమెంట్ మకరద్వారం వద్ద ప్రతిపక్షాల ఆందోళన

### ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్



**న్యూఢిల్లీ :** వరుసగా ఏడవ రోజు కూడా పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రతిపక్ష ఎంపిలు నిరసన తెలిపారు. బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా సవరణను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీతో సహా ఇండియా కూటమి పార్టీలకు చెందిన ఎంపిలు బుధవారం ఆందోళన నిర్వహించారు. వెంటనే ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ఇతర ప్రతిపక్ష ఎంపిలు బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్లమెంట్ మకర ద్వారం మెట్లపై, సమీపంలో వరుసగా ఏడవ రోజు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సమయంలో వారు 'ఎస్ఐఆర్ లోక్‌తంత్ర పే వార్' అని రాసి ఉన్న భారీను ప్రదర్శించారు. 'ఎస్ఐఆర్‌'ను ఆపండి' అంటూ ప్లకార్డులతో కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జెడి, వామపక్ష పార్టీలతో సహా ప్రతిపక్ష పార్టీల పలువురు ఎంపిలు నిరసనలో పాల్గొని నినాదాలు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్‌లో 'ఓటర్ల ఓటు హక్కును తొలగించడం' లక్ష్యంగా ఇసి ఈ చర్య చేపట్టిందని ఆరోపిస్తూ, ప్రతిపక్షాలు పార్లమెంటు ఉభయ సభలలో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నాయి. ఈ అంశంపై ఉభయ సభలలో చర్చ జరగాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు బుధవారం మధ్యాహ్నం ముందు జరిగిన రాజ్యసభ సమావేశంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల కమిషన్ నిర్వహించిన బిహార్ ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై చర్చకు ఒత్తిడి తీసుకురావడంతో రాజ్యసభ కార్యకలాపాలు వాయిదా పడ్డాయి. సభ ఎజెండాను ప్రవేశపెట్టగానే ఎస్ఐఆర్‌పై చర్చ ఎప్పుడు జరుగుతుందో సూచించమని కాంగ్రెస్, టిఎంసి చైర్మన్‌పై ఒత్తిడి తెచ్చాయి. ఎంపిలు అత్యవసర ప్రజా ప్రాముఖ్యత గల అంశాలను లేవనెత్తే ఎజెండాను, జీరో అవర్ ప్రస్తావనలను చేపట్టాలని డిప్యూటీ చైర్మన్ హరివంశ్ కోరారు. ఎస్ఐఆర్‌పై చర్చ కోరుతూ ప్రతిపక్ష నాయకులు చేసిన వ్యాఖ్యలు రికార్డు చేయబడవని ఆయన పేర్కొన్న తర్వాత కొద్దిసేపటికే ప్రతిపక్ష ఎంపిలు తమ డిమాండ్ కోసం పట్టుబట్టడంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. టిఎంసి నాయకుడు డెరెక్ 'బ్రెయిన్ మాట్లాడుతూ, ప్రతిపక్షం సభ నిర్వహణకు ప్రభుత్వంతో 100 శాతం సహకరిస్తోందని, అయితే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మిగిలిన రెండు వారాల్లో ఎస్ఐఆర్ గురించి చర్చించాలని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎస్ఐఆర్‌పై చర్చ ఎప్పుడు జరుగుతుందో సమయం, తేదీని సూచించాలని చైర్మన్‌ను కోరారు. బిహార్‌లో అక్టోబర్‌న–వంబర్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్రంలోని రాజకీయ విధానంష భారత ఎన్నికల సంఘం లక్షలాది మంది ఓటర్ల ఓటు హక్కును తొలగించడానికి ప్రయత్నిస్తున్నాయని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. ముందుగా, డిప్యూటీ చైర్మన్ రూల్ 267 కింద 18 నోటీసులు వచ్చాయని, అలాంటి నోటీసుల ద్వారా లేవనెత్తిన అంశాన్ని చర్చించడానికి ఆ రోజు పనిని పక్కన పెట్టాలని కోరుతున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు అనుగుణంగా లేనందున 18 నోటీసులను చైర్మన్ తిరస్కరించారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు సన్యాసినులను అన్యాయంగా అరెస్టు చేశారనే ఆరోపణలపై సిపిఐకి చెందిన సందోష్ కుమార్, జాన్ బ్రిట్టాస్ (సిపిఎం) చర్చ జరపాలని డిమాండ్ చేయగా, మాజీ రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాపై రాంజిలాల్ సుమన్ (ఎస్‌పి) చర్చ జరపాలని కోరారు.

## సింధు జల ఒప్పందంపై అప్పటి ప్రధాని నెహ్రూ తప్పును మోదీ సర్కారు సరిదిద్దింది

### రాజ్యసభకు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడి

### కాల్పుల విరమణపై ఎలాంటి థర్డ్ పార్టీ లేనేలేదని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌పై, పాకిస్థాన్‌కు భారత్ సింధు జలాలను నిలిపివేయడంపై తరచూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలను బుధవారం రాజ్యసభలో విదేశీవ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ తోసిపుచ్చారు. పాకిస్థాన్‌తో సింధు జల ఒప్పందాన్ని నిలిపివేయాలని నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలను జైశంకర్ వివరించారు. ఒప్పందాన్ని నిలిపివేయడం ద్వారా అప్పటి భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ విధానాలలోని తప్పును నరేంద్రమోదీ ప్రభుత్వం సరిదిద్దిందని చెప్పారు. జవహర్‌లాల్ నెహ్రూ శాంతిని నెలకొల్పడానికి కాదని, బుజ్జగింపుకోసమేనన్నారు. పహల్గామ్ దాడి ప్రపంచవ్యాప్తంగా దు:ఖం, దిగ్భ్రాంతిని కలిగించిందని జైశంకర్ ఆవేదన వ్యక్తంచేశారు. 'కానీ ప్రశ్న ఏమిటి అంటే, ఆ తర్వాత ఏమిటి? అనే దానికి రెండు సమాధానాలు అన్నారు. ఒకటి ఆ విధమైన దాడి అంగీకారయోగ్యం కాదు. అది మన సరిహద్దును దాటింది. అందువల్ల చాలా తీవ్రమైన పరిణామాలు ఉండాలి' అని వినిపించాయని జైశంకర్ వివరించారు. 'రెండవది ఏమిటంటే నేరస్థుడు జవాబుదారీగా ఉండాలి. వారు, వారి మద్దతుదారులను న్యాయం ముందు నిలబెట్టాలి, ప్రస్తుతం మొదటి దానికి భారతదేశం ఆగ్రహం సమాధానం. పహల్గామ్ దాడి జరిగిన మరుసటిరోజు ఏప్రిల్ 23న కేంద్ర కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది' అని విదేశీవ్యవహారాల మంత్రి జైశంకర్ వివరించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌తో భారత్ కాల్పుల విరమణను తీసుకువచ్చేలా థర్డ్ పార్టీ జోక్యం లేనేలేదని, మిలిటరీ చర్య నిలిపివేయడం వెనుక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్యంతో ఎలాంటి ముడిపెట్టలేదని జైశంకర్ స్పష్టంచేశారు. ఆయన రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన ప్రత్యేక చర్చలో విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ జోక్యం చేసుకుంటూ పహల్గామ్ దాడి జరిగిన ఏప్రిల్ 22నుంచి జూన్ 16వరకూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణలు జరుపలేదని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు.

## వయనాడ్ వరద బాధితులకు రుణాలు మాఫీ చేయండి


### కేంద్ర ప్రభుత్వానికి ప్రియాంకాగాంధీ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** తన నియోజకవర్గంలో సంభవించిన వరదలు, కొండచరియలు విరిగిపడిన బాధితులైన వారి రుణాలను మాఫీ చేయాలని కేరళలోని వయనాడ్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపి ప్రియాంకా గాంధీ వాద్రా కేంద్రాన్ని కోరారు. బాధిత ప్రజలు తమ జీవితాలను పునర్నిర్మించుకోవడంలో కేంద్ర సహాయం లేకపోవడం పట్ల ఆమె విచారం వ్యక్తం చేశారు. లోక్ సభలో జీరో అవర్ సందర్భంగా వాద్రా ఈ అంశాన్ని లేవనెత్తుతూ కేరళ జిల్లాలో కొండచరియలు విరిగిపడటం, వరదల కారణంగా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని, 17 కుటుంబాలు తుడిచిపెట్టుకుపోయాయని, 1,600కి పైగా భవనాలు ధ్వంసమయ్యాయని చెప్పారు. వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, కాఫీ తోటలు, టీ తోటలు, యాలకులు... ఆటో డ్రైవర్లు, జీపు డ్రైవర్లు, హోమ్ స్టేలు నడుపుతున్న, చిన్న వ్యాపారాలు చేసే వ్యక్తుల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే విపత్తు జరిగి ఒక సంవత్సరం అయిందని, బాధితులకు ఇప్పటికీ సరైన పునరావాసం కల్పించలేదని ఆమె మండిపడ్డారు. ఏడాది కాలంగా తాము వయనాడ్ కోసం నిధులను విడుదల చేయాలని అభ్యర్థిస్తున్నామని, కొన్ని నిధులు విడుదలయ్యాయి, కానీ అవి సరిపోలేదన్నారు. ప్రజలు ప్రాణాలను, మొత్తం జీవనోపాధిని కోల్పోయారని, తమ జీవితాలను పునర్నిర్మించుకుంటూ రుణాలు తిరిగి చెల్లించాలని ఆశిస్తున్నారా? అని ప్రశ్నించారు. కొండచరియలు విరిగిపడటం, వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని అభ్యర్థించగా తొలుత తిరస్కరించినా చివరికి తీవ్రమైన ప్రకృతి విపత్తుగా పేర్కొన్నందుకు సంతోషిస్తున్నామన్నారు.

## అశ్లీల కంటెంట్‌ను ప్రసారం చేసే మొత్తం 43 ఒటిటిలపై నిషేధం

### వెల్లడించిన కేంద్ర సమాచార, ప్రసారాలశాఖ సహాయమంత్రి మురుగన్





**న్యూఢిల్లీ :** ఒటిటి వేదికల్లో విచ్చలవిడిగా అందుబాటులో ఉన్న అభ్యంతరకర వీడియోలను కట్టడి చేయడమే లక్ష్యంగా కేంద్రం చర్యలు చేపడుతోంది. అశ్లీలత, అనైతికత, హింసను ప్రోత్సహించే కంటెంట్‌ను ప్రసారం చేసే పలు ఒటిటి వేదికలపై కొరడా ఝుళిపిస్తోంది. ఇటీవల 24 యాప్‌లు, వెబ్‌సైట్లపై నిషేధించగా.. ఇప్పటివరకు 43 ఒటిటి వేదికలను బ్లాక్ చేసినట్లు కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ సహాయమంత్రి డా.ఎల్. మురుగన్ లోక్‌సభకు వెల్లడించారు. అశ్లీలత, హింస, సాంస్కృతిక అంశాలపై సున్నితమైన కంటెంట్‌ను నియంత్రించేందుకు చట్టపరమైన, నైతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టిన చర్యల్లో భాగంగానే 43 ఒటిటి ప్లాట్‌ఫారమ్‌లను నిషేధించినట్లు పేర్కొన్నారు. ఒటిటి వేదికలు చట్ట విరుద్ధమైన కంటెంట్‌ను ప్రసారం చేయరాదని తెలిపారు. ప్రసారం చేసే కంటెంట్‌ను వయస్సు ఆధారంగా వర్గీకరించాలని సూచించిన మంత్రి.. ఇది ఐటి చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారమే జరగాల్సి ఉంటుందన్నారు. పిల్లల వయస్సుకు తగని రీతిలో ఉన్న కంటెంట్‌ను నియంత్రించేందుకు తగిన రక్షణ చర్యలు, యాక్సెస్ నియంత్రణ చర్యలను అమలు చేయాలని ఒటిటి వేదికలకు సూచించారు. చట్టాలను ఉల్లంఘించేలా కంటెంట్‌ను ప్రసారం చేస్తున్న 43 ఒటిటిలపై సంబంధిత మంత్రిత్వశాఖలతో సంప్రదింపుల అనంతరం నిషేధం విధించినట్లు తెలిపారు. ఒటిటి యాప్‌లు, సర్వీస్ ప్రొవైడర్లు తాము ప్రసారం చేసే కంటెంట్‌పై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్రం ఇటీవల హెచ్చరించిన విషయం తెలిసిందే.

## సన్యాసినుల అరెస్టును నిరసిస్తూ కేరళ ఎంపిల ఆందోళన



**న్యూఢిల్లీ :** ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు కాథలిక్ సన్యాసినుల అరెస్టును నిరసిస్తూ కేరళకు చెందిన మరికొందరు ప్రతిపక్ష ఎంపిలతో కలిసి పార్లమెంటు భవనం ఆవరణలో ఎంపి ప్రియాంకాగాంధీ వాద్రా నిరసన తెలిపారు. బిజెపిని తీవ్రంగా విమర్శించారు. లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభమయ్యే ముందు, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్, ఆర్ఎస్‌పి ఎంపి ఎన్.కె. ప్రేమ్‌చంద్రన్, కేరళకు చెందిన మరికొందరు కాంగ్రెస్ ఎంపిలు పార్లమెంటులోని మకర ద్వారం సమీపంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. నారాయణపూర్‌కు చెందిన ముగ్గురు బాలికలను బలవంతంగా మతమార్పిడి చేసి అక్రమ రవాణా చేశారని ఆరోపించిన స్థానిక బజరంగ్ దళ్ కార్యకర్త ఫిర్యాదు మేరకు ఈనెల 25న దుర్గ్ రైల్వే స్టేషన్‌లో సన్యాసినులు ప్రీతి మెర్రీ, వందన ఫ్రాన్సిస్, సుకమాన్ మాండవిలను అరెస్టు చేశారు. కేరళకు చెందిన కొంతమంది సన్యాసినులతో చాలా దారుణంగా ప్రవర్తించారని, వారు చేయని పనులకు వారిపై ఆరోపణలు చేశారని, ఛత్తీస్‌గఢ్ పోలీసులు వారి పట్ల దురుసుగా ప్రవర్తించి ఆతరువాత వారిని తీసుకెళ్లారని ప్రియాంకాగాంధీ మండిపడ్డారు. మైనారిటీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా తాము నిరసన తెలుపుతున్నామని చెప్పారు. ఈ దారుణాన్ని అంతం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కాగా, కేరళలోని కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కూటమి నాయకుల ప్రతినిధి బృందం మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ సెంట్రల్ జైలును సందర్శించి, మానవ అక్రమ రవాణా, బలవంతపు మత మార్పిడి ఆరోపణలపై అరెస్టయిన ఇద్దరు కాథలిక్ సన్యాసినులను కలిసింది. తరువాత ప్రతినిధి బృందం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయిని కూడా కలిసి పరిస్థితి వివరించగా, ఈ విషయాన్ని పూర్తిగా దర్యాప్తు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## అల్‌ఖైదా అనుబంధ సంస్థకు చెందిన షామా పర్వీన్ అరెస్టు

### బెంగళూరులో అదుపులోకి తీసుకున్న గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్




**అహ్మదాబాద్ :** నిషేధిత అల్‌ఖైదా అనుబంధ సంస్థకు చెందిన మహిళను గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అదుపులోకి తీసుకుంది. 'అల్‌ఖైదా ఇన్ ద ఇండియన్ సబ్ కాంటినెంట్ (ఎక్యూఐఎస్) తరఫున పనిచేస్తున్న 30 ఏళ్ల షామా పర్వీన్‌ను బెంగళూరులో అరెస్ట్ చేశారు. జార్ఖండ్‌కు చెందిన ఆమె గత నాలుగేళ్లుగా బెంగళూరులో ఉంటున్నట్లు తెలిపారు. కర్ణాటక నుంచి ఆమె ఉగ్రవాదులకు సహాయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని అన్నారు. అంతకుముందు కొన్నిరోజులు హైదరాబాద్‌లోనూ నివసించిందని, ఆ తర్వాతే బెంగళూరుకు మకాం మార్చిందని తెలిపారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా యువతను ఉగ్రవాదంలోకి ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. ఒక అల్‌ఖైదా ఆపరేటివ్ వీడియోను కూడా ఆమె షేర్ చేసినట్లు గుర్తించారు. షామా పర్వీన్‌ను బెంగుళూరులో అరెస్ట్ చేసి అహ్మదాబాద్ తరలించారు. దేశంలో ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్నవారిని గుర్తించడానికి అధికారులు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగానే ఆమెను అరెస్ట్ చేశారు. జులై 23న ఎక్యూఐఎస్‌తో సంబంధమున్న మహమ్మద్ ఫర్దీన్, సెఫుల్లా కురేషి, జీషన్ అలీ, మహమ్మద్ ఫైక్ అనే నలుగురు ఉగ్ర అనుమానితులను గుజరాత్, ఢిల్లీ, నోయిడాలో అదుపులోకి తీసుకున్నా రు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ గ్రూప్ సభ్యులు ఉన్నారని తెలిపారు. వారందరికీ షామా పర్వీన్ నాయకత్వం వహిస్తున్నట్లు వెల్లడించారు. వీరంతా సోషల్ మీడియాలోని ఓ రహస్య, ఆటో డిలీటెడ్ యాప్ ద్వారా సంప్రదింపులు జరుపుకుంటున్నారని వెల్లడించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉగ్ర దాడులు అమలుచేయడానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించామని చెప్పారు.

**దేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారం ఉగ్ర ముఠాలకు...** అల్‌ఖైదా, ఇతర ఉగ్రవాద సంస్థలకు చెందిన స్లీపర్‌సెల్ విభాగంతో, విదేశాలలోని ఉగ్ర సంస్థలతో వీరికి సంబంధాలు ఉన్నాయని అనుమానిస్తున్నారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టినట్లు ఎటిఎస్ అధికారులు తెలిపారు. దేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని వీరు ఉగ్ర ముఠాలకు చేరవేస్తున్నారని అధికారులు అంటున్నారు. ఇంకా ఈ గ్రూప్‌నకు చెందిన ఇతర ఉగ్రవాద మద్దతుదారులు, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు చేసే వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## నిమిషప్రియ మరణశిక్ష రద్దు అవాస్తవం

### విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ

### యెమన్ నుంచి మాకు ఎలాంటి అధికారిక సమాచారం లేదని స్పష్టీకరణ

### భారత గ్రాండ్ ముఫ్తీ అబూబకర్ ముస్లియార్ ప్రకటన నేపథ్యంలో ఎంఇఎ వివరణ



**న్యూఢిల్లీ :** యెమన్‌లో భారతీయ నర్సు నిమిష ప్రియ మరణశిక్షను రద్దుచేశారంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని బుధవారం ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇలాంటి సున్నిత విషయాలలో ఎలాంటి అవాస్తవాలు, ఊహాగానాలకు తావు లేదని, వీటిని నివారించాల్సిన అవసరం ఉందని తేల్చిచెప్పాయి. యెమన్‌లో నిమిషప్రియ మరణశిక్షరద్దు అయ్యిందని భారతదేశానికి చెందిన గ్రాండ్ ముఫ్తీ అబూబకర్ ముస్లియార్ సోమవారం రాత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. గ్రాండ్ ముఫ్తీ వివరణపై ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఓ), విదేశీవ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించాయి. నిమిషప్రియ మరణశిక్షను రద్దు చేసిన విషయమై యెమన్ నుంచి ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంఇఏ) తెలిపింది. 'ఇలాంటి సున్నితమైన విషయాలపై తప్పుడు సమాచారం, ఊహాగానాలకు దూరంగా ఉండాలని మే ం ప్రజలను కోరుతున్నాం' అని ప్రభుత్వవర్గాలలో ఒకటి తెలియజేసింది. భారతీయ నర్సు నిమిష ప్రియ స్వస్థలం కేరళ రాష్ట్రం పాలక్కాడ్ జిల్లాలోని కొల్లెన్‌గోడ్ .2017లో యెమన్ పౌరుడి హత్య కేసులో ఆమె అపరాధానికి పాల్పడిందని రుజువైంది. ఈ నేపథ్యంలో నిమిష ప్రియకు యెమన్ కోర్టు 2020లో ఆ దేశానికి చెందిన సుప్రీం జ్యుడీషియల్ కౌన్సిల్ మరణ శిక్ష విధించింది. మరణశిక్షను రద్దు చేయాలన్న ఆమె అభ్యర్థనను 2023 నవంబర్‌లో తోసిపుచ్చింది. జులై 17న విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ యెమన్ ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు నిమిషప్రియ మరణశిక్ష రద్దు విషయమై సంప్రదింపులు జరుపుతున్నామని తెలియజేసింది.

## ఆశా కార్యకర్తలకు ప్రోత్సాహకం పెంపు

### రూ.1000 నుంచి రూ. 3వేలకు పెంపు

**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఇప్పటికే పలు హామీలు కురిపించారు. తాజాగా ఆశాకార్యకర్తలకు ప్రోత్సాహా న్ని ప్రకటించారు. ప్రస్తుతం వారికి నెలకు చెల్లిస్తున్న రూ.1,000 ప్రోత్సాహాన్ని రూ.3వేలకు పెంచారు. అదే విధంగా మమతా ఆరోగ్య కార్యకర్తలకు ఇస్తున్న ప్రోత్సాహాన్ని రెట్టింపు చేస్తూ రూ.300 నుంచి రూ. 600లకు పెంచారు. నవంబర్ 2005లో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి తాము ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి విస్తృతంగా పనిచేశామని, గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్తలు (ఆశా), 'మమతా' కార్మికులు గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మెరుగుపరచడంలోగణనీయమైన పాత్ర పోషించారని నితీశ్ బుధవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆశా కార్యకర్తలకు ఇప్పుడు 'రూ.1,000కి బదులు గా రూ.3,000 ప్రోత్సాహకం అందించబడుతుంది అన్నారు. 'మమత' కార్మికులకు ఇప్పుడు డెలివరీకి రూ.600 ప్రోత్సాహక లభిస్తుందన్నారు. ఇది ప్రస్తుతం ఉన్న రూ.300 నుండి రూ.600 పెంచబడిందని ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటనపై ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య మంత్రిగా తన 17 నెలల పదవీకాలంలో ఆశా, మమత' కార్యకర్తలకు ప్రోత్సాహక మొత్తాన్ని పెంచే ప్రక్రియను ప్రారంభించానన్నారు. ఈ మెరుగైన ప్రోత్సాహక మొత్తం వారి మనోధైర్యా న్ని పెంచుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తుందన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే ఈ మొత్తాలను పెంచాల్సిన ఉండేదని, కానీ ఆ తర్వాత ముఖ్యమంత్రి ఎప్పటిలాగే యుటర్న్ తీసుకున్నారు (బిజెపితో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు) అని తేజస్వీ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ అసమర్థ ఎన్‌డిఎ ప్రభుత్వం రెండేళ్లుగా దానిపై (ప్రోత్సాహకాన్ని పెంచే ప్రతిపాదన) కూర్చుని ఉంది. చివరకు, వారు మా డిమాండ్‌కు తలొగ్గి ఆశా, మమతా వర్కర్లకు ప్రోత్సాహక మొత్తాన్ని పెంచాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఓటమి భయంతో తమ ఆలోచనలు, డిమాండ్లను కాపీ చేస్తోందని తేజస్వి పేర్కొన్నారు. ఈ దార్శనికత లేని ప్రభుత్వం రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో తుడిచిపెట్టుకుపోతుందని విమర్శించారు.

## కోర్టు గది సరిపోదు.. క్రికెట్ స్టేడియం కావాలేమో!

## సెంథిల్ బాలాజీ కేసులో 'సుప్రీం' వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : తమిళనాడు ప్రభుత్వం తీరుపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. మాజీ మంత్రి వీ సెంథిల్ బాలాజీ ప్రమేయం ఉన్న ఉద్యోగ కుంభకోణంపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి మాజీ మంత్రి డబ్బులు తీసుకున్నట్లుగా అభియోగాలు నమోదైన విషయం తెలిసిందే. జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మల్య బాగ్చి ధర్మాసనం తమిళనాడు సర్కారుపై మండిపడింది. ప్రభుత్వం కావాలనే విచారణను ఆలస్యం చేస్తున్నట్లుగా కనిపిస్తోందని మండిపడింది. ప్రభుత్వం కేసును మూసివేసేందుకు ప్రయత్నిస్తే.. న్యాయశాఖ అడ్డుకుందంటూ మందలించింది. ఈ కేసులో 2000 మంది నిందితులు, 500 మంది సాక్షులుగా ఉన్నారన్న ధర్మాసనం.. భారత్‌లో అత్యధిక మంది విచారణలో పాల్గొన్న కేసు ఇదే అవుతుందేమోనని వ్యాఖ్యానించింది. నిందితులందరికీ కోర్టు గది సరిపోదని.. ఓ క్రికెట్ స్టేడియం కావాలంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. నిందితుడు, సాక్షుల పూర్తి వివరాలు సమర్పించాలని సర్వోన్నత న్యాయస్థానం తమిళనాడు సర్కారును ఆదేశించింది. బాలాజీ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ విచారణకు హాజరయ్యారు. అన్నాడీఎంకే హయాంలో సెంథిల్ బాలాజీ రవాణాశాఖ మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి లంచం తీసుకున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఈ మేరకు ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఆయన స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీలో చేరి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రవాణాశాఖ కేసులో ఆయనను ఈడీ 2023లో అరెస్టు చేసింది.

## పిఒకెను తిరిగి స్వాధీనం చేసుకుంటాం

### పహల్గామ్ దాడిలో లష్కరే తోయిబా హస్తం : అమిత్ షా



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడిలో లష్కరే తోయిబా హస్తం ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలిపా రు. ఆపరేషన్ మహదేవ్ చేపట్టి అంతం చేసిన ముగ్గురు ఉగ్రవాదులు ఆ ఉగ్రసంస్థకు చెందినవారేనని స్పష్టం చేశారు. వాస్తవానికి పహల్గామ్ దాడి వెనుక ఉన్న ఉగ్రవాదుల తలపై కాల్చి చంపాలని ప్రజలు కోరుకున్నారని, యాదృచ్ఛికంగా ఆ ముగ్గురు ఉగ్రవాదులను మన బలగాలు తలపైనే గురిచూసి కాల్చాయని ఆయన రాజ్యసభలో చెప్పారు. మహిళలు, పిల్లల ముందు మతం అడిగి మరీ చంపేశారని, ఇంత అనాగరిక నేరం ఇంతకు ముందు ఎన్నడూ జరగలేదని అమిత్‌షా అన్నారు. కాంగ్రెస్‌కు జాతీయ భద్రత కంటే రాజకీయాలే ముఖ్యమైపోయాని అమిత్‌షా విమర్శలు గుప్పించారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో కాంగ్రెస్ సంతృ ప్తి పడుతోందని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాక్ ఆక్రమిత కశ్మీర్‌లను పాకిస్థాన్‌కు ఇచ్చేసిందని, కానీ బిజెపి దానిని తిరిగి భారత్‌లో చేరుస్తుందని అమిత్ షా స్పష్టం చేశారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాల వల్లే ఉగ్రవాదం వృద్ధి చెందిందని ఆయన విమర్శించారు. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి ఉంటే, ఉగ్రవాదులపై చర్య తీసుకునే బదులు పత్రాలను పంపి ఉండేదని ఆయన ఆరోపించారు. భారత్‌లో ఉగ్రవాదం పూర్తిగా అంతరించే దిశలో ఉందని, అది కచ్చితంగా అంతం అవుతుందని అమిత్ షా అన్నారు. హిందువులు ఎప్పటికీ ఉగ్రవాదులు కాలేరని, ఈ విషయాన్ని ప్రపంచానికి గర్వంగా ప్రకటిస్తున్నానని తెలిపారు. మరోవైపు అమిత్ షా మాట్లాడడం ప్రారంభించగానే ప్రతిపక్ష పార్టీలు నిరసనలు వ్యక్తం చేశాయి. ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడాలని డిమాండ్ చేశాయి. కానీ సభాధ్యక్షులు విపక్షాల డిమాండ్‌ను అంగీకరించలేదు. దీంతో వారు వాకౌట్ చేశారు.

ప్రజాపక్షం
గురువారం, 31 జులై

# పనిగంటల ప్రకంపనలు

'తక్కువ ఖర్చు... ఎక్కువ లాభం' అనే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ మూల సూత్రం నిన్న మొన్నటివరకూ కేవలం ఉత్పత్తి రంగానికే పరిమితంకాగా, నేడు క్రమంగా సేవా రంగంలోనూ వేళ్లానుకుంటున్నది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) నిపుణులు, ఉద్యోగుల పనిని 9 నుంచి 10 గంటలకు పెంచడానికి కర్ణాటక ప్రభుత్వం చేసిన ప్రయత్నం ప్రకంపనలు సృష్టిస్తున్నది. తీవ్ర వ్యతిరేకత వ్యక్తమై, ఉద్యమం బలపడడంతో, కర్ణాటక దుకాణాలు మరియు వాణిజ్య సంస్థల (సవరణ) బిల్లు, 2025లోని ఈ కీలక అంశాన్ని అక్కడి ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దీనితో, సమస్యకు తాత్కాలికంగా తెరపడింది. కర్ణాటక రాష్ట్ర ఐటి/ఐటిఇల ఎంప్లాయిస్ యూనియన్ (కెఐటియు/కిటు) ఆధ్వర్యంలో జరిగిన పోరాటం సత్ఫలితాలనిచ్చింది. సేవా రంగంలోని అసంఘటిత ఉద్యోగులు ఏకం కావాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది. అదే సమయంలో, ఐటి రంగంలో పనిగంటల విషయంలో కర్ణాటక ప్రయత్నాలు దేశ వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఐటి, ఐటిఇలలో పని గంటలను చట్టబద్ధంగా పొడిగించడానికి వీలుగా 1961నాటి చట్టాన్ని సవరించడానికి పూనుకోవడం పెట్టుబడిదారులకు ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్న వైనాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నది. కర్ణాటక సర్కారు తీసుకురావాలనుకున్న బిల్లును, గత ఏడాది 14 గంటల షిఫ్ట్‌లను చట్టబద్ధం చేయడానికి జరిగిన విఫలయత్నానికి కొనసాగింపుగానే చూడాలి. రోజువారీ పని గంటలను పెంచడంతో పాటు, అదనంగా రెండు గంటల ఓవర్ టైంను జోడించి, దానిపై త్రైమాసిక పరిమితిని 50 నుండి 144 గంటలకు పెంచే ప్రయత్నాలను ఐటి ఉద్యోగులు నిర్ద్వంద్వంగా తిరస్కరించడం సహేతుకమే. ప్రతిపాదిత బిల్లు ముమ్మాటికీ పని వెలుపల ఉద్యోగుల వ్యక్తిగత, కుటుంబ జీవితాలపై దాడే. ఇప్పటికే ఒత్తిడి అధికంగా ఉన్న ఐటి రంగంలో ఎక్కువ పని గంటలు ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. నిజానికి, ఐటి రంగంలో పని గంటల పెంపు వివాదం హఠాత్తుగా ఊడిపడిందేమీ కాదు. జాతీయ ఉత్పాదకతను పెంచడానికి దేశంలోని యువత వారానికి 70 గంటల వరకు పని చేయాలని 2023 చివరలో, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్‌ఆర్ నారాయణ మూర్తి చేసిన ప్రతిపాదన దుమారం రేపింది. మన దేశ పని సంస్కృతి భవిష్యత్తును సమస్యల ఊబిలోకి దించేసే ప్రయత్నాలను తేటతెల్లం చేసింది. ఉద్యోగులకు, యంత్రాలకు మధ్య తేడాను తుడిచేవేసే దుష్ట సంప్రదాయాన్ని తెరపైకి తెచ్చింది. నిజానికి ఎక్కువ పనిగంటలతో ఉద్యోగుల నుంచి మెరుగైన నైపుణ్యాలను కోరుకోవడం అత్యాశే. దాని వల్ల ఆశించిన ఫలితాలు రాకపోగా, అలసిపోయిన ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్యం ఒక్కోసారి ఉత్పాదకతను తగ్గిస్తుంది. యాజమాన్యాలు అనుసరించే శ్రమ దోపిడీకి అనుకూల వాతావరణం కల్పిస్తుంది. ఉద్యోగాల కోతకు అధికారికంగా మార్గం సుగమమం చేస్తుంది. ఈ పరిస్థితుల్లో, ఐటి నిపుణులను ప్రత్యక్షంగా, సేవా రంగంలోని ఉద్యోగులను పరోక్షంగా ప్రభావితం చేసే కర్ణాటక నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు గళం విప్పడం శుభ పరిణామం. తమ హక్కులను సమర్థవంతంగా కాపాడుకోవడం హర్షణీయం.

మన దేశ వైట్‌కాలర్ ఆర్థిక వ్యవస్థలోని కార్మిక హక్కుల కోణంలో, ఈ బిల్లు ఉపసంహరణ ఒక కీలక ఘట్టం. అత్యంత వేగంగా మార్పులకు లోనయ్యే ఐటి రంగంలో కూడా కార్మికులు సంఘటితమవుతున్నారన్న వాస్తవాన్ని కర్ణాటక ఉదంతం నిరూపించింది. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బలపడుతున్న ఉద్యమ నేపథ్యాలను పరిచయం చేస్తున్నది. అదే సమయంలో, సేవా రంగంలోనూ ఉద్యోగుల శక్తిసామర్థ్యాలను పీల్చేసే కార్పొరేట్ జలగల ఆగమనాన్ని సూచిస్తున్నది. ఉద్యోగులను యంత్రాలుగా... మరమనుషులుగా మారుస్తున్న వైనంపై హెచ్చరికలు జారీ చేస్తున్నది. రాబోయే పరిణామాలపై ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. ఉప్పెనలా ముంచుకొస్తున్న ప్రమాదాన్ని నివారించడానికి కర్ణాటక ఐటి ఉద్యోగుల ఉద్యమం.. సాధించిన విజయం నుంచి ప్రతి ఐటి ఉద్యోగి స్ఫూర్తి పొందాలి. అక్కడి పోరాటం కేవలం ఒక బిల్లును ఆపడం కోసం కాదు.. రాబోయే ప్రమాదాలను నివారించడానికి కూడా. ఈ ప్రతిఘటన ఐటి రంగంలో శ్రమదోపిడీ విధానాలను అడ్డుకోవడానికి జరిగిన తొలి ప్రయత్నం. యాజమాన్యాలు శ్రమ దోపిడీకి పాల్పడకుండా అడ్డుగీత గీయడం, కార్మికులు యంత్రాలు కారని నొక్కి చెప్పడం, సాంకేతిక శ్రమ అనేది ఇకపై వైరుధ్యమైనది కాదని నిరూపించడం. పని భవిష్యత్తు కేవలం సాంకేతికత లేదా పెట్టుబడిపై మాత్రమే ఆధారపడకూడదని పేర్కోవడం. పని తీరును రూపొందించడంలో ఐటి ఉద్యోగులు, నిపుణులు తమ హక్కుగా ఉన్నవాటాను ఎంత ధైర్యంగా నొక్కి చెబుతారనేది ప్రధానం. కర్ణాటకలో వారు ఈ సంఘటిత శక్తిని ప్రదర్శించారు. ఈ స్ఫూర్తి యావత్ భారతావనికి మార్గదర్శకం.

## ప్రజాస్వామ్య ముసుగు కప్పుకొన్న
# అమెరికా ఉగ్రవాదం



డా.కోలాహలం రామ్‌కిశోర్
9849328496

'ఉగ్రవాదం' ఈ కాలంలో ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న సమస్యలలో ఒకటి. ప్రత్యేకించి ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) వంటి సంస్థలు ప్రపంచవ్యాప్తంగా హింస, రక్తపాతాన్ని సృష్టిస్తున్నాయి. కానీ ఈ ఉగ్రవాదానికి పునాదులు వేసింది ఎవరు? దాన్ని పెంచి, పోషించింది ఎవరు? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకుతున్న సమయంలో అమెరికా ప్రభుత్వం రహస్య వ్యూహాలు బట్టబయిలు అవుతాయి. 'ప్రజాస్వామ్యం', 'మానవ హక్కుల' పేరుతో ప్రపంచాన్ని నడిపిస్తున్న అమెరికా, నిజానికి ఉగ్రవాదాన్ని తన రాజకీయ స్వార్థపూరిత లబ్ధికోసం ఉపయోగించుకుంటోంది.


### ఐసిస్ పుట్టుకకు అమెరికా ఎలా కారణమైంది?

1990ల దశకంలో ఇరాక్‌పై అమెరికా కల్పించిన యుద్ధ వాతావరణం, అక్కడి శాంతి, సుస్థిరత్వాన్ని ధ్వంసం చేసింది. సద్దాం హుస్సేన్ పరిపాలనను అంతం చేయడానికి అమెరికా 'ఇరాక్‌లో అణ్వాయుధాలు ఉన్నాయి అనే అబద్ధాన్ని తన ప్రచారం, ప్రసారం సాధనాలతో విస్తృతంగా విష ప్రచారం చేసింది. ఈ యుద్ధంలో ఇరాక్ సైన్యం విచ్ఛిన్నమై, దేశంలో అరాచకం వ్యాపించింది. ఈ పరిస్థితుల్లోనే 'జమాత్ అల్ తాహిద్ వల్‌జిహాద్' వంటి ఉగ్రవాద సంస్థలు బలపడ్డాయి. ఈ సంస్థలు కాలక్రమేణా 'ఆల్ కైదా' ఉగ్రవాద సంస్థతో ఐక్యమయ్యాయి. తర్వాత 'ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ (ISI)'గా మారింది. 2013లో సిరియాలోని 'అల్ నుస్రా ఫ్రంట్'తో విలీనం అయింది, అదే చివరకు 'ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ISIS)'గా తన పేరు మార్చుకుంది. అమెరికా యుద్ధాలు, అరబ్ ప్రాంతాల్లో అస్థిరతను సృష్టించి, ఉగ్రవాద సంస్థలకు పుట్టిల్లును కల్పించాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో 'తాలిబాన్', ఇరాక్‌లో 'ఐసిస్' వంటి ఉగ్రవాద సంస్థలు బలపడటానికి అమెరికా కుట్రపూరితంగా అనుసరించిన విధానమే ప్రధాన కారణం.

### ఐసిస్‌కు ఆర్థిక, ఆయుధ, రాజకీయ బలం సమకూర్చింది ఎవరు?

ఐసిస్ ప్రపంచంలోనే అత్యంత ధనిక ఉగ్రవాద సంస్థగా మారడానికి కీలక కారణం అక్కడ విస్తారంగా లభించిన చమురు వ్యాపారం. ఇరాక్, సిరియాలోని చమురు బావులను ఆక్రమించి, ఇల్లీగల్‌గా చమురును అమ్మడం ద్వారా రోజుకు 13 మిలియన్ డాలర్లు సంపాదిస్తోంది. కువైట్, సౌదీ అరేబియా, కతార్ వంటి దేశాల నుండి లెక్క లేనంత డబ్బు సహాయం వారికి లభిస్తుంది. అదనంగా, బందిపోటు, కిడ్నాపింగ్ చర్యల ద్వారా కూడా డబ్బు సంపాదిస్తారు.

రాజకీయంగా, ఐసిస్ అమెరికా వ్యతిరేక శక్తులను బలపరిచింది. ఇరాన్, సిరియా, రష్యా వంటి దేశాలను బలహీనపరిచేందుకు అమెరికా ఐసిస్‌కు ఆయుధాలను సప్లై చేస్తుంది. ఐక్యరాజ్యసమితిలో సమస్యలు రాకుండా అమెరికా తన వీటో పవర్‌ను ఒక ఆయుధంగా అనేకసార్లు ఉపయోగించింది. కానీ, కొన్ని చోట్ల అమెరికా రూపొందించిన ఈ తప్పుడు వ్యూహం ఇప్పుడు ఐసిస్ 'ఏకు మేకు' అయింది. ఐఎస్ఐఎస్ ఇప్పుడు తన స్వంత అజెండాతో ప్రపంచాన్ని భీతిల్ల చేస్తోంది.



### సామాజిక మాధ్యమాలు: ఉగ్రవాద ప్రచార శక్తి

ఐసిస్ యువతను ఆకర్షించడానికి ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగిస్తోంది. ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తూ, విస్తృతంగా ప్రచారాలు చేసి, యురోప్, అమెరికా నుండి యువకులను తమ వైపుకు ఆకర్షిస్తారు. ఈ ప్రక్రియలో పేదరికం, నిరాశ, మతపరమైన అత్యాశలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఇవన్నీ అమెరికా నీడలో, దర్శకత్వంలో కొనసాగాయి. చిన్న పిల్లలకు కూడా హింసను నేర్పిస్తారు. ఐసిస్ బాల సైనికులను 'భవిష్యత్ మానవ బాంబులు'గా తయారుచేస్తుంది. 45 రోజుల ప్రాథమిక శిక్షణ తర్వాత, 3 నెలల యుద్ధ శిక్షణ ఇస్తారు. ఈ పిల్లలకు తలకొట్టడం, గొంతు కోయడం వంటి క్రూరమైన పనులు నేర్పిస్తారు. ప్రారంభంలో ఐసిస్ మహిళలను సభ్యులుగా చేర్చుకోలేదు. కానీ, సిరియా, ఇరాక్‌లో మహిళా పోలీసులు అవసరమయ్యాక, వారిని కూడా సైనిక శిక్షణకు గురిచేశారు. జిహాదీలతో పెళ్లి చేసుకోవడానికి 'వివాహ కేంద్రాలు' ఏర్పాటు చేశారు. కానీ ఆ తర్వాత ఈ మహిళలు చాలా మంది బానిసలుగా మార్చబడ్డారు. ఐసిస్ అత్యాచారాలు, మానవతా విలువల ఉల్లంఘనలు ఇప్పటికీ విమర్శలను ఎదుర్కొంటున్నాయి.

### అమెరికా డబుల్ స్టాండర్డ్

అమెరికా ఒకవైపు ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి పూనుకుంటూ, మరోవైపు తనకు అవసరం అయినప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాద సంస్థలను పెంచి, పోషించి, ఉపయోగిస్తోంది. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్, ఇరాక్‌లో ఐసిస్ వంటి సంస్థలు బలపడటానికి అమెరికా యుద్ధాలే కారణం. ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పేరుతో అమెరికా చేస్తున్నది నిజంగా ఏమిటి? 'మానవ మారణ హోమం' మాత్రమే.

ఉగ్రవాదాన్ని అంతం చేయాలంటే, దాని మూలాలను గురించి ముఖ్యంగా యువత తెలుసుకోవాలి. అస్థిరత, యుద్ధాలు, ఆర్థిక అసమానతలు ఉగ్రవాదాన్ని పెంపొందిస్తాయి. అమెరికా వంటి స్వార్థ పూరితమైన దేశాలు తమ రాజకీయ ఆసక్తుల కోసం, ఉగ్రవాదాన్ని ఉపయోగించకుండా నిరోధించగలగాలి. ప్రపంచం మొత్తం శాంతి, సుస్థిరత, సహజీవనం కోసం కృషి చేయాలి. లేకుంటే, ఐసిస్ వంటి సంస్థలు మళ్లీ, మళ్లీ తలెత్తుతూనే ఉంటాయి. ఉగ్రవాదాన్ని ఒక వైపు పెంచి, పోషిస్తూ మరో వైపు 'ప్రజాస్వామ్యం' మానవ హక్కులు అంటూ అమెరికా ముసుగు కప్పుకుంటుంది, ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడుగా అయిన తర్వాత గాజా, పాలస్తీనా, ఇరాన్, సిరియా మొదలైన దేశాల్లో ఇజ్రాయిల్ నేత నెతన్యాహుతో జత కలిసి, ఆర్థికంగా, ఆయుధాల పరంగా, ఐక్యరాజ్య సమితిలో వీటో పవర్ ను ఉపయోగించి అక్కడి పసి పిల్లలను, మహిళలను, వృద్ధులను వేల సంఖ్యలో హతమారుస్తోంది. ఇక ఇప్పుడు అమెరికా ముసుగు తొలిగింది. ప్రపంచ దేశాలపై తన దేశ ఆర్థిక ప్రయోజనాల కోసం విచక్షణా రహితంగా టారిఫ్‌లు విధిస్తూ ప్రపంచ దేశాల వాణిజ్య ప్రయోజనాలను దెబ్బ తీయాలని చూస్తున్నారు. ఈ చర్య భవిష్యత్తులో పరోక్షంగా అమెరికాకు తీవ్రంగా నష్టపరుస్తుంది. మరోవైపు ఉక్రెయిన్‌ను నాటో కూటమిలో చేర్చుకుంటామని ఆశలు పెట్టి, రష్యాతో యుద్ధానికి దింపింది మాజీ అమెరికా అధ్యక్షుడు బైడన్. ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్‌ను యుద్ధం మధ్యలో వదిలేశాడు. ఇలా అమెరికా ఇక ఎంత కాలం మానవాళిని మోసం చేస్తుందో? ఇంకెంత కాలం ప్రపంచ దేశాలపై అమెరికా దౌర్జన్యం కొనసాగుతుందో వేచి చూడాలి. చివరిగా... ప్రపంచంలో అనేక దేశాల్లో, చివరకు అమెరికా ప్రజలు కూడా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా, ఇజ్రాయిల్ నేత నెతన్యాహుకు వ్యతిరేకంగా ప్లకార్డ్స్ ధరించి నిరసన ఊరేగింపులు జరుపుతున్నారు. యువతలో కూడా అమెరికా నిజం స్వరూపం అర్థం అవుతుంది.

చిన్న పిల్లలకు కూడా హింసను నేర్పిస్తారు. ఐసిస్ బాల సైనికులను 'భవిష్యత్ మానవ బాంబులు'గా తయారుచేస్తుంది. 45 రోజుల ప్రాథమిక శిక్షణ తర్వాత, 3 నెలల యుద్ధ శిక్షణ ఇస్తారు. ఈ పిల్లలకు తలకొట్టడం, గొంతు కోయడం వంటి క్రూరమైన పనులు నేర్పిస్తారు. ప్రారంభంలో ఐసిస్ మహిళలను సభ్యులుగా చేర్చుకోలేదు. కానీ, సిరియా, ఇరాక్‌లో మహిళా పోలీసులు అవసరమయ్యాక, వారిని కూడా సైనిక శిక్షణకు గురిచేశారు. జిహాదీలతో పెళ్లి చేసుకోవడానికి 'వివాహ కేంద్రాలు' ఏర్పాటు చేశారు. కానీ ఆ తర్వాత ఈ మహిళలు చాలా మంది బానిసలుగా మార్చబడ్డారు. ఐసిస్ అత్యాచారాలు, మానవతా విలువల ఉల్లంఘనలు ఇప్పటికీ విమర్శలను ఎదుర్కొంటున్నాయి.

# సంపన్నులారా జన్మభూమిని విస్మరించకండి

ఆధునిక టెక్నాలజీ ఫలితంగా ప్రపంచమే ఓ 'కుగ్రామంగా' మారింది. దీనితో ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో విశ్వవ్యాప్తంగా తెలుస్తోంది. మన భారతీయులు ప్రపంచంలోని అనేక దేశాల్లో స్థిరపడి రాజకీయ, సాంకేతిక, వ్యాపార రంగాల్లో ఆర్థికంగా కుబేరులుగా ఎదిగి కొన్ని దేశాల్లో పాలకులై, ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. వారి ప్రగతి చూస్తూ మా వాళ్లని పొంగిపోతున్నాం. మన వారెక్కడున్నా జన్మభూమి రుణం తీర్చుకోవడం, మూలాలను విస్మరించకుండా మనవాళ్లను తరతరాలుగా పట్టి పీడిస్తున్న పేదరికం, ఉపాధి లేమి, నిరుద్యోగం తదితర సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి తోడ్పడాల్సిన బాధ్యతలు గుర్తు చేస్తూ భారతీయ (ప్రపంచ)కుబేరుల వివరాల్లోకి వెళదాం..

అంతర్జాతీయ వ్యాపార దిగ్గజాలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తమ వినూత్న వ్యూహాలతో సంపదను పెంచుకున్నారు. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల సంఖ్య 2025లో 3028కి పెరగడం ఇందుకు నిదర్శనం. వీరి మొత్తం సంపద విలువ 16.1లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. 2025 జూలైకు సంబంధించి ఫోర్బ్స్ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఎలాన్ మస్క్ ప్రపంచ అగ్రగామి కుబేరుడుగా కొనసాగుతున్నారు. 2024 మేలో 400 బి. డాలర్ల మైలురాయిని అధిగమించిన తొలి కుబేరుడుగా నిలిచి మస్క్ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ప్రపంచ అగ్రగామి 10 మంది కుబేరుల సంపద విలువ జూన్ 1 నాటికి 100 బిలియన్ డాలర్లకు మించింది. ఇది ఇలా ఉంటే ప్రపంచ కుబేరుల జాబితాలో దశాబ్దాలుగా అగ్రస్థానంలో కొనసాగిన మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఇప్పుడు టాప్ 10 జాబితాలో స్థానం కోల్పోయారు. ఆయన చేసిన భారీ దానధర్మాల కారణంగా ప్రపంచ సంపద గణనలో జరిగిన మార్పులతో ఈ పరిణామం చోటు చేసుకుంది. ప్రపంచ కుబేరుల జాబితాలో ఐదో స్థానంలో ఉన్న ఆయన ఏకంగా 12వ స్థానానికి పడిపోయారు. ఇలా తన దానధర్మ కార్యక్రమాల మూలంగా టాప్ 10 బిలియనీర్ల జాబితా నుంచి బిల్ గేట్స్ స్థానం తగ్గింది. దాదాపు 116 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ కుబేరుల్లో 15వ స్థానం లో ముఖేష్ అంబానీ ఉన్నారు. వంద బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8.85 లక్షల కోట్ల) క్లబ్‌లో ఉన్న ఏకైక ఆసియావాసి ఈయనే. ప్రపంచ కుబేరుల తొలి పదిమంది పేర్లు, నికర విలువ (బిలియన్ డాలర్లు)...

1. ఎలాన్ మస్క్ (బి.డా. 393.1)
2. లారీ ఎలిసన్ (బి.డా. 275.9)
3. మార్క్ జుకర్ బర్గ్ (బి.డా. 247.9)
4. జెఫ్ బెజోస్ (బి.డా. 236.8)
5. బెర్నార్ అర్నాల్డ్ (బి.డా.147.7)
6. లారీ పేజ్ (బి.డా. 146.2)
7. వారెన్ బఫెట్ (బి.డా.143.1)
8. స్టీవ్ బామర్ (బి.డా.141.3)
9. సెర్గీ బ్రిన్ (బి.డా. 139.7)
10. జెన్సన్ హువాంగ్ (బి.డా. 137.9)



### అమెరికాలోని సంపన్న భారతీయులు

43 దేశాలకు చెందిన 125 మంది బిలియనీర్లలో మన వాళ్లే 12 మంది. అగ్రస్థానంలో జయ్ చౌద్రీ, తొలిసారిగా సుందర్ పిచాయ్, సత్య నాదెళ్లకు చోటు దక్కింది. ఫోర్బ్స్ అమెరికా సంపన్న ప్రవాసుల జాబితా.. అమెరికాను ప్రవాస భారతీయులు మరింత సంపన్న దేశంగా మారుస్తున్నారు. ఫోర్బ్స్ విడుదల చేసిన 'అమెరికాస్ రిచెస్ట్ ఇమిగ్రేంట్స్ 2025' జాబితా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తోంది. మొత్తం 43 దేశాలకు చెందిన 125 మంది ప్రవాస బిలియనీర్లు అమెరికాలో ఉన్నట్టు ఫోర్బ్స్ గుర్తించింది. వీరిలో 12 మంది భారతీయులే ఉన్నారు. ఈ సంఖ్యాపరంగా ఇజ్రాయిల్‌ను మన దేశం అధిగమించింది. ఈ జాబితాలోని 10 దేశాల ప్రవాస బిలియనీర్లలో మూడవ వంతు మంది భారత్‌కు చెందిన వారున్నారు. ఇజ్రాయిల్, తైవాన్, కెనడా, చైనా మరో 5 దేశాలకు చెందినవారు ఉన్నారు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యా నాదెళ్ల మరియు నికేశ్ అరోరా తొలిసారిగా ఈ జాబితాలో చేరారు. అగ్రస్థానంలో 17.9 బి. డాలర్ల సంపదతో జయ్ చౌద్రీ (65) అగ్రస్థానంలో ఉన్నారు. 1980 ప్రాంతంలో యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటిలో చేరడం కోసం తొలిసారిగా విమానం ఎక్కిన ఈయన 2008లో స్కాలర్ అనే సైబర్ సెక్యూరిటీ సంస్థను ఏర్పాటు చేశారు. 2018లో నాస్ డాక్‌లో లిస్ట్ అయిన ఈ కంపెనీలో ఆయనకు, ఆయన కుటుంబానికి 40 శాతం వాటా ఉంది. హిమాలయాల్లోని చిన్న గ్రామం ఈయన స్వస్థలం. 8వ తరగతి వరకు ఆ ఊరికి విద్యుత్, పదవ తరగతి వరకు సురక్షిత నీటి సరఫరా లేదు. అటువంటి ప్రాంతం నుంచి వచ్చి అమెరికాలో చదువుకుని, ఉద్యోగంలో చేరిన ఆయన.. తర్వాత తన భార్యతో కలిసి సెక్యూర్ ఐటి అనే అంకురాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత బిలియనీర్‌గా మారగలిగారు.

### 'అమెరికాలో సంపన్న ప్రవాస భారతీయుల ర్యాంక్'

1.జయ్ చౌదరి, 2.వినోద్ ఖోస్లా, 3.రాకేస్ గంగ్వాల్, 4. రమేష్ వాధ్వనీ, 5.రాజీవ్ జైన్, 6.కవితార్క్ రామ్ శ్రీరామ్, 7. రాజ్ సర్దానా, 8.డెవిడ్ పాల్, 9.నికేష్ అరోరా, 10.సుందర్ పిచాయ్, 11.సత్య నాదెళ్ల, 12.నీరజ్ సేథీ..లు ఉన్నారు. ఈ జులై నాటికి 1బిలియన్ డాలర్ల (రూ.8550 కోట్ల) కంటే అధిక సంపద ఉన్నవారితో ఈ జాబితాను ఫోర్బ్స్ ప్రకటించింది. ఇది ఇలా ఉంటే... భారతదేశంలో గత ఏడాది '(2024)పై యూబీఎస్ నివేదిక' మేరకు.. 39 వేల మంది కొత్త మిలియనీర్లు అవతరించారు. అంత క్రితం ఏడాదితో పోలిస్తే వీరి సంఖ్య 4.4శాతం వృద్ధి చెందడంతో ప్రపంచవ్యాప్తంగా మిలియనీర్ల సంఖ్య వృద్ధి విషయంలో భారత్ నాలుగో స్థానంలో ఉందని, 'యుబీఎస్ గ్లోబల్ వెల్త్ రిపోర్ట్' వెల్లడించింది. తొలి మూడు స్థానాల్లో తుర్కియే, యూఏఈ, రష్యా ఉన్నాయి. మొత్తం 9,17,000 మంది మిలియనీర్ల (కనీసం 10 లక్షల డాలర్లు/రూ. 8.5 కోట్ల సంపద ఉన్నవారు)లో బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికా కంటే మెరుగ్గా భారత్ ఉంది. అయితే చైనా 63లక్షల మంది మిలియనీర్లతో అగ్రస్థానంలో ఉంది. మొత్తం 56 దేశాల నుంచి సమీకరించిన సమాచారం ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక ప్రకారం.. అమెరికా, మెయిన్ ల్యాండ్ చైనా చేతిలోనే సగానికి పైగా వ్యక్తిగత సంపద ఉంది. ప్రపంచ సంపదలో భారత్ వాటా 3.4శాతమే. ఆదాయ వృద్ధి తక్కువ, గత ఐదేళ్లుగా సగటు ఆదాయం వృద్ధి విషయంలో అట్టడుగు స్థానాల్లో ఉన్న ఆరు దేశాల్లో భారత్ కూడా ఒకటి. వచ్చే 25 ఏళ్లలో సంపద గరిష్ఠంగా బదిలీ అయ్యే దేశాల్లో భారత్ కూడా ఒకటిగా మారుతుంది. ఈ దేశంలో ఉన్న యువ జనాభా కారణంగా ఒక తరం నుంచి మరో తరానికి సంపద బదిలీ అవుతుంది. భారత దేశంలోని 'తొలి పదిమంది మిలియనీర్లు వీరే' 1.ఆకాష్ అంబానీ, 2.అనంత్ అంబానీ, 3.ఈషా అంబానీ, 4.వినోద్ భాయ్ ఆదానీ, 5.గౌతమ్ ఆదానీ, 6.రాజేష్ ఆదానీ, 7.అజయ్ ప్రేమ్ జీ, 8.దిలీప్ సంఘీ, 9.షాపూర్ పల్లోంజీ మిస్త్రీ, 10.సజ్జన్ కుమార్ జిందాల్..

దేశంలో వ్యక్తిగత సంపద విలువ రూ.1,000కోట్లకు మించిన వాణిజ్యవేత్తలతో 360 వెల్త్ వన్ సంస్థ రూపొందించిన జాబితాలో అగ్రస్థానంలో ముఖేష్ అంబానీ వారసులు నిలిచారు. తొలితరం పారిశ్రామికవేత్తలతో పాటు వారసత్వంగా వచ్చిన వ్యాపార సామ్రాజ్యాలను మరింతగా విస్తృతం చేసిన వారు ఈ జాబితాలో చోటు చేసుకున్నారు. 'తెలుగు రాష్ట్రాల నుంచి తొలి పదిమంది' 1.చిరంజీవి సింగ్ సలూజా, 2.పెనాక్ సునీల్ రాణి, 3.నీలిమా ప్రసాద్ దివి, 4.సత్ చంద్ర కిరణ్ దివి, 5.పి.వెంకట కృష్ణారెడ్డి, 6.పీపీ రెడ్డి, 7.జీవీ ప్రసాద్, 8.బి.పార్థసారధి రెడ్డి, 9.కె సతీష్ రెడ్డి, 10.కవితా ప్రసాద్ అల్లూరు. ప్రపంచవ్యాప్తంగా సంపన్నులుగా మన భారతీయులు (తెలుగు) వారు కొనసాగుతున్నారు.వీరి మూలాలైన తాత, ముత్తాతలు, వీరికి ఆ స్థాయిని కల్పించిన జన్మభూమి వీరు భారత దేశానికి తమ వంతు బాధ్యతతో సేవలు అందించాల్సిన అవసరాన్ని చేస్తున్నాయి. ఈ దేశంలో పేదరికం,అసమానతలు ఉపాధిలేమి, నిరుద్యోగంలాంటి సామాజిక రుగ్మతలను రూపుమాపటానికి వారు చేయూత కావాలి. భారత ప్రభుత్వంపై కూడా వారు పరిశ్రమలు పెట్టడానికి సౌకర్యం కల్పించి సద్వినియోగ పరుచుకోవాల్సిన బాధ్యత మెండుగా ఉంది.

– మేకిరి దామోదర్
9573666650

# రిటైర్డ్ ఉద్యోగుల ఎదురుతెన్నులు

మూడు దశాబ్దాలకు పైగా వివిధ హోదాలలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన తర్వాత శేష జీవితం ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా గడాలని కోరుకుంటారు. పిల్లల చదువులు, ఇతరత్రా ఖర్చులు పోను ఎంతో కొంత పొదుపు చేసుకుని ఆ పొదుపు డబ్బుతో ఉద్యోగ విరమణ పొందిన తర్వాత తాము స్థిరపడటం పిల్లలు స్థిరపడే విధంగా ఆలోచనలు చేయడం పెళ్లిలు, సొంతింటి కలలు నెరవేర్చుకోవాలన్న ఆలోచన చాలా మంది ప్రభుత్వ ఉద్యోగుల్లో ఉంటుంది. కానీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఉద్యోగ విరమణ చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపులు జరగాక ఏడాదిన్నర కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఎరన్ లివ్, జిపిఎఫ్ తదితర సొమ్ముల కోసం ఎదురుచూస్తున్నారు. ఉద్యోగ జీవితంలో ఉన్నప్పుడు వీటి ద్వారా స్థిరపడే మార్గాలను ఎంచుకుంటారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏడాదిన్నర గడిచినా బకాయిలు చెల్లించడం లేదు. ఉద్యోగ విరమణ తర్వాత పింఛన్ ఇస్తున్నారు కానీ బకాయిలు మాత్రం చెల్లించడం లేదు బకాయిలు అందుకోకుండానే ప్రాణాలు కోల్పోయిన వారు రాష్ట్రంలో చాలా మంది ఉన్నారు. వీరి కుటుంబ సభ్యుల వేదన వర్ణణాతీతం. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇకనైనా పింఛన్ డబ్బులు చెల్లించండి అంటూ వేడుకుంటున్నారు. రాష్ట్ర చరిత్రలో ఈ పరిస్థితి ఎన్నడులేదన్న వాదన వినిపిస్తుంది. గతంలో ఉద్యోగ విరమణ చేసిన కొద్ది రోజుల్లోనే ఉద్యోగికి రావాల్సిన ఆర్థిక చెల్లింపులు చేసేవారు. ఒక ఉపాధ్యాయుడు ఉన్నత విద్యను అభ్యసించిన తన కుమార్తె వివాహాన్ని ఉద్యోగ విరమణ తర్వాత వచ్చే డబ్బుతో చేయాలని ఏడాది కాలంగా ఎదురు చూస్తున్నాడు.ఉద్యోగం తప్ప మరో ఆర్థిక వనరు ఎంచుకోలేని ఆయన కేవలం పింఛన్ పైనే ఆధారపడ్డాడు. కుమార్తె వివాహం చేసేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాడు. ఉద్యోగాల్లో ఉండి అక్రమ సంపాదన ద్వారా ఆర్థికంగా బలపడిన వారికి ఇబ్బందులు లేకపోవచ్చు కానీ నిబద్ధతతో ఉద్యోగం చేస్తూ పై సంపాదనకు పాల్పడని వారికి విరమణ అనంతరం వచ్చే డబ్బే ప్రదానం. చాలీ చాలని వేతనంతో జీవితాన్ని ప్రారంభించిన వారికి పిల్లల చదువులు, ఉద్యోగాలు, పెళ్లిళ్లు, అనారోగ్యాలతో సతమతమైన వారు పెన్షనరీ బెన్‌ఫిట్స్ అందుకోలేకపోతున్నారు. 2024 ఏప్రిల్



నుండి ప్రతి నెల ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందుతున్నారు. ఈ ఏడాది జూన్ మాసంలో ఒక్క ఖమ్మం జిల్లాలోనే 45 మంది వివిధ శాఖల్లో పనిచేసిన వారు ఉద్యోగ విరమణ పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా 10వేల మందికి పెన్షనరీ బెన్‌ఫిట్స్ చెల్లించబడలేదని తెలుస్తుంది. కొందరైతే బెన్‌ఫిట్స్ రాగానే చెల్లిస్తామని అప్పులు తెచ్చి తీర్చలేక పింఛన్ డబ్బులతో నెలనెల వడ్డీలు కడుతున్న వారు ఉన్నారు. ప్రభుత్వం వెంటనే మానవత ధృక్పథంతో ఆలోచించి ఉద్యోగ విరమణ పొందిన వారందరికీ వెంటనే బెన్‌ఫిట్స్ అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ఆర్టీసిలోనూ అదే పరిస్థితి

ఆర్టిసి, సింగరేణి మొదలైన కార్పొరేషన్లలో పదవి విరమణ చేసిన రోజే బెన్‌ఫిట్స్‌ను అందించేవారు. చెక్కుల రూపంలో ఉద్యోగ విరమణ ఉద్యోగులకు రావాల్సిన మొత్తాన్ని అందించేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. 2024లో ఆర్టిసిలో ఉద్యోగ విరమణ పొందిన వారికి సైతం ఇప్పటి వరకు బకాయిలను చెల్లించలేదని ఆర్టిసి కార్మికులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టిసి లాభాల్లో పయనిస్తుందన్న ప్రచారం నేపథ్యంలో ఇప్పటికైనా బకాయిలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### పెన్షనర్ల ఇబ్బందులు తొలగేదెన్నడు...?

వివిధ హోదాల్లో రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. వయో వృద్ధులైన పెన్షనర్లకు ఈహెచ్‌ఎస్ స్కీమ్ ఉన్నా అవి పని చేయడం లేదు. పెన్షనర్లకు అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ వైద్యం అందించేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నోషనల్ ఇంక్రిమెంట్, పెన్షనరీ డైరెక్టరీ ఏర్పాటు, తెలంగాణలో పెన్షనర్స్ భవన్, ట్రెజరీ ద్వారా పెన్షన్ చెల్లింపు తదితర సమస్యల పరిష్కారానికి పెన్షనర్ల సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘాల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది.

ప్రజాపక్షం ఖమ్మం ప్రతినిధి

# అమృతాహారం అవకాడో

అవకాడో అనే ఆధునిక అమృత ఆహారం. ఇది అద్భుత పోషక విలువలతో సూపర్ ఫ్రూట్‌గా ప్రసిద్ధిగాంచింది. అమెరికా లాంటి పాశ్చాత్య దేశాల్లో విస్తారంగా వినియోగిస్తున్న అవకాడో పండ్లు నేడు భారతదేశంలోకి అడుగిడి, అందరికీ అమృత ఆహారంగా మెనూలో చేరింది. అవకాడో అనేది కూరగాయల వర్గానికి చెందినది కాదని, అది ఒక పండు అని తెలుసుకోవాలి. అవకాడో పండ్లను సలాడ్, టోస్ట్, స్మూథీస్, స్ప్రెడ్, రుచికరమైన పండుగా పలు రూపాల్లో ఉపయోగించడానికి అలవాటు పడుతున్నాం. ఇటీవల విశేష ఆదరణ పొందిన ఈ అద్భుత పండ్ల పోషక విలువలను ప్రజలకు తెలియజేయడానికి ప్రతి ఏటా జులై 31న జాతీయ అవకాడో దినం పాటించటం 2018 నుంచి ఆనవాయితీగా మారింది. ఆరోగ్యకరమైన, రుచికరమైన అవకాడో పండ్లలో అత్యంత ముఖ్యమైన పోషక విలువలు ఉంటాయి. అర్టి పండ్లలో కన్న అవకాడో పండ్లలో అధిక పొటాషియం ఉంటుంది. చెట్టు నుంచి తెంపిన తర్వాతనే అవకాడో పండుతుంది. ఆకలి పెంచడానికి మంచి అపటైజర్‌గా పని చేస్తుంది. 2015లో అమెరికా దేశంలోనే దాదాపు 4.25 బిలియన్ల అవకాడో పండ్ల అమ్మకాలు జరిగాయి. గుండె ఆరోగ్యాన్ని పరిరక్షించే అవకాడోలో మంచి కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇన్సులిన్ నిరోధకతను సరి చేయగల అవకాడోలో విటమిన్ సి,ఈ,కె లాంటివి సమృద్ధిగా ఉంటాయి. అల్జీమర్స్ వ్యాధి కట్టడికి అవసరమైన ఒమెగా 3 ఫాటీ ఆమ్లాలు అవకాడోలో ఉంటాయి. అవకాడో ఉన్న ఓలిక్ ఆసిడ్ వల్ల చర్మం తేమతో ఎర్రబారకుండా, ఇరిటేషన్ కలిగించకుండా చర్మ ఆరోగ్యాన్ని సంరక్షిస్తుంది.



జాతీయ అవకాడో దినం వేదికగా ఈ సూపర్ ఫ్రూట్ పోషక విలువలను అవగాహన పరచడం, పలు కొత్త రకాల అవకాడో రెసిపీలు, అవకాడో వంటల పోటీలు, మన భోజనంలో అవకాడోను నిత్యం చేర్చడం, అవకాడో ప్రేమికుల అభిప్రాయాలను తెలుసుకోవడం లాంటి ప్రచార కార్యక్రమాలు చేపట్టవచ్చు.

## పందుల యజమానులకు నోటీసులు

ప్రజాపక్షం కథనానికి స్పందించిన అధికారులు

ప్రజాపక్షం ఎఫెక్ట్



**ప్రజాపక్షం/సిర్పూర్ టి:**సిర్పూర్ టి మేషన్ కాలనీలో పందుల బెడదపై ప్రజాపక్షంలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అనుమతులు లేకుండ పందులను సంచరింపజేస్తున్న యజమానులపై చర్యలు ప్రారంభించారు. బుధవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ సత్యనారాయణ సమక్షంలో పందుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో పెరిగిపోయిన పందుల వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతోందని, వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకునిచర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## బాల శక్తి కార్యక్రమంలో పాల్గొన్న బిజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి



**ప్రజాపక్షం/సోన్ :**సోన్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాల శక్తి కార్యక్రమంలో బిజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు..అనంతరం బాలశక్తి కార్యక్రమ పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలశక్తి కార్యక్రమ ద్వారా విద్యార్థుల్లో అనేక అంశాల పట్ల అవగాహన ఏర్పడుతుందని,ఆరోగ్య పరంగా,విద్యాపరంగా చైతన్యవంతులు అవుతారని అన్నారు.అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన అస్ట్రొనమీ ల్యాబ్ ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా.రాజేందర్, ఇన్ చార్జ్ డిఈఓ,బ్లడ్ బ్యాంక్ మేనేజర్, మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి,నాయకులు హరీష్‌రెడ్డి,ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు, తోపాటు మండల బిజెపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/జిన్నారం:**జిన్నారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భరోసా (భూ భారతి) దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, రికార్డుల నిర్వహణ పట్ల పలు సూచనలు చేశారు. అనంతరం మొగ్గిగూడ సమీపంలోని ఓ రైస్ మిల్ ను సందర్శించి, రిజిస్టర్లు, తూకాలు తదితరాలను తనిఖీ చేశారు.జిన్నారం తహసీల్దార్, డిటి రామ్మోహన్, ఆర్ఐలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పోతిరెడ్డిపల్లి డిసిఎంఎస్ ఎరువుల షాపు ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** సంగారెడ్డి మండలం పోతిరెడ్డి పల్లి డిసిఎంఎస్ ఎరువుల షాపును బుధవారం జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ఆకస్మిక తనిఖీ చేసారు. ఫర్టిలైజర్ షాపులో యూరియా స్టాక్‌ను పరిశీలించారు. రోజు వారీగా స్టాక్ వివరాలు బోర్డుపైన ప్రదర్శించాలన్నారు. ఈ పాస్ మిషన్ ద్వారనే రైతులకు ఎరువులు అమ్మాలన్నా. అనంతరం ఒక రైతుతో కలెక్టర్ ఫోన్లో మాట్లాడారు. రైతులకు ఎరువులను అధిక ధరకు ఎమ్మార్పీ రేటు కన్నా ఎక్కువ రేటుకు అమ్మరాదు అని తెలియజేయడంతో జిల్లా కలెక్టర్ యూరియాను రైతులకు అధికధరకు విక్రయించినందుకు షాపును సీజ్ చేయమని డిఏఓ కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశాలు జారీ చేశారు. రైతులు డీలర్ల వద్ద కొనుగోలు చేసే విత్తనాలు ఎరువులకు సంబంధించిన రసీదులను విధిగా తీసుకోవాలని సూచించారు. ఎరువుల కొరత తలెత్తకుండా అధికారులు వ్యవసాయాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, మండల వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిన్నారం మండలంలో ఎరువుల దుకాణాల సోదాలు



**ప్రజాపక్షం/ జిన్నారం :** జిన్నారం మండలంలో రైతుల డిమాండ్ కు సరిపడా ఎరువులు సరఫరా చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ తెలిపారు. జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ నేతృత్వంలో వ్యవసాయ అధికారులు జిన్నారం మండలంలోని ఎరువుల దుకాణాలు తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో మండలంలోని ఎరువుల విక్రయ కేంద్రాలలో యూరియా డిఏపి ఎం.ఒపి ఇతర కాంప్లెక్స్ ఎరువుల క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులకు ఎరువుల సరఫరాలో అంతరాయం లేకుండా జిల్లా వ్యవసాయ శాఖ తరఫున అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో సమగ్ర వ్యవసాయ అభివృద్ధికి ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని అన్ని ఎరువుల దుకాణాల వద్ద స్టాక్ పొజిషన్ను ,ఎమ్మార్పీ ధరలను తెలిపే విధంగా బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పోడు భూములకు పట్టాలిస్తామన్న హామీ ఏమైంది?

తహసీల్దార్ కార్యాలయం ఎదుట బిజెపి నాయకుల నిరసన



**ప్రజాపక్షం / తాండూర్ :**పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తాండూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి బిజెపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ యు. జోత్స్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి మాట్లాడుతూ పెగడపల్లి గ్రామంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి బలహీన వర్గాలు పోడు భూముల్లో పండ్లు పెట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా హామీ నిలబెట్టుకోవాలి అని డిమాండ్ చేశారు. భూములకు పట్టాలు వచ్చేంతవరకు పోడు రైతుల పక్షాన బిజెపి పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. బిజెపి జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా సీనియర్ నాయకులు, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, దుర్గ చరణ్, బిజెవైయం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, బూత్ అధ్యక్షుడు అరికెల శంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మిక రహిత తెలంగాణకు బాటలు వేద్దాం..

పిల్లల్ని పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరం...

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**బడి ఈడు పిల్లల్ని పనిలో పెట్టుకుంటే బాల కార్మిక నిషేధ,నియంత్రణ చట్టం 2016 ప్రకారం పిల్లల్ని పనిలో పెట్టుకుంటే మూడు సంవత్సరాల పాటు జైలు శిక్ష లేదా రూ.20,000 నుండి 50వేల వరకు జరిమానా లేదా రెండు విధించవచ్చు ఇంటి పనుల కొరకు పిల్లలను నిర్బంధంలో ఉంచడం హక్కుల ఉల్లంఘన అవుతుంది.అంతేగాక వెట్టిచాకరీ నిర్మూలన చట్టం 1976 ప్రకారం కూడా శిక్షహరులు బాలల సంక్షేమ సమితి సభ్యులు,ఎల్.సైమన్సుందర్,జన్ను అనిల్,సల్ల శ్రీలత,పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా పోస్టర్ విడుదల చేశారు.ఇందులో విజన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారు ,చైల్డ్ లైన్ కోఆర్డినేటర్గంగాధర్,తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులతోనే ఆహార భద్రత

కార్డుల జారీ నిరంతర ప్రక్రియ: కలెక్టర్



**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :**అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.బుధవారం ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి,రైతువేదికలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తో కలిసి జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ నూతన రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. నూతన రేషన్ దారులకు ప్రభుత్వం వచ్చే నెలనుంచి సన్న బియ్యం, అందించనుందని అన్నారు.రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోని వారుంటే దరఖాస్తు చేసుకోవాలని,ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగునుందని అన్నారు.అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.మండలంలో మొత్తం 4201 రేషన్ కార్డులు మంజూరు కాగా కొత్తవి 1669 కుటుంబ సభ్యులు అడ్డింగ్ 2532 ఉన్నాయన్నారు.అనంతరం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.గత ప్రభుత్వ పాలనలో పదేళ్ల కాలం నుంచి రేషన్ కార్డులు లేక ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని అన్నారు.పెన్షన్లు,రాజీవ్ యువ కిరణాలు వంటి పథకాలు ప్రభుత్వం త్వరలో అమలు చేయనుందని అన్నారు.నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.కడెం ప్రాజెక్టు మరమ్మతులకు 9 కోట్ల 40 లక్షలు సాధర్మాట్ కెనాల్ మరమ్మతులకు 39 లక్షలు,ఖానాపూర్ పట్టంలోని త్రాగునీటి సదుపాయానికి అమృత్ పథకంలో 20 లక్షలతో పనులు చేపట్టామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,డిఎస్ఒ రాజేందర్,సిపిఒ జీవరత్నం,తహసీల్దార్ సుజాత,ఎంపిడిఒ సునీత,మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్,వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్,పలు శాఖల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నూతన రేషన్ కార్డులతో పేదల ఆర్థికాభివృద్ధికి దోహదం..**

ప్రభుత్వం అందజేస్తున్న నూతన రేషన్ కార్డులు పేద ప్రజలకు ఆర్థికంగా ఎదగడానికి సహకరిస్తాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.బుధవారం దస్తురాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ తో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,రేషన్ కార్డు అనేది అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రామాణిక గుర్తింపు అని అన్నారు.నూతన కార్డుల ద్వారా ఇందిరమ్మ ఇళ్లు,రైతు రుణ మాఫీ,పింఛన్లు,ఉచిత విద్యుత్,గ్యాస్ సబ్సిడీ వంటి పథకాల నుంచి పేదలు లబ్ధి పొందవచ్చని తెలిపారు.దస్తురాబాద్ మండలానికి 1352 నూతన రేషన్ కార్డులు మంజురయ్యాయని,కుటుంబ సభ్యుల పేర్లను కూడా చేర్చినట్లు పేర్కొన్నారు.ఇకపై ఎవరికైనా రేషన్ కార్డు అవసరమైతే ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.మంజూరైన కార్డులను ఇంటి వరకు అధికారులే చేర్చుతారని తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ,అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందిస్తామని,ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున నాణ్యమైన సన్న బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు.రేషన్ కార్డుల ద్వారా పేదలు ప్రభుత్వ పథకాలు పొందుతూ గౌరవప్రదంగా జీవించగలరని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్, సిపిఒ జీవరత్నం,మండల ప్రత్యేక అధికారి నాగవర్ధన్,పౌర సరఫరాల అధికారి రాజేందర్,తహసీల్దార్ విశ్వంబర్,అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రం నిర్మాణం వేగవంతం: కలెక్టర్



**ప్రజాపక్షం/భీమారం/మంచిర్యాల:**ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం భీమారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణ స్థలాన్ని మండల అభివృద్ధి అధికారి సతీష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేస్తోంది. ఇందులో భాగంగా చేపట్టిన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి అని అన్నారు. తర్వాత జెడ్‌పి ఉన్నత పాఠశాలను ఎస్‌ఐ శ్వేతతో కలిసి సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యత, తరగతి గదులు, హాజరు పట్టిక, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, తాగునీరు అందించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు రావాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పాఠశాలలో కొనసాగుతున్న మూత్రశాల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం శ్రీలక్ష్మి ఫెర్టిలైజర్ దుకాణాన్ని సందర్శించి ధరల పట్టిక, స్టాక్ బుక్స్, రశీదుల జారీ తీరును పరిశీలించారు. నకిలీ విత్తనాలు, నిషేధిత ఎరువుల అమ్మకాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బూరుగుపల్లి గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులు, త్రాగునీటి సరఫరా తదితర అంశాలను పరిశీలించి వర్షాకాలం దృష్ట్యా కాలువలు శుభ్రంగా ఉంచాలి. దోమల నివారణకు ఆయిల్ బాల్స్, బయోటెక్ స్ప్రేలు ఉపయోగించాలి. ఇంటింటికీ తాగునీరు అందించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పనులు ప్రారంభించాలని, 600 చదరపు అడుగుల మేర నిర్మాణం చేపట్టాలని సూచించారు. దాంపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని వ్యవసాయ అధికారి భూక్య ఛత్రు, తహసీల్దార్ సదానందలతో కలిసి సందర్శించారు. గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. చివరగా, ఆరోగ్య ఉప కేంద్రం కోసం స్థల పరిశీలన నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులే ప్రామాణికం

పెంచికల్ పేటలో లబ్ధిదారులకు పత్రాల పంపిణీ: ఎమ్మెల్సీ, కలెక్టర్



**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ :**పేదల సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టిన పథకాలు రేషన్ కార్డుల ఆధారంగానే అమలవుతాయని ఆదిలాబాద్ శాసన మండలి సభ్యులు దండే విఠల్ పేర్కొన్నారు. బుధవారం పెంచికల్ పేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రేషన్ కార్డుల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడంలో ఇవే ప్రామాణికంగా నిలుస్తున్నాయి. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివాహితులు, పిల్లల పేర్లను కార్డుల్లో చేర్చుకునేందుకు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. తహసీల్దార్, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులకు కార్డులు మంజూరు చేస్తారు అని తెలిపారు. పెంచికల్ పేట మండలానికి 109 కొత్త కార్డులు, 124 మందికి పేరు నమోదు చేసి అందజేశామని చెప్పారు .అనంతరం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ పుష్పలత, ఎంఆర్ఓ ఆల్బర్ట్, పౌర సరఫరాల శాఖ అధికారులు, మాజీ జిల్లా చైర్మన్ సిడెం గణపతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల పట్టాలివ్వాలని సిపిఐ శ్రేణుల ధర్నా




**ప్రజాపక్షం/నస్పూర్:** సింగరేణి స్థలాల్లో ఇండ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారికి ఇండ్ల పట్టాలివ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు హామీలను అమలు చేయాలని సిపిఐ నేతలు డిమాండ్ చేశారు. నస్పూర్ ఎంఆర్ఓ కార్యాలయం ఎదుట బుధవారం సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఆర్ఓ సంతోష్‌కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల దాసు మాట్లాడుతూ జిఒ నెంబర్ 76 ప్రకారం గతంలో ఇండ్ల పట్టాలిచ్చారు. ఇంకా చాలామంది పట్టాల కోసం ఎదురుచూస్తున్నారు. సింగరేణి స్థలాలను రెవెన్యూకు అప్పగించి వారికి పట్టాలు ఇవ్వాలి. అలాగే గృహలక్ష్మి , మహాలక్ష్మి , చేయూత, యువ వికాసం, ఆరోగ్య భద్రత, గృహజ్యోతి వంటి హామీలు ఇప్పటికీ అమలు కావడం లేదు. గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నవారిని ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం వల్ల ఉచిత విద్యుత్ ప్రయోజనం దక్కట్లేదు. దీనిపై అధికారుల వైఫల్యాన్ని ప్రభుత్వం పరిగణించాలి. ఆన్‌లైన్‌లో అందరినీ నమోదు చేయాలి అని పేర్కొన్నారు. అలాగే, అర్హులైన వారందరికీ షరతులు లేకుండా ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 చొప్పున నగదు, రూ.500కి గ్యాస్ సిలిండర్ ఇవ్వాలన్నారు. అదనంగా రేషన్ కార్డులు, ఫుడ్ సెక్యూరిటీ కార్డులు అందరికీ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి లింగం రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ గుర్తింపుతో పెన్షన్ ఇవ్వడం వల్ల అక్రమాలకు చెక్



**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** ముఖ గుర్తింపు యాప్ ద్వారా పెన్షన్లు ఇవ్వడం వల్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చునని జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య అన్నారు. బుధవారం సంగారెడ్డి మున్సిపల్ పరిధిలోని పోతిరెడ్డి పల్లి వార్డు కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. వృద్ధులు ,వికలాంగులు ,ఒంటరి మహిళలకు ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనివ్వాలని ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన ప్రభుత్వ చేయూత పెన్షన్లను ముఖ గుర్తింపు ప్రత్యేక ఆప్ ద్వారా అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ యాప్‌తో పెన్షన్లు ఇవ్వడం వల్ల వృద్ధులువేలిముద్రలు రాని వారికి ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు చెందిన వృద్ధులు ,వికలాంగులు ఒంటరి మహిళలకు చేయూత ఇవ్వాలని ఉద్దేశ్యంతో చేయూత పథకం వలన ప్రతి నెలా లబ్ధిదారులకు పెన్షన్ డబ్బులను ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు బిల్ కలెక్టర్‌లు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ద్వారా నూతనంగా ప్రభుత్వం రూపొందించిన ముఖ గుర్తింపు ప్రత్యేక యాప్ ద్వారా పెన్షన్ అందజేస్తున్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డు ,డేటా అనుసంధానంతో ఈ విధానం ఈ నెల నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కొత్త విధానంలోనే పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పింఛన్ విభాగం సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి పంపిణీ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎక్కడైనా సాంకేతిక సమస్యలు అప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఈ వినూత్న ప్రయోగం ద్వారా పింఛన్ లబ్ధిదారులకు నిత్య అవసరాలకు నిధులు సకాలంలో అందేలా అధికారులు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఆర్‌డిఒ సూర్యరావు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన ఎస్‌పి జానకి షర్మిళ




**ప్రజాపక్షం/బైంసా:**బైంసా పట్టణంలోని ఎస్‌పి డా.జి.జానకి షర్మిల,ఐపీఎస్ బుధవారం బైంసా ఎస్‌పి క్యాంప్ కార్యాలయ ంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. బై ంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 1 0 మంది ఆర్జీదారుల ఫిర్యాదులను స్వీకరించి,ప్రతి ఫిర్యాదు పై తక్షణమే స్పందించారు.ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధి త పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారామాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు.సమస్యలను త్వరితగతిన పరిస్కరించేందుకుచర్యలు చేపట్టాలనిఅధికారులకు ఆదేశాలుజారీ చే శారు.


**కుటుంబ వివాదాల పరిష్కారంలో షీ టీం పాత్ర :**

ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కు టుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది.ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా,బైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడంపై ఎస్పీ చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

**పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష:**

గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి,ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్‌లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

## మంచిర్యాలలో ఎక్స్‌ప్రెస్ రైళ్ళు నిలుపాలి



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** ఎన్నో సంవత్సరాలుగా కొండంత ఆదాయం సమకూర్చుతున్న మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో వందేభారత్, కేరళ ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ఆపాలని అలాగే సింగరేణి ప్రాంత ప్రజల హక్కుల సమస్యలను పరిష్కరించాలని పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు గడ్డం వంశీకృష్ణ బుధవారం పార్లమెంటు సమావేశాల్లో గళం ఎత్తి ప్రశ్నించారు. ఢిల్లీలో జరుగుతున్న వర్షాకాల సమావేశాల్లో పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, మంచిర్యాల, సింగరేణి ప్రాంతం నుండి రైల్వే శాఖకుఏటా పది నుండి 15 వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని అలాంటి పెద్ద ఆదాయం సమకూర్చే ప్రాంతమైన మంచిర్యాల రైల్వేస్టేషన్ పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ళు నిలుపాలని కోరితే దాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని రైల్వేశాఖను నిలదీశారు. ఆదాయం వచ్చే మంచిర్యాల రైల్వే స్టేషన్ వందే భారత్, కేరళ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ఆపాలని డిమాండ్ చేశారు. అలాగే సింగరేణి ప్రాంతం నుండి బొగ్గును తీసుకువెళ్ళి ఆదాయం చేసుకుంటున్నారని కానీ మం చిర్యాలలో రైళ్ళు ఆపడం లేదని తక్షణమే రైళ్ళు ఆపాలని ఎంపి గట్టిగా రైల్వేశాఖను నిలదీశారు.

## వ్యవసాయ రంగంలో... విప్లవాత్మక మార్పులకు ఇక్రిసాట్ శ్రీకారం

ఇక్రిసాట్‌తో ఎంఒయు కుదుర్చుకున్న కావేరి విత్తన విశ్వవిద్యాలయం * ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్



**ప్రజాపక్షం/గజ్వేల్:**వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఇక్రిసాట్ దేశంలోనే మొట్టమొదటి వ్యవసాయ పరిశోధన సంస్థగా ప్రసిద్ధికెక్కినట్లు ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండంల గౌరారం సమీపంలోని కావేరి యూనివర్సిటీ, విత్తన సంస్థ, మరియు పరిశోధన కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి వివిధ విభాగాలను పరిశీలించారు. నూతన సాంకేతికతతో అద్భుత వంగడాలను సృష్టించి వ్యవసాయ రంగంలో చరిత్ర సృష్టించాలని పేర్కొన్నారు. ఇక్రిసాట్ లోని వివిధ రంగాల సాంకేతికత అందిపుచ్చుకునేందుకు కావేరి యూనివర్సిటీ, విత్తన మరియు పరిశోధన కేంద్రం ముందుకు రావడంతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో దేశ పునర్నిర్మాణానికి కావేరి విశ్వవిద్యాలయ విద్యార్థులు ముందుకు రావాలని ఆకాంక్షించారు. అయితే అధునాతన సాంకేతికతను జోడించి నూతన పంటల దిగుబడి, ఉత్పాదతను పెంపొందించి దేశానికి సరిపడా ఆహార సంపదను సృష్టించే లక్ష్యం మన ముందున్నట్లు చెప్పారు. నూతన వ్యవసాయ పరిశోధనలతో ప్రపంచానికి సరిపడా ఆహార సంపదను సృష్టించి ఎగుమతి చేసే సత్తా దేశంలోని వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశోధన విద్యార్థులకు ఉండగా, ఇప్పటినుండే లక్ష్యసాధనలో ముందుండాలని అన్నారు. విద్యావ్యవస్థతో వినయం సిద్ధిస్తుందని, తద్వారా ఊహించని అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. విద్యార్థులు పుస్తక పరిజ్ఞానంతో సరిపెట్టుకోకుండా క్షేత్రస్థాయిలో పంట పొలాలు సందర్శించి వ్యవసాయ పరిశోధనలపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. కాగా ఇక్రిసాట్ తో ఒప్పందం కుదుర్చుకోవడంతో కావేరి విద్యార్థులు తమ శాస్త్రవేత్తలతో నేరుగా పరిశోధనలో పాల్గొనే అవకాశం దక్కిందని చెప్పారు. హైదరాబాద్ కు ఇక్రిసాట్ మరియు కావేరి యూనివర్సిటీలు సమీపంలో ఉండడం విద్యార్థులు అదృష్టంగా భావించి పరిశోధనల్లో అద్భుతమైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కావేరి యూనివర్సిటీ దేశంలోనే మొట్ట మొదటి అగ్రిటెక్ యూనివర్సిటీ కాగా, విద్య, మరియు పరిశోధనలను నేరుగా వ్యవసాయ క్షేత్రం, రీసెర్చ్ సెంటర్ లోనే కొనసాగించవచ్చని స్పష్టం చేశారు. నూతన ఆధునిక సాంకేతికత జోడించి దేశంలోని వ్యవసాయ రంగానికి విశిష్ట సేవలందించేందుకు కావేరి యూనివర్సిటీ ముందు వరుసలో ఉండడం శుభపరిణామమని వివరించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశ్రమలు కలిగి ఉన్న కావేరి యూనివర్సిటీ దేశంలోనే మొట్టమొదటిదిగా ప్రసిద్ధికెక్కినట్లు చాన్సలర్ భాస్కరరావు, వైస్ చాన్సలర్ ప్రవీణ్ రావు, వైస్ చైర్మన్ పవన్ రావు పేర్కొన్నారు. తమ సంస్థలో విద్యనభ్యసించిన విద్యార్థులను చక్కటి వ్యవసాయ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ ముందున్న ఏకైక లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రవీణ్ రావు, వైస్ చైర్మన్ పవన్ రావు, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ హర్షరావు, అగ్రికల్చర్ డీన్ డాక్టర్ ప్రతాప్ రెడ్డి, డీన్ ఆఫ్ టెక్నాలజీ డాక్టర్ కొండా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి సౌజన్యంతో స్వీట్ హౌస్ ప్రారంభం

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** మహిళలను కోటీశ్వరులు చేయాలని ముఖ్య లక్ష్యంతో వారి ఆర్థిక అభివృద్ధికి మూలాలను సృష్టించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక వినూత్నంగా ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించింది.పథకంలో భాగంగా ఎలిగేడు మండల కేంద్రంలో మంజునాథ గ్రామ సంఘము పరిధిలో శ్రీ మాణికంఠ స్వశక్తి సంఘం సభ్యురాలు కోడూరి రమకు జీవన ఉపాధి కోసం స్వీట్ హౌస్ షాపు ఏర్పాటు కొరకై బ్యాంకు లింకేజీ లక్ష రూపాయల రుణాన్ని ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మంజూరు చేశారు.
బుధవారం ఎలిగేడు ఎంపీడీవో భాస్కర్ రావు ముఖ్యఅతిథిగా హాజరై స్వీట్ హౌస్ హాజరు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎలిగేడు మండల ఎస్బిఐ శాఖ బ్రాంచ్ మేనేజర్ అమర్ నాయక్, ఏపీఎం సుధాకర్, ఆనంద్, సీసీ కౌసల్య, రాజేశ్వరి, మమత, రేఖ,తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులపై కలెక్టరుకు ఫిర్యాదు



## సుల్తానాబాద్ సిఐ, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్:** సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటకు చెందిన ఎరుకొండ వినోద్ ను సుల్తానాబాద్ సీఐ, ఎస్ఐ అకారణంగా కొట్టారని అతని తల్లి ఏరుకొండ సరోజన బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పిర్యాదు చేశారు. అనంతరం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వినోద్ భార్య హర్షిత, కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడారు. భూమి గెట్ల వివాదంలో పోలీసులు వినోద్‌ను తీసుకెళ్ళి తీవ్రంగా కొట్టారని విలపించారు. విచక్షణ రహితంగా వినోద్‌ను కొట్టిన సుల్తానాబాద్ సీఐ, ఎస్ఐ పై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

# సబ్ సెంటర్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సబ్ సెంటర్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సిరిసిల్ల జిల్లాలో మంజూరైన 16 పి.హెచ్.సి సబ్ సెంటర్ల నిర్మాణ పనుల పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.సిరిసిల్ల జిల్లాలో మంజూరైన 5 ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలలో 3 పి.హెచ్.సి లు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చామని,మరో పి.హెచ్.సి ప్రారంభానికి సిద్ధంగా ఉందని, గంభీర్ రావు పేట రూఫ్ దశలో ఉందని అధికారులు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, సిరిసిల్ల జిల్లాకు మంజూరైన 16 సబ్ సెంటర్ల మంజూరు కాగా 5 సబ్ సెంటర్ల నిర్మాణానికి స్థల సమస్యలు ఉన్నాయని తెలుసుకున్న కలెక్టర్ సంబంధిత మండల తహసిల్దార్ లతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి భూ సమస్యలను పరిష్కరించారు. పి.సెచ్.సి సబ్ సెంటర్ నిర్మాణ పనులు అదేవిధంగా గంభీరావుపేట్ పిహెచ్సి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ పంచాయతి రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పి.హెచ్.సి, సబ్ సెంటర్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు అందుబాటులో పెట్టిందని, పనులు ఆలస్యం కాకుండా ప్రత్యేక చోరువతో పని చేయాలని అన్నారు. అగ్రహారం, తిప్పపూర్ బస్టాండ్ ప్రాంతంలో కొత్త సబ్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలని అన్నారు.ఈ సమావేశంలో ఈ ఈ పి ఆర్ సుదర్శన్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, ఆర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం భోజనం అందించాలి



**ప్రజాపక్షం/దుబ్బాక:** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన , శుభ్రతతో కూడిన భోజనం అందించాలని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ హైమవతి అధికారులకు ఆదేశించారు. బుధవారం దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డిలోని వసతి గృహాలను, దుబ్బాక మండలం తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆహార పదార్థల నాణ్యత, వాటి గడువు తేదీ పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. మెనూ పాటించకుండా భోజనం పెడుతున్న నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిరుదొడ్డి, తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరా ప్రాంతాలను శుభ్రం చేయాలని ఎంపిడివోలకు ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తగా పాటించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉచితంగా మెరుగైన వైద్యం అందిస్తామని, ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి అనవసరంగా డబ్బులు వృథా చేసుకోవద్దని ప్రజలు సూచించారు. మిరుదొడ్డి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇల్లు అనేది మధ్య తరగతి ఒక కల కాబట్టి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఇంటి నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘంలో సేల్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. రైతులకు భూ విస్తీర్ణం ప్రకారం మాత్రమే ఎరువులు అందజేయాలని ఎలా పడితే అలా ఇస్తే కఠిన చర్యలు తప్పవని ఎరువులు అక్రమంగా విక్రయం జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మురుగునీటి కాలువలతో పెరిగిన దోమల బాధ



**పజాపక్షం/ వేములవాడ:** వేములవాడలో మురుగునీటి కాలువల తో పెరిగిన దోమల బాధ సీపీఐ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కదారి రాములు బుధవారం మీడియాతో మాట్లాడుతూ మురికి కాలువల పక్కన చెత్త చెదారం పేరుకుపోయి మురికి నీటితో దుర్గంధం వస్తోందని, దీని ద్వారా దోమలు పెరిగి ఇబ్బందులు అవుతున్నాయని, దోమల మందును స్ప్రే చేయక పోవడంతో దోమల బాధ ఎక్కువైంది అని, కూలిపోయిన మురుగు నీటి కాలువలను వెంటనే పునర్నిర్మించాలని, అవసరం ఉన్న చోట నూతన డ్రైనేజీలు నిర్మించాలని అన్నారు. వేములవాడ మొదటి బైపాస్, రెండవ బైపాస్ లో ఆర్ అండ్ బీ వారు డివైడర్ లు నిర్మించక పోవడంతో ఎన్నో ఆక్సిడెంట్ లు అవుతున్నాయని, సరైన రవాణా సౌకర్యాలు లేవని, డ్రైనేజీ పైన బిల్లలు నిర్మించాలని, డ్రైనేజీలలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, నీరు నిలిచిన చోట గడ్డిని, చెత్తను తొలగించి మురుగు నీరు పోయేలా చూడాలని వేములవాడలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన స్టాఫ్‌ను నియమించాలని కదారి రాములు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ సీపీఐ పార్టీ కార్యదర్శి ఎల్ల దేవరాజు రావు హనుమంతు, కుమ్మరి ప్రశాంత్, శ్రావనపెల్లి మల్లేశం, జబ్బుల దేవయ్య, పెంబర్‌రాజు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం ప్రారంభం

**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గోదాంను బుధవారం ప్రభుత్వం విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ప్రత్యేక నిధులు వెచ్చించి అభివృద్ధి కోసం సహకరిస్తామన్నారు. అనంతరం ఏనుగు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాలు రైతుల పక్షాన పని చేస్తాయని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహకార సంఘాల ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించి గోదాములను ఏర్పాటు చేసుకుంటున్నామని అన్నారు. సహకార సంఘాల ద్వారానే రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. శాతరాజుపల్లి, వట్టెంల, చెక్కపల్లి వేములవాడ, నూకలమర్రి గ్రామాలలో గోదాములను పూర్తి చేసుకొని రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామని, త్వరలో అర్బన్ మండలంలోని మారుపాక గ్రామంలో నిర్మాణంలో ఉన్న గోదామును ప్రారంభోత్సవం చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నిరంతర ప్రక్రియగా నూతన రేషన్ కార్డులు

## ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ బి.సత్యప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాల:** నిరంతరం ప్రక్రియగా నూతన రేషన్ కార్డుల జారీ కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. బుధవారం రోజున జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి భీమారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమారం మండలంలో 411 పేద కుటుంబాలకు నూతన రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని, అదే సమయంలో ప్రస్తుతం ఉన్న 1077 రేషన్‌కార్డులలో కొత్త సభ్యులను జమ చేస్తున్నామని తెలిపారు. పేద ప్రజలు జీవనం కొనసాగించాలంటే రేషన్ కార్డు చాలా ముఖ్యమైనదని తెలిపారు. ఉచిత విద్యుత్ , ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమలాకు రేషన్‌కార్డు ఉపయోగపడుతుందని తెలిపారు . రేషన్ కార్డుల జారీ నిరంతరం ప్రక్రియగా జరుగుతుందని, ఎవరైన అర్హులు దరఖాస్తు చేసుకుంటే వెంటనే పరిశీలించి రేషన్ కార్డు మంజూర్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జివాకర్‌రెడ్డి, సివిల్ సప్లై అధికారి జితేంధర్‌రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంఆర్‌వో, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

## కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం జిల్లాలోని కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించారు.ఓపి రిజిస్టర్ పరిశీలించి రోగుల వివరాలు, అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎన్‌సిడి రిపోర్టు, అబా, ఆరోగ్య మేళా కింద జరిగిన పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. ఐపి వార్డుకు వెళ్లి రోగుల పరిస్థితి ఆరా తీశారు. ఆపరేషన్ థియేటర్, లేబర్ రూమ్‌కు వెళ్లి సౌకర్యాలు పరిశీలించారు. గర్భిణిల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వారికి పరీక్షలు, మందులు సకాలంలో అందించాలని పేర్కొన్నారు. వారి వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకట రమణ, అధికారులు సనా, నాజియా లున్నారు.



# అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందిస్తాం

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/చొప్పదండి:** రేషన్ కార్డు కలిగి ఉండాలన్న ప్రతి పేదోడి కలను సాకారం చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాలులో నూతన రేషన్ కార్డులను కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లు అంధాకరంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డుల ఊసే లేకుండా పేదోళ్ల పొట్ట కొట్టారన్నారు. ఒక్క రేషన్ కార్డు సైతం ఇవ్వకుండా నియంత పరిపాలన కొనసాగించారన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వడమే కాకుండా పేదోడి కడుపు నింపాలన్న సంకల్పంతో సన్న బియ్యం పంపిణీ చేస్తూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, ఎవరైన అర్హులు ఉన్నట్లైతే ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం 38 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు, రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు , మహిళలు, కార్యకర్తలు తదితరులున్నారు.

# పిల్లల ఎదుగుదలను రెగ్యులర్ మానిటరింగ్ చేయాలి

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** జిల్లాలో 5 సంవత్సరాల వయస్సు లోపు పిల్లల ఎదుగుదలను రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంక్షేమ శాఖ పని తీరు పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 5 సంవత్సరాల లోపు పిల్లలందరి ఎత్తు, బరువు రెగ్యులర్ గా చెక్ చేయాలని, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే పిల్లలను కూడా తప్పనిసరిగా చెక్ చేసి సామ్ (బరువు తక్కువ), మామ్ (ఎత్తు తక్కువ) పిల్లలను గుర్తించాలని అన్నారు. ప్రతి నెలా ప్రైవేట్ పాఠశాలలో చదివే పిల్లల ఎదుగుదల మానిటరింగ్ కోసం షెడ్యూల్ తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోషక లోపం ఉన్న పిల్లలకు తప్పనిసరిగా బాలామృతం ప్లస్ సరఫరా చేయాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీ స్త్రీల నమోదు 100% ఉండాలని, మంథని సెక్టార్ లో 66 గర్భిణుల రిజిస్ట్రేషన్ జరిగితే, సుల్తానాబాద్ , గర్రెపల్లి వంటి సెక్టార్ లలో 170 పైగా జరుగుతున్నాయని , లోపాలను గుర్తించి పూర్తి స్థాయిలో ప్రతి గర్భిణీ మహిళ అంగన్వాడీ కేంద్రంలో నమోదయ్యేలా చూడాలని అన్నారు. ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు సమన్వయంతో పని చేయాలని, ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ జరిగిన ప్రతి గర్భిణీ మహిళ తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రంలో రిజిస్టర్ కావాలని కలెక్టర్ తెలిపారు. గర్భిణిగా ఉన్నప్పుడు అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం తీసుకుంటే పిల్లల ఎదుగుదల బాగుంటుందని ప్రచారం చేయాలని అన్నారు. గర్భిణీ మహిళల రిజిస్ట్రేషన్ తో పాటు ప్రతి నెలా 21 రోజులు అంగన్వాడి కేంద్రానికి తప్పనిసరిగా వచ్చేలా ఫాలో అప్ చేసుకోవాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రానికి తక్కువగా వచ్చే గర్భిణులను ట్రాక్ చేయాలని, ప్రతి గర్భిణీ మహిళకు పౌష్టికాహారం అందించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల అటెండెన్స్ తక్కువగా ఉండటం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రంలో నమోదైన పిల్లల హాజరు వివరాలను రెగ్యులర్ గా సిడిపిఓ, సూపర్ వైజర్లు రివ్యూ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ మరణాలకు 25 లక్షల వరకు ఎక్స్ గ్రేషియా...

## ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్

AITUC SCWU

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణి లో మైన్ / రోడ్ మరియు ఇతర ప్రమాదాలలో మరణించిన కార్మికులకు ఏఐటియుసి విజ్ఞప్తి మేరకు సింగరేణి యాజమాన్యం కోటి నుండి కోటి 25 లక్షల వరకు బ్యాంకులతో అగ్రిమెంట్ చేసి చెల్లిస్తున్న విషయం కార్మికుల కు తెలిసిందే! కానీ సాధారణ మరణాలు, వివిధ జబ్బుల కారణాల వలన సంవత్సరానికి సుమారు 200 మంది వరకు మరణిస్తున్నారని యాజమాన్యం లెక్కలు చెబుతున్నాయని వారి కుటుంబాలకు కూడా ఆర్థిక ప్రయోజనం ఇప్పించాలని గుర్తింపు సంఘం ఏఐటియుసి యూనియన్ యాజమాన్యంతో మాట్లాడి సాధారణ లేక ఇతర కారణాలతో మరణించినవారి కుటుంబాలకు 25 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని సింగరేణి యాజమాన్యం కు లేఖ రాసి దీనిపై యాజమాన్యంతో చర్చించుచున్నామని ఒక కొరిమి రాజ్ కుమార్ ప్రకటనలో తెలిపారు. యాజమాన్యం బ్యాంకులతో మాట్లాడగా పంజాబ్ నేషనల్/ ఎస్‌బిఐ బ్యాంకుల కాకుండా ఇతర బ్యాంకులతో చర్చిస్తుంది. ఏఐటీయూసీ యూనియన్ ఇన్సూరెన్స్ కంపెనీలతో కూడ చర్చించి సాధారణ / ఏదేని జబ్బుల ద్వారా మరణించిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడానికి ప్రయత్నం చేస్తుందని, ఈ ప్రయత్నం త్వరలో ఫలిస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు.

# "పోలీసుల నిర్లక్ష్యానికి మరో నిండు ప్రాణం బలి"





**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** మద్దూరు మండలంతో పాటుగా సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలు గాడితప్పుతున్నాయ అంటే వరుస సంఘటనలతో అవుననే సమాధానం వస్తంది. సినిమాలో, ఇతర మాధ్యమాల ప్రభావమో తెలియదు కానీ, క్షణికావేశంతో నేర సంస్కృతి రోజురోజుకు పెరుగిపోతుంటే, శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలైపోతున్నాయి. ఇది సమాజంలో ఆందోళన కలిగిస్తోంది. మొన్న తన సొంత కూతురుని కాల్లు కడిగి కన్యాదానం చేసిన అత్తనే అల్లుడు అతిదారుణంగా హత్య చేసిన ఘటన మరువక ముందే మండలంలోని గాగిల్లాపూర్‌లో గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన మరో ఘనట చోటు చేసుకుంది. దింతో ఉమ్మడి మద్దూరు మండల వ్యాప్తంగా శాంతి భద్రతలపై ఈ వరుస సంఘటనతో మండలం ఉలిక్కి పడింది. రెండు గ్రామాలకు (మద్దూరు మండలం గాగిల్లాపూర్, ములుగు మండలకేంద్రం గ్రామానికి) చెందిన స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం సిద్ధిపేట జిల్లా ములుగు గ్రామానికి చెందిన తిగుల్ల నెహ్రూ ములుగు మండల కేంద్రంలోని ఐకెపి (ఇందిరా క్రాంతి పథకం) లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. రోజు మాదిరి గానే నెహ్రూ సోమవారం ఉదయం డ్యూటి అని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దింతో మంగళవారం ఈ విసయంపై నెహ్రూ సోదరుడు ములుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై సకాలంలో పోలీసులు స్పందించకపోవడంతో తిగుళ్ల నెహ్రూ గాగిల్లాపూర్ గ్రామంలోని పెద్ద చెరువులో శవమై తేలాడు. ప్రాథమికంగా స్థానికులు అంచనా ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో చంపి వేసిన తరువాత, మృతుడి కాళ్లు చేతులు తాడుతో కట్టివేసి, శవం బయటపడకుండా ఉండడానికి బరువైన బండ రాల్లను, పరికరాలను కట్టి చెరువులో పడేసినట్లు తెలుసుంది. మరోవైపు ములుగు పోలీస్ స్టేషన్ ముందు మృతుని కుటుంబ సభ్యులతో గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఇలా మరో సంఘటన చోటు చేసుకోకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మద్దూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని టీంతో ఆధారాలను సేకరిస్తున్నారు.

# చెత్త సేకరణ కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి

## ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ. గౌస్ డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** రామగుండం నగర పాలక సంస్థ లో పని చేస్తున్న చెత్త సేకరణ కార్మికుల కు సౌకర్యాలు కల్పించాలని ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ఎ గౌస్ డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కార్పొరేషన్ లో పని చేస్తున్న చెత్త సేకరణ కార్మికుల కు వర్షాకాలంలో రేయిన్ కోట్స్, చేతులకు గ్లౌజులు, మూతికి మాస్కులు, డెట్టాల్ లోషన్, సబ్బులు, కొబ్బరి నూనె, బెల్లం, తవల్ లు ఇవ్వాల్సి ఉండగా చాలా కాలం నుంచి ఇవ్వడం లేదని, వీరికి సరైన సౌకర్యాలు కల్పించక పోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు, వెంటనే వారికి రక్షణ వస్తువులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కార్పొరేషన్ కు ఇంచార్జ్ గా ఉన్న జిల్లా కలెక్టర్ ను మరియు స్థానిక అధికారులను డిమాండ్ చేశారు. ప్రతి డివిజన్ లో ఇంటింటి కి చెత్త సేకరణ చేసే కార్మికుల కు అదనంగా రోడ్లను ఊడవడం, చెత్త బండ్ల పై వెళ్ళడం, కాలువలు మరియు ఇతర పనులు అధికారులు చెప్పడం వల్ల వారు అధిక పని భారం వల్ల తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా చెత్త సేకరణ చేసే కార్మికుల కు వేతనాలు అతి తక్కువ గా ఇవ్వడం వల్ల పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు వారి కి ఇచ్చే వేతనాలు సరిపోవడం లేదని ఆయన అన్నారు. చాలిచాలని జీతాలతో పని చేస్తున్న కార్మికుల కు సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కనుక జిల్లా కలెక్టర్ స్పందించి రామగుండం నగర పాలక సంస్థ లో పని చేస్తున్న చెత్త సేకరణ కార్మికుల కు చట్ట బద్ధమైన సౌకర్యాలు, వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. . ఇంకా ఈ సమావేశంలో మహిళా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆగస్టు 4,5 తేదీల్లో మీనాక్షి నటరాజన్ పర్యటన

## చొప్పదండి నియోజక వర్గం కొండగట్టు నుంచి షురూ..



**ప్రజాపక్షం/కరీంనగర్:** ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ లు ఆగస్టు 4,5 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని చొప్పదండి నియోజక వర్గంలో రెండు రోజుల పాదయాత్ర, శ్రమదానంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించనున్నారు. రంగారెడ్డి జిల్లా పరిగిలో నేటి సాయంత్రం ప్రారంభం కానున్న పాదయాత్ర ఆందోల్, ఆర్మూర్, ఖానాపూర్, చొప్పదండి, వర్ధన్నపేట 6 సెగ్మంట్లలో కొనసాగనుంది. ఉమ్మడి జిల్లాలో ఒక నియోజక వర్గంలో పాదయాత్రతో పాటు శ్రమదానం చేసి అక్కడే బస చేయదంతో పాటు స్థానిక నాయకత్వంతో సమావేశం నిర్వహించేందుకు రూట్ మ్యాప్ తయారు చేశారు.

**కొండగట్టు నుంచి..**

ఏఐసీసీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆగస్టు 4 మధ్యాహ్నం జిల్లాలోని చొప్పదండి నియోజక వర్గంలోని కొండగట్టు కు చేరుకొని శ్రీ అంజనేయస్వామి సన్నిధిలో పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి వెంకటయ్య పల్లి వరకు 10 కిలో మీటర్ల పాదయాత్ర నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి అక్కడే బస చేస్తారు. 5వ తేది ఉదయం గంగాధర మండలంలోని ఒక గ్రామంలో 11 గంటలకు శ్రమదానం కార్యక్రమంలో పాల్గొని మధ్యాహ్నం 12 గంటలకు ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీదర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మన్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనావాస్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం ఇక్కడి నుంచి వరంగల్ జిల్లా వర్ధన్న పేటకు వెళ్లనున్నారు.

**పార్టీ క్యాడర్ లో నూతన ఉత్తేజం..**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తి కావస్తుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో పార్టీ గెలుపొందే విధంగా క్యాడర్ లో నూతనొత్తేజం నింపేందుకు ఈ పర్యటన దోహదం చేయనుంది. రాష్ట్రంలో కులగణన, బిసి రిజర్వేషన్ల విషయంలో జరుగుతున్న రాజకీయంలో బిఆర్ఎస్, బిజెపి వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ మండిపడుతోంది. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకెళ్తోంది. గత ప్రభుత్వం బిఆర్ఎస్ వైఫల్యాలు, బిజెపి రాజకీయ ఎత్తుగడలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రజల అభిప్రాయాలను ఈ పర్యటనలో తెలుసుకోనున్నారు.

# క్రీడ

## వరల్డ్ కప్ హీరోపై వేటు

### లక్నో బౌలింగ్ కోచ్‌గా భరత్ అరుణ్



ఐపిఎల్ 19వ సీజన్‌కు ముందే ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పలు ఫ్రాంచైజీలు పాత కోచింగ్ సిబ్బందిని వదిలించుకోవడమే ఆలస్యం కొన్ని జట్లు వాళ్లతో ఒప్పందానికి సిద్ధమవుతున్నాయి. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తెగతెంపులు చేసుకున్న భరత్ అరుణ్ లక్నో సూపర్ జెయింట్స్ కోచ్‌గా నియమితులయ్యాడు. మూడేళ్లుగా కోల్‌కతా బౌలింగ్ దళాన్ని పర్యవేక్షిస్తున్న ఆయన.. చెన్నై సూపర్ కింగ్స్ టీమ్‌తో కలుస్తాడనే వార్తలు నెట్టింట వైరలయ్యాయి. కానీ, తెలివిగా పావులు కదిపిన సంజీవ్ గొయెంకా బృందం ఆయనతో ఒప్పందం చేసుకుంది. దాంతో, ప్రస్తుతం బౌలింగ్ కోచ్‌గా ఉన్న వరల్డ్ కప్ హీరో జహీర్ ఖాన్‌ను లక్నో వదిలించుకోనుందని తెలుస్తోంది. ఇక .. భరత్ విషయానికొస్తే రెండేళ్ల పాటు ఆయన ఎల్ఎస్జీతో కొనసాగుతాడని సమాచారం. పద్దెనిమిదో సీజన్ ముందు జహీర్ ఖాన్‌తో లక్నో ఏడాది కాలానికి ఒప్పందం కుదుర్చుకుంది. జహీర్ నేతృత్వంలో లక్నో పేస్ యూనిట్ గొప్పగా రాణించలేకపోయింది. పేసర్ల వైఫల్యంతో ప్రత్యర్థులకు భారీ స్కోర్లు సమర్పించుకున్న ఆ జట్టు ప్లే ఆఫ్స్ చేరలేకపోయింది. ఈ నేపథ్యంలో బౌలింగ్ కోచ్‌గా ఈ యార్కర్ కింగ్ కాంట్రాక్టును పొడిగించడానికి సంజీవ్ గొయెంకా టీమ్ సిద్ధంగా లేదు. అందుకే.. అతడి స్థానంలో భరత్ అరుణ్‌ను నమ్ముకోవడమే మంచిదని లక్నో భావించింది. వచ్చే ఏడాది జరుగబోయే 19వ సీజన్‌లో అరుణ్ ఆధ్వర్యంలో తమ బౌలింగ్ దళం గొప్పగా రాణిస్తుందని లక్నో యాజమాన్యం భావిస్తోంది.

**రెండు దఫాలు..**

భారత జట్టు బౌలింగ్ కోచ్‌గా సుదీర్ఘ అనుభవం, మంచి ట్రాక్ రికార్డు కలిగిన భరత్.. రెండు దఫాలు భారత జట్టుకు సేవలందించారు. మొదటిసారి 2014 15 వరకూ బౌలింగ్ దళాన్ని నడిపించిన ఆయన.. రెండో పర్యాయం 2017 జూలై 16 నుంచి 2021 పొట్టి ప్రపంచ కప్ వరకూ కోచ్‌గా పనిచేశారు. ఆయన నేతృత్వంలోనే స్పీడ్‌స్టర్లు జస్ప్రీత్ బుమ్రా, ఇషాంత్ శర్మ, షమీ, ఉమేశ్ యాదవ్‌లు రాటుదేలారు.

## దేశం కంటే ఫ్రాంచైజీలకు ఆడడమే నాకిష్టం

### ఆస్ట్రేలియా మహిళల జట్టు స్పిన్నర్ అమంద వెల్లింగ్టన్



ఈ టీ20ల కాలంలో అందరూ ఫ్రాంచైజీ క్రికెట్ ఆడేందుకు ఇష్టపడుతున్నారు. తాజాగా ఓ క్రికెటర్ సైతం తనకు దేశం కంటే ఫ్రాంచైజీలకు ఆడడమే నచ్చుతుందని తెలిపింది. ఆమె ఎవరో కాదు ఆస్ట్రేలియా మహిళల జట్టు స్పిన్నర్ అమంద వెల్లింగ్టన్. మామూలుగా కంగారూ జట్టు ఆటగాళ్లు చాలామంది దేశానికే తొలి ప్రాధాన్యం ఇస్తారు. కానీ, ఈమె మాత్రం తనకు ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు ఆడడం ఇష్టముండదని వెల్లడించింది. పొట్టి క్రికెట్ వైపే మొగ్గు చూపడానికి ఓ కారణం ఉందంటోంది అమందా.. అదేంటంటే..? ఈఎస్‌పీఎన్ క్రిక్ఇన్ఫో పవర్ ప్లే పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో అమందా అంతేకాదు మానసికంగా ఆరోగ్యంగా ఉండడం, వ్యక్తిగతంగా అన్ని విధాలా సంతృప్తిగా జీవించడం తన తొలి ప్రాధాన్యాలని చెప్పింది. ఇక ఫ్రాంచైజీ క్రికెట్‌ను ఎంచుకోవడం గురించి ఆమె షాకింగ్ కామెంట్స్ చేసింది. తాను ఎందుకు జాతీయ జట్టు సెలెక్షన్స్‌కు దూరంగా ఉంటున్నానో కూడా వివరించింది. 'అంతర్జాతీయ క్రికెట్ ఆడకూడదనేది నేను వ్యక్తిగతంగా తీసుకున్న నిర్ణయం. ప్రస్తుతం టీ20 లీగ్స్ రూపంలో బోలెడన్ని అవకాశాలు ఉన్నప్పుడు జాతీయ జట్టుకే ఆడాలనుకోవడంలో అర్థం లేదు. నేనైతే దేశం కంటే ఫ్రాంచైజ్ క్రికెట్‌కే ఓటేస్తాను. అలా అని నన్ను అపార్థం చేసుకోవద్దు. ఆస్ట్రేలియాకు ఆడడం నిజంగా గొప్ప గౌరవం. అయితే.. మ్యాచ్‌ల కోసం ప్రపంచాన్ని చుట్టి రావడం..పలు ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించి వివిధ దేశాల క్రికెటర్లతో పరిచయాలు పెంపొందించుకోవడం నాకు చాలా ఇష్టం' అని చెప్పిందీ లెగ్ స్పిన్నర్.

**2016లో అరంగేట్రం**

దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన అమందా 2016లో అరంగేట్రం చేసింది. 2022 మహిళల వన్డే వరల్డ్ కప్ ఆడిన ఆస్ట్రేలియా జట్టులో సభ్యురాలు తను. ఇప్పటివరకూ ఆమె ఆసీస్ తరఫున 14 వన్డేలు, 8 టీ20లు, ఒకే ఒక టెస్టు మ్యాచ్ ఆడింది. మూడు ఫార్మాట్లలో కలిపి 30 వికెట్లు తీసింది. కొన్నాళ్లుగా బిగ్‌బాష్ లీగ్, ది హండ్రెడ్ లీగ్ వంటి ఫ్రాంచైజీ క్రికెట్ లీగ్‌ల మీదనే దృష్టి పెట్టిన అమందా పలు జట్లకు ప్రాతినిధ్యం వహించింది. సదర్న్ వైపర్స్ ఒటాగో, సదర్న్ బ్రేవ్, మాంచెస్టర్ ఒరిజినల్స్, వెస్ట్రన్ స్టార్మ్, ఓవల్ ఇన్విన్సిబుల్ జట్ల జెర్సీతో బరిలోకి దిగిందీ స్పిన్నర్. డబ్ల్యూపీఎల్‌లో అమందా అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన.. 5-8.

## ఇంగ్లాండ్‌కు షాక్..

### కెప్టెన్ సహా ఆ నలుగురు ఔట్!



అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో సిరీస్ విజయంపై కన్నేసిన ఇంగ్లాండ్‌కు ఊహించని షాక్ తగిలింది. మాంచెస్టర్ టెస్టులో శతకంతో చెలరేగిన కెప్టెన్ బెన్ స్టోక్స్ ఓవల్ టెస్టుకు దూరమయ్యాడు. భుజం గాయంతో బాధ పడుతున్న స్టోక్స్ నిర్ణయాత్మక టెస్టులో ఆడడం లేదని బుధవారం ఇంగ్లాండ్ వేల్స్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. అంతేకాదు ఓవల్ టెస్టుకు గతంలో సారథ్యం వహించిన అనుభవం ఉన్న ఓలీ పోప్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు సెలెక్టర్లు. స్టోక్స్ దూరమవ్వడంతో తుది జట్టులో భారీ మార్పులు చేశారు సెలెక్టర్లు. మాంచెస్టర్‌లో ఆడిన పలువురికి ఓవల్ టెస్టులో చోటు దక్కలేదు. సీనియర్ పేసర్లు ఆర్చర్, బ్రైడన్ కార్సేతో పాటు ఎనిమిదేళ్ల తర్వాత తొలి మ్యాచ్ ఆడిన స్పిన్నర్ లియామ్ డాసన్‌ను కూడా పక్కన పెట్టేశారు. వీళ్ల స్థానంలో జాకబ్ బెథెల్, గస్ అట్కిన్సన్ జోష్ టంగ్, జేమీ ఓవర్టన్‌లను ఎంపిక చేశారు. పేసర్లకు పెద్ద పీట వేయడం చూస్తుంటే ఓవల్‌లో బౌన్సీ ట్రాక్ సిద్ధం చేశారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇంగ్లండ్ తుది జట్టు : జాక్ క్రాలీ, బెన్ డకెట్, ఓలీ పోప్(కెప్టెన్), జో రూట్, హ్యారీ బ్రూక్, జాకబ్ బెథెల్, జేమీ స్మిత్(జేమీ స్మిత్), క్రిస్ వోక్స్, గస్ అట్కిన్సన్, జేమీ ఓవర్టన్, జోష్ టంగ్.

మాంచెస్టర్‌లోనే సిరీస్ కైవసం చేసుకోవాలనుకున్న ఇంగ్లాండ్‌కు భంగపాటు ఎదురైంది. భారత ఆటగాళ్లు గిల్, రాహుల్, జడేజా, సుందర్‌ల అద్భుత పోరాటంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

# ఫోకస్ కళారంగం

## బలపడుతున్న ధిక్కార కళారూపాలు



ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ధిక్కార కళారూపాలు (Rebel Art Forms) బలపడుతున్నాయి. సాంప్రదాయ కళలకు భిన్నంగా, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక నిబంధనలను సవాలు చేసే, స్వేచ్ఛ, వ్యక్తీకరణ, ప్రతిఘటనలను ప్రోత్సహించే కళారూపాలు విస్తరిస్తున్నాయి. ఈ కళలు తరచూ అణచివేత, అసమానతలు, అన్యాయాలను ఎదిరించడానికి మాధ్యమంగా ఉపయోగపడతాయి. ఇలాంటి ధిక్కార కళారూపాల్లో స్ట్రీట్ ఆర్ట్, గ్రాఫిటీది అగ్రస్థానం. గోడలపై రాసే గ్రాఫిటీ, స్టెన్సిల్ ఆర్ట్, మ్యూరల్స్ వంటివి ప్రజల దృష్టిని ఆకర్షించి సామాజిక సందేశాలను అందిస్తాయి. బాంక్సీ వంటి కళాకారులు రాజకీయ, సామాజిక విమర్శలను తమ గ్రాఫిటీ ద్వారా వ్యక్తం చేశారు. బెర్లిన్ గోడపై గ్రాఫిటీ, పాలస్తీనాలోని విభజన గోడలపై మ్యూరల్స్ ఇలాంటి గ్రాఫిటీ ఆర్ట్‌కు ఉదాహరణలు. ఇవి ప్రభుత్వ విధానాలు, అసమానతలపై చర్చను ఆహ్వానిస్తాయి. సంగీతం ద్వారా అణచివేతకు వ్యతిరేకంగా గళం వినిపించడాన్ని ప్రొటెస్ట్ మ్యూజిక్‌గా పేర్కొంటున్నారు. బాబ్ డైలాన్, బాబ్ మార్లే, ఫెలా కుటి వంటి కళాకారులు తమ సంగీతంతో సామాజిక మార్పులను ఈ ప్రక్రియ ద్వారా ప్రేరేపించారు. అమెరికాలో జరిగిన సివిల్ రైట్స్ ఉద్యమంలో 'వియ్ షల్ ఓవర్‌కమ్', దక్షిణాఫ్రికాలో అపార్థీడ్ వ్యతిరేక గీతాలు ఈ తరహా సంగీతానికి ఉదాహరణలు. ఇవి ప్రజలను ఏకం చేసి, సామూహిక ప్రతిఘటనకు బలం చేకూర్చాయి. కాగా, శరీరం, స్థలం, సమయాన్ని ఉపయోగించి సామాజిక సమస్యలపై ధిక్కార స్వరాన్ని వ్యక్తం చేయడమే పర్ఫార్మెన్స్ ఆర్ట్స్ లక్ష్యం. ఇది తరచూ ప్రేక్షకులను అసౌకర్యానికి గురిచేస్తుంది. ఉదాహరణకు మరీనా అబ్రమోవిక్, పెట్రస్ పావ్లెన్స్కీ వంటి కళాకారులు తమ శరీరాన్ని సామాజిక విమర్శకు సాధనంగా ఉపయోగించారు. సామాజిక నిషేధాలను ప్రశ్నించడం, చర్చలను రేకెత్తించడం వంటి ప్రభావాలు కనిపిస్తాయి. దాడాయిజం ప్రక్రియ 20వ శతాబ్దంలో సాంప్రదాయ కళా నియమాలను తిరస్కరించి, యుద్ధం, సామ్రాజ్యవాదంపై విమర్శలను వ్యక్తం చేసింది. ఈ విధానం కళ నిర్వచనాన్ని మార్చి, సామాజిక నిబంధనలను సవాలు చేసింది. ఇలాంటి విభిన్నమైన కళా రూపాలు, విధానాలు కొత్త పుంతలు తొక్కుతూ, ప్రజా చైతన్యానికి పునాదులు వేస్తున్నాయి. సోషల్ మీడియా రంగం ప్రవేశంతో ధిక్కార కళలు కొత్త రూపాన్ని సంతరించుకొని, సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్నాయి.

## సొహ్రాయ్, ఖోవర్ పెయింటింగ్స్‌తో ఆకట్టుకున్న కళా ఉత్సవ్



న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వేదికగా జరిగిన కళా ఉత్సవ్ 2025 సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. 'ఆర్టిస్ట్స్ ఇన్ రెసిడెన్స్ ప్రోగ్రామ్' అనే పేరుతో జరిగిన ఈ ఉత్సవంలో, హ్రాయ్, పట్టచిత్ర, పటువా వంటి సాంప్రదాయ చిత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమం భారత జీవన కళా సంప్రదాయలను గౌరవించడమేగాక, జానపద, గిరిజన, సాంప్రదాయ కళాకారులకు తమ ప్రతిభ నిరూపించుకునే వేదికను కల్పించింది. ఇక్కడ ప్రదర్శనకు ఉంచిన చిత్రాల్లో సోహ్రాయ్ పెయింటింగ్ అనేదిది జార్ఖండ్‌లోని హజారీబాగ్ ప్రాంతంలోని కుర్మి, సంతల్, ముండా, ఒరాన్, అగారియా, ఘట్వాల్ సమూహాలతో సహా వివిధ గిరిజన వర్గాల మహిళలు ఆచరించే సాంప్రదాయ స్వదేశీ కళారూపం. పంటకోత కళగా పిలువబడే ఇది వ్యవసాయం మరియు పశువుల పెంపకంతో లోతుగా ముడిపడి ఉంది. 'సోహ' లేదా 'సోరో' అనే పదానికి తరిమికొట్టడం అని అర్థం. 'రాయ్' అంటే క్రమను సూచిస్తుంది. ఈ ఆచారంలో భాగంగా, పశువులను ఇళ్లలోకి స్వాగతించడానికి మండలాలు లేదా అరిపాన్‌లను బియ్యం పిండితో గీస్తారు. ఈ పనిని గ్రామీణ మహిళలు స్వయంగా నిర్వహిస్తారు. సోహ్రాయ్ ఖోవర్ పెయింటింగ్ 2020 సంవత్సరంలో భౌగోళిక సూచిక (జియో ఇండెక్స్ లేదా జిఐ) ట్యాగ్‌ను పొందింది.



ఇక పట్ట చిత్ర ఒడిశాలో ఉద్భవించింది. ఇది పూరీలోని జగన్నాథ ఆలయంతో దగ్గరి సంబంధం కలిగి ఉంది. ఇక్కడ దీనిని సాంప్రదాయకంగా గర్భగుడి అలంకరించడానికి ఉపయోగిస్తారు. సుద్ద పొడి, చింతపండు గింజల జిగురుతో పూత పూసిన వస్త్రం (పాటా)పై వేసే పెయింటింగే పట్టచిత్ర. కూరగాయలు, మట్టి, ఖనిజ వనరుల నుండి సహజ రంగులను మాత్రమే దీనికి వాడతారు. ఈ పెయింటింగ్ ఇతివృత్తాలలో మతపరమైన, పౌరాణిక, జానపద కథలు ఉన్నాయి. పెన్సిళ్లు లేదా బొగ్గు లేకుండా , కళాకారులు సరిహద్దులతో ప్రారంభించి, లేత ఎరుపు, పసుపు బ్రష్‌లతో నేరుగా స్కెచ్ వేస్తారు. మెరుపు, వాటర్ ప్రూఫ్ కోసం లక్క పూతతో ముగిస్తారు.

పటువా పెయింటింగ్ పశ్చిమ బెంగాల్ నుండి వచ్చిన జానపద కళా సంప్రదాయం. దీనిని పటువా లేదా చిత్రకార్ సమాజం (హిందూ, ముస్లిం ఇద్దరూ)ఆచరిస్తారు. పటువా కళాకారుల సమూహాలు మన దేశంలోని బిహార్, జార్ఖండ్, ఒడిశాతోపాటు బంగ్లాదేశ్‌లోని కొన్ని ప్రాంతాలలో కూడా కనిపిస్తాయి. పాత చీర బట్టతో వెనుకకు, వెదురుమేక వెంట్రుకలతో కూడిన బ్రష్‌లతో బొమ్మలు వేస్తారు. కూరగాయల రంగులను ఉపయోగించి, పాటి లేదా పట్టా అని పిలువబడే వస్త్ర స్క్రోల్‌లపై పెయింట్ చేస్తారు. ముఖ్యంగా కాళీఘాట్, కుమార్తులిలలో హిందూ పటువాలు మంగళ్ కథను వివరించడానికి దీనిని ఉపయోగిస్తారు. పర్యావరణానికి ఏమాత్రం హాని కలిగించని, సహజసిద్ధమైన రంగులను వినియోగించడం నేటి ప్రపంచానికి గొప్ప సందేశాన్నిస్తున్నది.



## గెరిల్లా థియేటర్ నిర్వాణ

బహిరంగ ప్రదేశాలలో ఆకస్మిక నాటక (ఫ్లాష్ ప్లేస్) ప్రదర్శనల ద్వారా సామాజిక, రాజకీయ సందేశాలను అందించడాన్ని గెరిల్లా థియేటర్‌గా పేర్కొంటున్నారు.ఉదాహరణకు 1960లలో యుఎస్‌లో వియత్నాం యుద్ధ వ్యతిరేక నాటకాలు, భారతదేశంలో 'నుక్కడ్ నాటక్' (స్ట్రీట్ ప్లే). గెరిల్లా థియేటర్ సామాన్య ప్రజలను నేరుగా ఆకర్షించి, అవగాహన కల్పిస్తుంది. అదే సమయంలో, పోస్టర్ ఆర్ట్, ప్రాపగండా ఆర్ట్స్ ద్వారా కూడా సామాజిక చైతన్యాన్ని కలిగిస్తున్నారు. పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాల ద్వారా సామాజిక సందేశాలను వ్యాప్తి చేయడం ఈ కళా విధానాల లక్ష్యం. ఇవి తరచూ ప్రభుత్వాలు, సంస్థలపై విమర్శలను వ్యక్తం చేస్తాయి.

## సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

### సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్



ప్రజాపక్షం/తాండూర్: ఈ ప్రాంత ప్రజాసమస్యల పరిష్కారానికి రాజీలేని ఉద్యమాలు చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ తెలిపారు. సిపిఐ తాండూర్ పట్టణ, మండల మహాసభ చాకలి యాదప్ప అధ్యక్షతన బుధవారం జరిగింది. సభకు ముఖ్యఅతిధిగా విజయలక్ష్మి పండిత్ హాజరై మాట్లాడారు. తాండూర్ ప్రాంతంలో మొదటి నుండి సిపిఐ, ప్రజాసంఘాలకు ఈప్రాంత ప్రజలు అండగా నిలిచారన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఆలోచన చేస్తూ వారికి అండగా నిలబడేది కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. తాండూర్ ప్రాంతంలో సిపిఐ నాయకత్వం నిజాయితీతో ఉన్నందువల్లే ఈ రోజుకి అన్ని వర్గాల ప్రజల్లో పార్టీకి ఆదరణ ఉందన్నారు. దాన్ని అదే విధంగా కొనసాగించాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఈ ప్రాంత సమస్యల విషయమై నిర్మాణాత్మక పోరాటాలను రూపొందించాన్నారు. నేటి రాజకీయ వాతావరణంలో మనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. మతతత్వ రాజకీయాలపై ప్రజలను చైతన్య పరుస్తూ, సమస్యలను తీరుస్తూ ప్రజల పక్షాన నిలబడే బాధ్యత మనపై ఉందన్నారు. పార్టీ ప్రజా సంఘాల నిర్మాణం సరిగ్గా ఉంటే పార్టీ బలంగా ఉంటుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సభలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రవీందర్, సిపిఐ మండల కార్యదర్శి దస్తప్ప, పట్టణ కార్యదర్శి మునీర్, జగదాంబ, లక్ష్మణ్, దశరథ్ గౌడ్, దస్తప్ప, చంద్రమ్మ, విజయ్, రాజేందర్, మీనాజుద్దీన్, అశోక్, విజలక్ష్మి, దేవి పాల్గొన్నారు.

## 'పవర్‌లూమ్'ను వదలని విద్యుత్‌గండం

### చేనేత పవర్‌లూమ్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రవి



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : పవర్‌లూమ్ పరిశ్రమకు విద్యుత్ గండం వదులుతలేదని చేనేత పవర్‌లూమ్‌కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పంతం రవి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సుభాష్ నగర్ పవర్ లూమ్ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంతం రవి మాట్లాడారు. విద్యుత్ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే కెటిఆర్ స్పందించకపోవడం బాధాకరమన్నారు. పవర్లూమ్ పరిశ్రమకు గత బిఆర్ఎస్ ప్రభుత్వ చెల్లించాల్సిన బ్యాక్ బిల్లింగ్ డబ్బులు చెల్లించాలన్నారు. సిరిసిల్లలోని పవర్లూమ్ వస్త్ర పరిశ్రమకు బ్యాక్ బిల్లింగ్ పేరుతో అధికారుల వేధింపులు తప్పడం లేదని మండిపడ్డారు. సుమారు 50 వరకు పవర్లూమ్ పరిశ్రమల విద్యుత్ కనెక్షన్లు తొలగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. స్థానిక నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి ఈ విషయంపై ప్రత్యేకమైన దృష్టి పెట్టి సెస్ కు చెల్లించాల్సిన బ్యాక్ బిల్లింగ్ డబ్బులు చెల్లించి సెస్ పాలకవర్గం మరియు అధికారుల నుండి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను కాపాడాలని కోరారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, పవర్లూమ్ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'మధ్యాహ్న' కార్మికుల బిల్లులు ఇవ్వండి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య డిమాండ్

### కార్మికుల రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ : మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని ఎఐటియుసి నిజామాబాద్ జిల్లా ప్రదాన కార్యదర్శి వై.ఓమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ధర్నా చౌక్‌లో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల రిలేనిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య, ఎండిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి దీక్షలో కూర్చున్న వారికి పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ దీక్షలు ఆగస్టు 1 వరకు నాలుగురోజుల పాటు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ ప్రభు త్వ పాఠశాలల్లో చదువుకోవడానికి వస్తున్న పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు మధ్యాహ్నం ఆహారాన్ని అందించే కార్మికులు సైతం అదే వర్గానికి చెందిన వారై ఉన్నారన్నారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా చదువుకునే బడుగు బలహీన వర్గాల పిల్లలు ఆకలి చదువులు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం తలపెట్టిన పథకం ప్రభుత్వ అధికారుల నిర్వాకంతో విద్యార్థులకు అందని ద్రాక్షలా అవుతుందని ఆరోపించారు. పేద విద్యార్థులకు మధ్యాహ్న బోజనాన్ని వండిపెట్టే కార్మికులు కూడా అదే సామాజిక వర్గానికి చెందిన పేదవారేనని ప్రభుత్వం ఈ విషయాన్ని గ్రహించాలన్నారు. ఆరునెలల నుండి కార్మికులు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెట్టినా బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోతే ఏరకంగా భోజనాన్ని వండి పెడతారని ప్రశ్నించారు.



ప్రభుత్వం పెట్టిన మెనుప్రకారం ఒక విద్యార్థికి నాణ్యమైన భోజనం అందించాలంటే 25 రూపాయలు ఖర్చవుతుందని, ప్రభుత్వం మాత్రం 11 రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకుంటుందని, ఆ డబ్బులు కూడాసరైన సమయంలో ఇవ్వడం లేదన్నారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే రూ.ఆరుకోట్లు బకాయి ఉందంటే ప్రభుత్వ పనితీరును అర్థం చేసుకోవచ్చన్నారు. జిల్లాకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని, గుడ్లు, వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ ఇన్సురెన్సు సౌకర్యాలు కల్పించాలని, యూనిఫారం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా పదివేల రూపాయల వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షలో యూనియన్ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు సాయమ్మ, లతా, నాగలక్ష్మి, సాయిలత, సాయమ్మ, గంగామణి, నరేష్ కూర్చున్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం : ఎఐఎస్‌ఎఫ్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని ఎఐఎస్ఎఫ్ స్టేట్ వైస్‌ప్రెసిడెంట్ గ్యార క్రాంతికుమార్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని లక్ష్మణాచారి భవనంలో ఎఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వద్దనే విద్యాశాఖ ఉన్నా నేటికి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి శూన్యమన్నారు. గురుకులాల్లో నాణ్యతలేని బియ్యం, శుభ్రతలేని వంటకాలతో రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గోరటి నరేష్, ప్రేమ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



## 'ధర్మస్థల' నిందితులకు కఠిన శిక్షలు

### జాతీయ మహిళా సమాఖ్య డిమాండ్

### జిల్లాకేంద్రంలో ఎన్ఎఫ్‌డబ్ల్యు నిరసన

ప్రజాపక్షం/నల్లగొండ : కర్ణాటక రాష్ట్రంలోనీ మంజునాథ దేవాలయం ధర్మస్థలం నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్‌డబ్ల్యు) జిల్లా కన్వీనర్ గిరి రమ డిమాండ్ చేశారు. ధర్మస్థలం హత్యోదంత ఘటనలపై వేగవంతంగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తూ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిరి రమ మాట్లాడుతూ మంజునాథ దేవాలయం ధర్మస్థలంలో గత వారం రోజులుగా వెలుగులోకి వస్తున్న ఘటనలు భయానకంతో పాటు తీవ్రమైన ఆవేదనను, ఆందోళనను కల్గిస్తున్నాయన్నారు. ఈ హత్యోదంత పరంపర మనసును కలిచి వేస్తుందని, ఆశ్రమాల పేరుతో, ఆలయాల పేరుతో, ఆధ్యాత్మిక చింతన పేరుతో, భక్తి పేరుతో మహిళలను వంచిస్తూ సమాజంలో పెద్ద మనుషులుగా మతగురువులుగా, చెలామణి అవుతూ మహిళల మాన ప్రాణాలను హరించివేస్తున్నారన్నారు. తమకున్న అధికార బలం అండబలం, డబ్బు పలుకుబడితో చేసిన నేరాలు బయట పడకుండా నిర్దోషులుగా చెలామణి అవుతున్నారనడానికి ప్రత్యక్ష సాక్ష్యం ధర్మస్థల ఉదంతాలు అన్నారు. 1998 నుండి 2014 వరకు దాదాపు 500 పైగా అమ్మాయిలు శవాలు పూడ్చిపెట్టారంటే ఆ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు అధికారులు చూపిన నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. ధర్మస్థల యాజమాన్యం నేరాల సాక్ష్యాధారాలను కూడా లేకుండా చేశారని, ప్రభుత్వం కూడ తమ కనుసన్నలలో ఉండేలా చేసుకున్నారనే అభిప్రాయం కలుగుతోందన్నారు. ఈ కేసు మొదట జూన్ 22న, దాదాపు ఒక నెల క్రితం వెలుగులోకి వచ్చిందనీ, ప్రభుత్వం ఆలస్యంగా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. జూలై 14న మాత్రమే అని, అదికూడా ఓ మాజీ పారిశుద్ధ్య కార్మికుడు బయటకు వచ్చి తను చేసిన పాపాలను చెప్పుకోవాలి అనే భావంతో తనతో బలవంతంగా ఖననం చేయించిన మృతదేహాలను బయటకు తీయమని కోరగా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు పారిశుద్ధ్య కార్మికుడి ఒప్పుకోలు స్టేట్మెంట్‌లో లైంగిక దాడులు, హత్యలు, ఖననాలు దహన సంస్కారాల లాటి భయంకరమైన నిజాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఈ సంఘటనలపై సమగ్ర విచారణ జరిపి నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు దాసర్ల దుర్గమ్మ, షేక్ సెమిమ్, ఎర్రబోతు పద్మ, డి శాంత, లింగంపల్లి అనిత,కౌంసల్య, విజయ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.





## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులైన డ్వాక్రా మహిళలకు రుణం ఇవ్వాలి



### ఎన్ఎఫ్ఐడబ్ల్యు వినతి

ప్రజాపక్షం/మహబూబాబాద్ : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులైన డ్వాక్రా మహిళలకు రూ.2 లక్షల రుణం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ , భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు)ల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి , సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరై డ్వాక్రా గ్రూపులలో ఉన్న మహిళలందరికీ ప్రభుత్వం ఇస్తామన్న రెండు లక్షల రూపాయల డబ్బులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన కొంతమంది నిరుపేదలు పెట్టుబడి పెట్టలేక ఇల్లు నిర్మించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం గమనించి ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి డ్వాక్రా గ్రూపులలో ఉన్న మహిళలు ఎవరికైతే ఇందిరమ్మ ఇల్లు వచ్చాయో వారికి ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తుందని తెలిపారన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇల్లు మంజూరై నిర్మించుకోలేని స్థితిలో ఉన్న డ్వాక్రా మహిళలందరికీ రెండు లక్షల రూపాయలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని సాంబలక్ష్మి డిమాండ్ చేశారు. లబ్ధిదారులు ఎవరైతే డ్వాక్రా గ్రూపులలో ఉన్నారో వారికి ఎటువంటి కొర్రీలు పెట్టకుండా బ్యాంకు వారు స్త్రీ నిధి మరియు ఇతర పద్ధతిలో రెండు లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని ఆమె కోరారు. స్పందించిన మెప్మా అధికారి విజయ అర్హులై ఇల్లు నిర్మించుకోలేని స్థితిలో ఉన్న డ్వాక్రా గ్రూప్ సభ్యులకు రెండు లక్షల రూపాయలు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి నవీన్, చింతకుంట్ల వెంకన్న, సిపిఐ పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు వెలుగు శ్రవణ్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, రాంప్రసాద్, డి రమేష్, జలగం ప్రవీణ్, చిలువేరు వికాస్, బొల్ల భద్రయ్య, జూలకంటి వేణు, నవీన్, శ్రీధర్ మహిళా సమాఖ్య నాయకులు ఎర్రోజు పద్మ, కవిత, శారద, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## నేడు సిపిఐ మండల సమితి సమావేశం

**ప్రజాపక్షం/ బోనకల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మండల సమితి సమావేశం గురువారం రాపల్లి గ్రామంలో జరుగుతుందని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు తెలిపారు. ఈ సమావేశానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణపై చర్చించి భవిష్యత్ నిర్ణయాలు తీసుకోవటం జరుగుతుందని, అదేవిధంగా పార్టీ కార్యాలయ ప్రారంభోత్సం, ప్రజా సంఘాల మహాసభలు తదితర కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఉదయం 10గంటలకు జరిగే సమావేశానికి సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.



## ఎరువుల దుకాణాల తనిఖీ

**ప్రజాపక్షం/బోనకల్ :** బోనకల్ మండల పరిధిలోని ఎరువుల దుకాణాలను బుధవారం సహకార సంఘాల జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య, మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు విజయచంద్ర తనిఖీ చేశారు. మండల పరిధిలో ఎరువుల దుకాణాల్లో, సహకార సంఘాల్లో సరిపడ యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులెవరూ యూరియా కోసం ఆందోళన పడవద్దని తెలిపారు. ఎరువుల డీలర్ల స్టాక్ రిజిస్టర్, ఫార్మర్ సేల్ రిజిస్టర్, బిల్ బుక్, ఇన్వాయిస్‌లను పరిశీలించారు. స్టాక్ బోర్డు తప్పనిసరిగా ప్రతిరోజు అప్‌డేట్ చేయాలని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని డీలర్లకు సూచించారు. డీలర్లు ఎరువుల కృత్రిమ కొరత సృష్టించవద్దని, అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని, అధిక ధరలకు అమ్మితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని పత్తి పంటలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పసునూరి వినయ్ కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి షేక్ హుస్సేన్‌సాహెబ్, సహకార సంఘం సెక్రటరీలు, రైతులు పాల్గొన్నారు.

## బాలికల హాస్టల్‌ను పరిశీలించిన తహసీల్దార్



**ప్రజాపక్షం/పెనుబల్లి :** పెనుబల్లి మండల కేంద్రంలోని బాలికల హాస్టల్‌ను బుధవారం తహసీల్దార్ ఎస్‌వి.నారాయణ మూర్తి పరిశీలించారు. హాస్టల్‌లో ఎంతమంది బాలికలు ఉన్నారు. సమస్యలు ఉన్నాయా అని వార్డెన్ తిరుపతమ్మను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో మొత్తం 115 మంది ఉన్నట్లు వార్డెన్ తెలిపారు. విద్యార్థినిలకు వసతి, భోజనం, బాత్రుమ్‌లు పరిశీంచారు. వర్షాకాలం కావటంతో సీజనల్ వ్యాధులు శోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా అనునిత్యం భద్రత కల్పించాలని అన్నారు. కష్ట పడి చదువుకుని ఉన్నత చదువులు చదివి మంచి పేరు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సక్కు, సిబ్బంది నాగమణి, రాధ, మౌలాలి ఉన్నారు.

# ప్రజల దీవెనలతో ఇందిరమ్మ ప్రభుత్వ పాలన

కొత్తగా 16 లక్షల మందిని రేషన్ కార్డులో చేర్చాం

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఇందిరమ్మ ప్రభుత్వంలో కొత్తగా 16 లక్షల మందిని పాత కార్డులలో చేర్పించినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమంను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదల ముఖంలో సంతోషం కనిపిస్తుందని అన్నారు. ప్రజల దీవెనలతో ఇందిరమ్మ ప్రభుత్వం పాలన కొనసాగుతుందని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని అన్నారు. ఆ ప్రభుత్వం తప్పిదాల వలన కోట్లాదిమంది పేదలు ఇబ్బందిపడ్డారని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చాక లక్షల మందికి అవకాశం కల్పించిందని అన్నారు. ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించి.. మూడు నెలలకొకసారే ఇచ్చామని అన్నారు. గతంలో రైతులకు వరి వేస్తే ఉరి అనిపించగా ఇప్పటి ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుందని అన్నారు. పది నెలలో రూ.21వేల కోట్ల రుణమాఫీ జరిపినట్లు పేర్కొన్నారు. మహిళల సంక్షేమంపై దృష్టి సారించామని, ఉచిత బస్సు ప్రయాణానికి రూ.5 వేల కోట్లు అదనంగా ఖర్చు చేస్తూ భారంగా భావించటంలేదని స్పష్టం చేశారు. కోటి మంది మహిళలను కోటేశ్వర్లును చేయాలనే సంకల్పంతో ఇందిరమ్మ ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ప్రతీ సోమవారం లబ్ధిదారుల ఖాతాలలో నిధులు జమ అవుతున్నట్లు తెలిపారు. మూడు విడతలలో పేద కుటుంబాలకు ఇళ్లు అందజేయనున్నట్లు హామీ ఇచ్చారు. ప్రతీ అర్హుడికి ఇళ్లు ఇచ్చే బాధ్యత నాది. పేదల ఇంటి పెద్ద కొడుకులా నేను మీతో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, భద్రయ్య, రావెళ్ల కృష్ణారావు, కొర్లకుంట్ల నాగేశ్వరరావు, పగిళ్ల పృథ్వీ, కడియాల నరేష్, కొమ్మినేని విజయాబాబు, గుండా బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వన మహోత్సవంలో పాల్గొని మొక్క ను నాటారు. మంద్రాజుపల్లిలో పిఆర్ రహదారి, బోదులబండ, చెరువుమాధారంలో అంతర్గత సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు.

# బిఆర్‌ఎస్‌ది దొరలపాలన... కాంగ్రెస్‌ది ప్రజాపాలన

మల్లు నందిని



**ప్రజాపాలన/మధిర :** తెలంగాణలో గత పదేళ్ల బిఆర్‌ఎస్ దొరలపాలనతో ప్రజలు విసిగి వేసారారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాటూరుపేటలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాక సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. టిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల్లో 7లక్షల కోట్లు అప్పు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలనలో భట్టివిక్రమార్క అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఆర్థిక మంత్రిగా విజయం సాధిస్తున్నారన్నారు. ఆర్థిక మంత్రిగా భట్టివిక్రమార్క అప్పులను తీర్చుకుంటూ ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నారన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంగా మహిళల కలలను సాకారం చేస్తూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మధిర నియోజకవర్గ అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయటం జరిగిందని, నియోజకవర్గంలోని మధిర పట్టణాభివృద్ధితో పాటు అనేక గ్రామాలకు సిసి రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయించారని తెలిపారు. వంగవీడు గ్రామంలో రూ.600కోట్లతో లిఫ్ట్ ప్రాజెక్టును నిర్మిస్తున్నారని, ఈ లిఫ్ట్ ఇరిగేషన్‌తో ఎర్రుపాలెం మండలం వరకు పంటలకు సాగునీరు అందుతుందన్నారు. 18 నెలలుగా ఎన్నో నిధులు నియోజకవర్గానికి తీసుకువచ్చారని, ఈ అభివృద్ధి అంతా ప్రజల్లోకి తీసుకెళ్లి నూటికి నూరుశాతం నియోజకవర్గంలో సర్పంచ్‌లను గెలిపించుకునే బాధ్యత, మండల కమిటీ సహకారంతో అన్ని గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేసే బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మధిర మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మధిర ఎఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు, జిల్లా నాయకులు, మండల, గ్రామశాఖ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోడు రైతుల పట్ల వివక్ష వీడండి

తక్షణమే పోడు పట్టాలు అందించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** పోడు రైతుల పట్ల వివక్ష విడనాడి తక్షణమే పట్టాలు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రఘునాథపాలెం మండల పరిధిలోని పంగిడి గ్రామంలో పోడు రైతుల సమావేశంలో సిద్దినేని కర్ణ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడ్డ పోడు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో పట్టాలు అందుతాయన్న ఆశతో ఓట్లు వేసి గెలిపించారని ఆయన తెలిపారు. గెలిచిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పోడు రైతుల పట్ల వివక్షను ప్రదర్శిస్తుందన్నారు. 20 సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాలు, ఎంఎల్‌ఎలు, మంత్రుల చుట్టూ పోడు రైతులు చెప్పులు అరిగేలా తిరుగుతున్నారన్నారు. అక్రమంగా కేసులు పెట్టి కోర్టుల చుట్టూ పోడు రైతులను తిప్పుతున్నారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించి పోడు రైతుల సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో బికెఎంయు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, బాగం ప్రసాద్, సహాయ కార్యదర్శి కంపసాటి వెంకన్న, బత్తిని సీతారాములు, బానోత్ చీనా, బానోత్ రవి, బానోత్ లచ్చిరాం, కృష్ణ, పోడు రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఫెమా' చట్టానికి తూట్లు

ఇష్టానుసారంగా రిజిస్ట్రేషన్లు, జిపిఎలు

దృష్టిసారించని ఉన్నతాధికారులు






**ప్రజాపక్షం/ఖమ్మం :** భూమి వ్యాపార వస్తువుగా మారింది. ఒకప్పుడు సాగు చేసుకోవడానికి మాత్రమే భూ క్రయ, విక్రయాలు జరిపేవారు. కానీ ఇప్పుడు లాభాల కోసం కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతున్నాయి. ఒకప్పుడు సంపన్నులు పట్టణాలలో ఆస్తులు కొనుగోలు చేయడం, బంగారం లాంటి విలువైన పదార్థాలను కొని దాచుకోవడం, ఖరీదైన భవనాలను నిర్మించడం చేసేవారు. కానీ ఇప్పుడు భూమి స్టేటస్ సింబల్‌గా మారడంతో భూముల కొనుగోళ్లపై దృష్టిసారించారు. ఇదే సమయంలో ఇతర దేశాలలో నివసిస్తున్న వారు సైతం తెలంగాణలో భూములు కొనుగోలు చేస్తున్నారు. భూములు కొనుగోలు చేయడం పట్ల అభ్యంతరం లేదు కానీ, ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఇతర దేశాల్లో నివసిస్తున్న వారు భూములు కొనుగోలు చేసేటప్పుడు విదేశీ మారక నిర్వహణ చట్టం (ఫెమా)ను ఖచ్చితంగా అనుసరించాల్సి ఉంది. ఫెమా నిబంధనల మేరకే భూములు కొనుగోలు చేయాలి. ఇతర దేశాల్లో నివసిస్తున్న వారు మన రాష్ట్రంలో భూములు కొని రిజిస్ట్రేషన్ చేయించుకునేటప్పుడు అధికారులు ఖచ్చితంగా ఫెమా యాక్ట్‌ను పరిశీలనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఫెమాను పక్కన పెట్టి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖాధికారులు ఇష్టానుసారంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. విదేశాల్లో ఉంటూ ఇక్కడ భూములు కొని రిజిస్ట్రేషన్ చేయించుకుని, ఆ తర్వాత కుటుంబ సభ్యులు, సమీప బంధువులకు జిపిఎ చేస్తున్నారు. జిపిఎ పొందిన వారు డిటిసిపి లే అవుట్ అనుమతులకు దరఖాస్తు చేస్తున్నారు. దీనితో ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టడమే కాకుండా ఫెమా చట్టానికి తూట్లు పడుతున్నాయి. ఖమ్మం జిల్లాలో కొణిజర్ల మండలంలో ఫెమాను పక్కన పెట్టి కొణిజర్ల, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో పెద్ద సంఖ్యలో ఫెమాను పక్కన పెట్టి రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇటువంటి వాటిపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులకు ఫెమా చట్టం ఉన్నదన్న విషయమే గుర్తుకు రాకపోవడం శోచనీయం తక్షణం ఉన్నతాధికారులు స్పందించి ఫెమా చట్టాన్ని అనుసరించేవిధంగా ఆదేశాలు జారీ చేయడంతో పాటు గతంలో ఫెమా చట్టాన్ని పక్కన పెట్టి రిజిస్ట్రేషన్లు చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# భూ సేకరణ వేగవంతం చేయాలి

లే అవుట్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

రోప్‌వే స్థలాన్ని పర్యాటక శాఖకు బదిలీ చేయాలి

అభివృద్ధి పనుల భూ సేకరణ అంశాలపై సమీక్షించిన కలెక్టర్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, జాతీయ రహదారులు, ఖమ్మం ఖిల్లా రోప్ వంటి అభివృద్ధి పనుల భూ సేకరణ అంశాలపై బుధవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు, అవసరమైన భూ సేకరణ తదితర అంశాలను అధికారులు వివరించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ వర్కింగ్ మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఖమ్మం రూరల్, అర్బన్ మండలాల్లో రైతులు అంగీకరించిన స్థలం, ప్రభుత్వ పట్టా భూముల్లో పనులు వేగవంతం చేయాలన్నారు. రైతుల పొలాలకు ప్రత్యామ్నాయంగా ప్లాట్లను కేటాయిస్తున్నామన్నారు. రైతులకు అందించే లే అవుట్ ప్లాట్లలో అంతర్గత రోడ్లు, స్ట్రీట్ లైట్, విద్యుత్ సరఫరా పనులు వేగవంతం చేయాలన్నారు. రైతులకు లే అవుట్‌లో జరిగే అభివృద్ధి పనులు చూపించి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి భూములు స్వచ్ఛందంగా అప్పగించేలా కృషి చేయాలన్నారు. లే అవుట్‌లో 10 మీటర్ల బ్రిడ్జి నిర్మాణ పనులకు డిజైన్ ఫైనల్ చేయాలన్నారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ లే అవుట్ తరహాలో ఇక్కడ లే అవుట్ అభివృద్ధి చేయాలన్నారు. ఖమ్మం రోప్‌వే నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారులకు ప్రత్యామ్నాయంగా వైద్య కళాశాల సమీపంలో ప్లాట్లు కూడా ఇస్తున్నామని, అక్కడే హైవే కూడా వస్తుందని మంత్రి చేతుల మీదుగా పట్టాల పంపిణీ ఏర్పాటు చేయాలన్నారు. రోప్‌వే స్థలాన్ని పర్యాటక శాఖకు బదలాయించాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం కోసం అవసరమైన భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జాతీయ రహదారుల ఎంట్రీ, ఎగ్జిట్, సర్వీస్ రోడ్ల నిర్మాణం జరగాలని తెలిపారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ఎస్‌ఇ ఎం. వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డిఒ జి.నర్సింహారావు, నేషనల్ హైవే మేనేజర్ దివ్య, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బకాయిలను తక్షణం చెల్లించండి

తాత్సారం చేస్తే ప్రత్యక్ష ఆందోళన తప్పదు

ఖమ్మంలో పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన, అంబేద్కర్ విగ్రహానికి వినతి




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఏడాదిన్నర కాలంగా పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల బకాయిలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇదే రీతి తాత్సారం చేస్తే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి బకాయిల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఎటి) ఆధ్వర్యంలో స్థానిక కృషి భవన్ నుంచి జెడ్పి సమీపంలోని అంబేద్కర్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పరిశ పుల్లయ్య మాట్లాడుతూ 2024 ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చేసిన వారికి సైతం బకాయిలు చెల్లించ లేదని వేలాది మంది ఇబ్బందులు పడుతున్నారని ఒక ఖమ్మం జిల్లాలోనే రెండు వేల మంది పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. గతంలో ఉద్యోగ విరమణ పొందిన వెంటనే ఉద్యోగికి రావాల్సిన బకాయిలను చెల్లించారని ఆయన గుర్తు చేశారు. పెన్షనర్లకు ఈహెచ్‌ఎస్ ద్వారా నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని, గ్రంథాలయ, మార్కెటింగ్ శాఖలోని ఉద్యోగులకు కూడా ట్రెజరీ ద్వారా పెన్షన్లు చెల్లింపు పద్ధతిని ప్రవేశ పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. 20 సంవత్సరాల ఉద్యోగ జీవితం పూర్తి చేసిన వారికి పూర్తి పెన్షన్ చెల్లింపు విధానాన్ని అమలు చేయాలని ఖమ్మం ఎస్‌టివోను పెన్షనర్ల ఇబ్బందుల దృష్ట్యా జెడ్పి కార్యాలయంకు మార్చాలని పుల్లయ్య డిమాండ్ చేశారు. డిఆర్ బకాయిలు ఏక మొత్తంగా చెల్లించాలని పిఆర్‌సిపై సత్వరం ప్రకటన చేయాలని నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పెన్షనర్లకు ఆర్టిసిలో 50 శాతం రాయితీపై ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, కోశాధికారి కనపర్తి వెంకటేశ్వర్లు, సంఘు బాధ్యులు ఐవి భాస్కరాచారి, వి. మనోహర్‌రాజు, మేరీ ఏసుపాదం, శరత్‌బాబు, తాడి అంజలి, జి. లక్ష్మి సుజాత, అన్నమ్మ, ప్రసాద్‌రావు, రాంకోటారెడ్డి, నాగప్రసాద్, కిషన్‌రావు, జల్లా వెంకటేశ్వర్లు, కంచుమర్తి పుల్లయ్య, రవీంధర్, కృష్ణయ్య, గుగ్రాల శ్రీనివాసరావు, రామనాథం, నర్సయ్య, కోట్యా తదితరులు పాల్గొన్నారు.

# మారాల్సింది మతోన్మాదులే

బిజెపి కలలు కంటున్నది

రాంచందర్‌రావువి అవగాహన లేని మాటలు

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/ఖమ్మం :** మారాల్సింది కమ్యూనిస్టులు కాదని, మతోన్మాదులేనని మతం పేరుతో దేశాన్ని అధోగతిపాలు చేస్తున్న బిజెపి వైఖరిలో మార్పు రావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. బిజెపి అధ్యక్షుడు రాంచందర్‌రావు అవగాహన లేకుండా మాట్లాడుతూ కలల ప్రపంచంలో ఊగుతున్నారని, తెలంగాణలో బిజెపికి అధికారం రావడం కల్ల అని ఆయన స్పష్టం చేశారు. బుధవారం సిపిఐ జిల్లా సమితి పేరుతో ఒక ప్రకటన విడుదల చేశారు. కమ్యూనిస్టులు మారాలని రాంచందర్‌రావు కోరుతున్నారని ఎందుకు మారాలని సురేష్ ప్రశ్నించారు. పేదలపక్షాన సంక్షేమం, హక్కుల కోసం ప్రజా ఉద్యమాలు నిర్మిస్తున్నామని, దేశ పరిరక్షణ కోసం కమ్యూనిస్టులుగా పోరాడుతున్నామని ఆయన తెలిపారు. పేదల పక్షాన ఉన్న కమ్యూనిస్టులు మారాలా.. లేక ఈ దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్న బిజెపి మారాలో తేల్చుకోవాలని ఆయన సూచించారు. ఆర్థిక అంతరాలు పెంచి ఈ దేశాన్ని బిజెపి అస్థిరత వైపు తీసుకుపోతుందని, మతం సాకుగా చూపి దేశ ప్రజలను విడదీస్తుందని ఆయన ఆరోపించారు. బిజెపి మారకపోతే ప్రజలే మారుస్తారని దేశ రాజకీయాలు ఎల్లకాలం ఒక రీతిగా ఉండవని దశాబ్దాలు ఏలిన వారు సైతం ప్రజా తీర్పుకు తలవంచక తప్పలేదన్నారు. కమ్యూనిస్టుల పట్ల కనీస అవగాహన లేని రాంచందర్‌రావు ఏదేదో మాట్లాడుతున్నారని అది పోరాటాల పురిటి గడ్డ ఖమ్మం జిల్లా మాట్లాడే ముందు ఓసారి కమ్యూనిస్టుల పోరాటాలను, త్యాగాలను గుర్తు తెచ్చుకుంటే బాగుండేదని సురేష్ తెలిపారు. భారతదేశ సమాజంలోనే అత్యంత చైతన్యవంతమైన ప్రజలు తెలంగాణ ప్రజలని, ఈ రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టాలని బిజెపి కలలు కంటుందని అవి నెరవేరబోవని సురేష్ స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో వర్గాలుగా ఏర్పడి కొట్టుకుంటున్నారని అంతర్గత విబేధాలను బిజెపి రాంచందర్‌రావు సరిచూసుకుంటే మంచిదని ఆయన హితవు పలికారు. దేశంలో మతం పేరుతో తెలంగాణలో ఆ పార్టీలోనే అంతర్గత కుల కోట్లాటలతో సతమతమవుతున్నారని ఇక తిరోగమనమే కానీ బిజెపికి పురోగమనం లేదని స్పష్టం చేశారు.

# సెప్టెంబర్ తొమ్మిదిన ప్రత్యేక యాత్ర రైల్ ప్రారంభం




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మహాలయ పక్ష ప్రత్యేక సప్త మోక్ష క్షేత్ర యాత్ర ప్రత్యేక రైల్ సెప్టెంబర్ తొమ్మిదిన ప్రారంభమవుతుందని ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్, టూర్ టైమ్స్ డైరెక్టర్ జి. విఘ్నేష్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జి.విఘ్నేష్ మాట్లాడుతూ పవిత్ర క్షేత్ర దర్శనాలే లక్ష్యంగా ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టామన్నారు. ఇండియన్ రైల్వేస్ భారత్ గౌరవ్ టూరిస్ట్ రైల్, సౌత్ స్టార్ రైల్, భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన అగ్రశ్రేణి టూరిస్టు రైల్ ఆపరేటర్ టూర్ టైమ్ ఆధ్వర్యంలో ఈ యాత్ర జరుగుతుందన్నారు. ఈ యాత్రలో భాగంగా ఉజ్జాయిని, ఓంకారేశ్వర్, ద్వారకా, సిద్ధపూర్, మధుర, అయోధ్య, ప్రయాగరాజ్, వారణాసి, గయా వంటి పుణ్యక్షేత్రాలను కవర్ చేయడం జరుగుతుందన్నారు. గతంలో ఇండియన్ రైల్వేస్ టూర్ టైమ్స్ ప్యాకేజీకి విశేష స్పందన లభించిందన్నారు. సెప్టెంబర్ తొమ్మిది నుండి ఈ యాత్ర రైల్ ప్రారంభమవుతుందని ఈ యాత్ర 15 రోజులు ఉంటుందన్నారు. గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, హైదరాబాద్, కాజీపేట స్టేషన్లలో యాత్రీకులు రైలు ఎక్కే వీలుందన్నారు. టూర్ టైమ్స్ జనరల్ మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ ప్రాచీన గ్రంథాలు, పురాణాల ప్రకారం ఈ యాత్రలో ఉన్న క్షేత్రాలు ఎంతో పేరుగాంచాయన్నారు. ఇవి మానవ శరీరంలోని వివిధ శక్తి కేంద్రాలను సూచిస్తాయన్నారు. ఈ రైలులో లోపల, బయట దక్షిణ భారత భోజనం అందుబాటులో ఉందన్నారు. ఈ ప్యాకేజీపై ఇండియన్ రైల్వే 33 శాతం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. థర్డ్ ఏసి (కంపర్ట్) రూ.45750, సెకండ్ ఎసి (డీలక్స్) రూ. 54100, ఫస్ట్ ఎసి (లగ్జరీ) రూ.69500 ఛార్జ్ ఉంటుందన్నారు. ఈ యాత్ర టికెట్లను 9355021516 నెంబర్‌కు కాల్ చేసి టికెట్లు బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. ఆన్‌లైన్ బుకింగ్ కోసం www.tourtimes.in సందర్శించవచ్చునన్నారు. మరింత సమాచారం కోసం 9848343882, 6303093338 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో టూర్ టైమ్స్ మేనేజర్ యుకేశ్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు



దర్గా ఉత్సవాలకు రావాలని సిఎంను కోరిన ఎమ్మెల్యేలు

ప్రజాపక్షం/కాజీపేట : హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి నివాసంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు బుధవారం కలిశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కే ఆర్ నాగరాజు, కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషా లు కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కాజీపేట ఉర్సు (సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గా)ఉత్సవాలకు వారు ఆహ్వానించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలి



**ప్రజాపక్షం/ వరంగల్ :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదా అన్నారు. బుధవారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం వంచనగిరి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను కలెక్టర్ పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రావెల్, ఇసుక, సిమెంట్, ఐరన్ ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఇందిరమ్మ లబ్ధిదారుల కొనుగోలు చేయాలని, మేస్త్రీలకు అధిక ధర చెల్లించకూడదని, ప్రభుత్వం నిర్దేశించిన ధరలను మాత్రమే మేస్త్రీలకు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. 500 ఎస్ ఎఫ్ టి వరకే నిర్మించుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం అదే గ్రామంలో గొర్రెలు, మేకలకు పశు సంవర్ధక శాఖ ద్వారా వేస్తున్న బ్లూ టంగ్ (నీలి నాలుక) టీకాలను పరిశీలించారు. జిల్లాలో అన్ని గ్రామాలు, మండలాల వారీగా టీకాలు వేసేందుకు ప్రణాళిక తయారు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఈ నెల 29 నుండి ఆగస్టు 8వ తేదీ వరకు బ్లూ టంగ్ (నీలి నాలుక) టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించి జిల్లావ్యాప్తంగా 1.58 లక్షల గొర్రెలు, మేకలకు టీకాలు వేయడం జరుగుతున్నదన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక అధికారి బాలకృష్ణ, పశు వైద్య అధికారి శ్రీనివాస్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నిజాం చెరువు వద్ద శ్మశాన వాటికను నిర్మించాలి

సిపిఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన



ప్రజాపక్షం/మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో మనిషి చనిపోతే దహనం చేసే స్మశాన వాటికను నేటికీ నిర్మించకుండా కాలయాపన చేయడం తగదని, చనిపోయిన తాలూకు కుటుంబాలు చనిపోయిన వ్యక్తులను దహనం చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని, తక్షణమే మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నిజాం చెరువు వద్ద స్మశాన వాటికను నిర్మించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో మహబూబాబాద్ మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి అనంతరం మున్సిపల్ కమిషనర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ మరియు 27వ వార్డు శాఖ కార్యదర్శి వెలుగు శ్రావణ్ కుమార్ లు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పాత బజార్ బస్టాండు ,హనుమంతునిగడ్డ ,బెస్త బజారు, రజక బజారు ప్రాంత ప్రజలకు అవసరంగా ఉన్నటువంటి నిజాం చెరువు స్మశాన వాటికను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు, దురదృష్టవశాత్తు ఎవరైనా మరణిస్తే దుఃఖ సంద్రంలో కుటుంబం ఉన్న పరిస్థితులలో అంత్యక్రియలు పెద్ద సమస్యగా మారాయని గతంలో స్థానిక ప్రజలు, సిపిఐ పార్టీ డిమాండ్ మేరకు రెవెన్యూ అధికారులు 10 గుంటల భూమిని కేటాయించి మున్సిపల్ అధికారులకు అప్పగించారని, ఆ తరువాత మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ శంకుస్థాపన చేసి శిలాఫలకం వేసి30 లక్షల నిధులు మంజూరు చేశామని ప్రజలను మభ్య పెట్టారని, నేటికీ అది కార్యరూపం దాల్చలేదని క్రమంగా స్మశాన వాటిక స్థలం కబ్జాకు గురవుతోందని దీనిని కాపాడవలసిన బాధ్యత మున్సిపల్ అధికారులకు ఉందని తెలిపారు. వెంటనే దాని పూర్వపరాలు పరిశీలించి స్మశాన వాటిక నిర్మాణం చేపట్టాలని , లేనట్లయితే అన్ని కుల సంఘాలను కలుపుకొని సమస్యను పరిష్కారం దిశగా ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు రేశ పల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, ఆబోతు అశోక్ యాదవ్, జలగం ప్రవీణ్ ,గోపు దుర్గాప్రసాద్, పులిగుజ్జయిలయ్య, పుచ్చ బాలకృష్ణ, జూలకంటి వేణు , కాడ పోయిన రంజిత్ ,మారబోయిన నరసయ్య, అక్కినపల్లి శ్రీధర్, పులిగుజ్జ నవీన్, భాధావత్ రాంప్రసాద్ , వికాస్, డోనికేని రమేష్, శారద, బోళ్ల భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెరువులను పునరుద్ధరించి నీటి నిల్వ సామర్థ్యం పెంచుతాం

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం, తొర్రూరు :** నియోజకవర్గంలోని చెరువులను పునరుద్ధరించి నీటి నిల్వ సామర్థ్యం పెంచుతామని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మండలంలోని మడిపెల్లి గ్రామ ఉప్పరవానికుంట చెరువుకు రెండు చోట్ల గండ్లు పడటంతో చెరువులో నీరు వృథాగా పోయే దుస్థితి ఏర్పడింది. ఈ విషయమై స్థానికులు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో గ్రామ చెరువు గండ్లు పూడ్చుతానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు బుధవారం గ్రామ చెరువును సందర్శించి మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో నీటి వనరుల వృద్ధితో క్రమంగా చెరువులు పూర్వవైభవాన్ని సంతరించుకునేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజలకు జీవనాధారమైన చెరువుల బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తామని తెలిపారు. చెరువుల్లో నీరు నిల్వ ఉంటేనే గ్రామాల్లో భూగర్భ జలాలు పెరగడంతో మత్స్య పరిశ్రమ గణనీయంగా వృద్ధి చెందుతుందన్నారు. జీవాలు, పాడిపశువులకు నీటి కొరత తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యా నాయక్, మండల అధ్యక్షుడు సుంచు సంతోశ్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, నాయకులు బాపురెడ్డి, డాక్టర్ సోమేశ్వర్‌రావు, సోమయ్య, శ్రీనివాస్, రాంచంద్రయ్య, సురేందర్‌రెడ్డి, రాజేశ్‌నాయక్, రాంరెడ్డి, రవినాయక్, శ్రీనివాస్‌రెడ్డి, సోమన్న, విక్రంరెడ్డి, వెంకట్‌రెడ్డి, సోమిరెడ్డి, శ్రావణ్‌కుమార్, శంకర్, ప్రవీణ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ :** విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించే విధంగా బోధన సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం మరియపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పాఠశాల తరగతి గదులు, ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలన్నారు.

**అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్**

ఐనవోలు మండలం సింగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యను చదువుతున్న చిన్నారుల సంఖ్యను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న చిన్నారుల తల్లులు, గర్భిణీలతో కలెక్టర్ మాట్లాడారు. గ్రామానికి చెందిన ఎంతమంది చిన్నారులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారని అంగన్వాడి టీచర్, స్థానికులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ఐనవోలు తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, ఎంఈవో ఆనందం, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డాక్టర్‌పై కేసు నమోదు

**ప్రజాపక్షం – జనగామ :** జనగామ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్‌పై కేసు నమోదైంది. ఆయన తల్లి ఎలిజబెత్ ఫిర్యాదు మేరకు జనగామ పోలీసులు కేసు నమోదు చేశారు. తాను బతికి ఉండగానే చనిపోయినట్లు తప్పుడు ధృవపత్రాలు సృష్టించి తన ఆస్తిని తన పేరున చేసుకోవడంతో పాటు తన బాగోగులు చూసుకోవడం లేదని సోమవారం జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసింది. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ జనగామ డిసిపి రాజమహేంద్రనాయక్‌కు విచారించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎలిజబెత్ ఫిర్యాదు మేరకు బుధవారం ఐపిసి సెక్షన్లు 296బి, 318(4), 355,315(2), ఆర్‌డబ్ల్యూ3(5), బిఎన్‌ఎస్ 24 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సిఐ దామోదర్‌రెడ్డి తెలిపారు. కాగా తన పై కావాలని తన అన్న డాక్టర్ కరుణాకర్‌రాజు కేసు నమోదు చేయించాడని, ఆస్తుల పంపకాలు పెద్దల నిర్ణయం మేరకు జరిగిందని వివరించారు.

## మానవ, బాలల అక్రమ రవాణాను అరికట్టాలి

**ప్రజాపక్షం/ నర్సంపేట :** మానవ, బాలల అక్రమ రవాణా ను అరికట్టడానికి సమాజం లోని ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యత తో కృషి చేయాలని స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్ కోరారు. నర్సంపేట పట్టణం లోని విజ్ డమ్ పాఠశాల లో స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజషన్ ఆధ్వర్యంలో ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ సహకారం తో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినంను పురస్కరించుకోని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అక్రమ రవాణాకు ఎక్కువ గా మహిళలు, ఆడపిల్లలు బలి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అపరిచిత వ్యక్తుల ప్రవర్తన పట్ల నిరంతరం అప్రమత్తం ఉండి, వారి ప్రవర్తన పట్ల ఏ మాత్రం అనుమానం కలిగినా వెంటనే పోలీస్ 100, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 టోల్ ఫ్రీ నెంబర్ లకు సమాచారం అందించి రక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమం లో ప్రతిభ సంస్థ నిర్వాహకులు గిరగాని సుదర్శన్ గౌడ్, పాఠశాల డైరెక్టర్ జావీద్, అకాడమిక్ అడ్వైసర్ నాజీయా, ప్రిన్సిపాల్ ప్రకాష్, ఉపాధ్యాయ సిబ్బంది రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో ఒప్పంద అధ్యాపకులకు అందని వేతనాలు

**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ ఇంటర్ విద్య అధికారుల నిర్లక్ష్యంతో 23 సంవత్సరాలనుండి పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులకు శాంక్షన్ పోస్టులు లేవు అని, రెగ్యులర్ కాకుండా చెయ్యడమే కాక గత నాలుగు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతునామని ఒప్పంద అధ్యాపకులువాపోతున్నారు.ఇంటర్ విద్య అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ వీరి వేతనాల ఫైలును జూన్ 2025లో 10 నెలల జీతం తీసుకుంటున్న గెస్ట్, పార్ట్ టైం ఔట్సోర్సింగ్ ఉద్యోగులతో కలిపి ఒకే ఫైల్ ను ఆర్థిక శాఖకు వేతనాల అనుమతి కోసం ఇంటర్ విద్యాధికారులు పంపారు. వీరి స్థానంలో పనిచేసిన గెస్ట్ అధ్యాపకులందరికీ జూనియర్ కళాశాలలో పనిచేసే అవకాశం ఇవ్వాలని, తమది న్యాయమైన డిమాండ్ అని అతిధి అధ్యాపకులు కోరడంతో రెన్యువల్ ఫైల్ ఆర్థిక శాఖ నుండి ప్రిన్సిపాల్ సెక్రటరీకి, అక్కడి నుండి కమిషనర్ ఆఫీసుకి, అక్కడి నుండి మళ్ళీ ఆర్థిక శాఖకి, ఇలా గత రెండు నెలలుగా ఫైలు అటూ ఇటూ తిరుగుతూ కాలం గడిచిపోయిందని తెలిపారు. ఒకేషనల్ విభాగంలో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకుల ఫైలును గెస్ట్ అధ్యాపకుల ఫైల్ తో ముడిపెట్టి ఉండకపోతే తొందరగ్గా జీతాలు తీసుకునే అవకాశం ఉండేదని ఇంటర్ అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తప్పిదంతో తమ పిల్లల స్కూల్ ఫీజులు కూడా చెల్లించలేక అప్పుల పాలై ఇబ్బందులను ఎదుర్కొంటూనామని తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న యువకుడు అరెస్ట్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి బస్టాండ్ సమీపంలోని కూరగాయల మార్కెట్ వద్ద నిషేధిత గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న ,భూపాలపల్లి మండలం నాగారం గ్రామానికి చెందిన అనపర్తి రాజేష్ ను (20) యువకుడిని పట్టుకున్నట్లు భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్ తెలిపారు. అనంతరం చేసిన తనిఖీలో అతని వద్ద ఒక కిలో 300 గ్రాముల నిషేధిత గంజాయి లభ్యమైందన్నారు. ఇదే నేపథ్యంలో మాదకద్రవ్యాల నియం త్రణ చట్టం (ఎన్డిపిఎస్ ఆక్ట్) ప్రకారం కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లు సాంబమూర్తి,రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## బొగ్గు, విద్యుత్ కేటాయింపుపై తక్షణ చర్యలు తీసుకోవాలి

లోక్‌సభలో వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** తెలంగాణ రాష్ట్రానికి బొగ్గు నిల్వలు, విద్యుత్ అవసరాలపై కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గళమెత్తారు. తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన వనరుల కేటాయింపు విషయంలో అన్యాయం జరగడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి సంస్థలు ఇంధన కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, దీనికి పరిష్కారంగా సింగరేణి సంస్థకు కొత్త బ్లాకులు తక్షణమే కేటాయించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రానికి న్యాయం జరిగేంత వరకు తాము కేంద్రాన్ని ప్రశ్నిస్తామని డాక్టర్ కావ్య అన్నారు. "ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థ అయిన ఎస్ సీసీఎల్ ను బలోపేతం చేయడం ద్వారానే తెలంగాణ ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించగలమని ఆమె స్పష్టంగా చెప్పారు.వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఇతర రాష్ట్రాల మాదిరిగానే, తెలంగాణలోనూ బొగ్గు కేటాయింపుల విధానం పారదర్శకంగా, రూల్‌బేస్‌గా జరుగుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అయినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వాల అభ్యర్థనలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఎస్ సీసీఎల్ వంటి సంస్థలు మరింత సమర్థవంతంగా పనిచేసేలా నిబంధనలు రూపొందించాలన్న డాక్టర్ కావ్య సూచనలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ....ప్రస్తుతం ఖాళీగా ఉన్న, ప్రైవేటు సంస్థలు విఫలమైన బ్లాకులను తిరిగి ప్రభుత్వ యాజమాన్య సంస్థలకు కేటాయించాల్సిన అవసరం ఉందని ఎంపీ స్పష్టం చేశారు.

## జనగామలో యూరియా కొరత లేదు

అకస్మిక తనిఖీల్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం/జనగామ:** జనగామలో యూరియా కొరత లేదు. రైతులు యూరియా కోసం ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లీష్ కోసం స్పెషల్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. బుధవారం జనగామ జనగామ జిల్లా చిల్పూర్ మండలంలో అకస్మిక తనిఖీలు నిర్వయించారు. మండలంలోని చిన్న పెండ్యాల గ్రామంలో గల ఫర్టిలైజర్ షాపు, జడ్పీ హై స్కూల్, మల్కాపూర్ పిహెచ్‌సి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రాజవరం ప్రైమరీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోజువారిగా స్టాక్ వివరాలు భోర్డుపైన ప్రదర్శించాలని, జిల్లాలో ఎరువులు కొరత లేనందున కృత్రిక కొరత సృష్టించొద్దన్నారు. అనంతరం జిల్లా పరిషత్‌ను తనిఖీ చేసి మెనూ ప్రకారం వంటలు చేశారా లేదా అన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసుల కోసం ప్రత్యేక కార్యాచరణ తయారు చేయాలని ఆదేశించారు. మల్కాపూర్‌ని సందర్శించి సీజనల్ వ్యాధులపై తీసుకున్న చర్యలను వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓపి, సిబ్బంది అటెండెన్స్, రిజిస్టర్, మందులు తదితర సక్రమంగా నిర్వయించాలన్నారు. ఒకే రోజు ఐదుగురు సిబ్బందికి సెలవులు మంజూరు చేసిన మెడికల్ ఆఫీసర్ మీద కలెక్టర్ అగ్రహం వ్యక్తం చేసి వెంటనే ఆ అధికారికి మెమో ఇవ్వాలని డిఎంహెచ్ఓను ఆదేశించారు. టిబి స్కీనింగ్ బాగా జరుగతుందని, క్యాంపులు ఎక్కువగా నిర్వయించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలించి ఇసుక, మొరం సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయా అని కలెక్టర్ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. దశలవారిగా పూర్తి అవుతున్న నిర్మాణాలకు సంబందించి ఫోటోలు ఎప్పటికి అప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, లబ్ధిదారులకు త్వరంగా బిల్లులు వచ్చే విధంగా చూడాలన్నారు. రాజవరం గ్రామంలోని ప్రైమరీ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌లను సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారిలో పాటు డిఎంహెచ్ఓ, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.


## సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ములుగు:** శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని సమ్మక్క సారలమ్మ దేవాలయంలో జరుగుతున్న షెడ్ నిర్మాణ పనులను, క్యూలైన్లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2026 మహా మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డు వెడల్పు గద్దెల ప్రాంగణంలో క్యూలైన్లు మార్పులు చేర్పుల ఏర్పాట్లు, మాస్టర్ ప్లాన్‌పై ఎండోమెంట్ పోలీస్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, పూజారులతో కలెక్టర్ చర్చించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తాడ్వాయి పరిధిలోని మేడారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి రవీందర్, ఎండోమెంట్ ఈవో వీరస్వామి, పంచాయతీరాజ్ ఈఈ అజయ్‌కుమార్, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, సమ్మక్క సారలమ్మ గోవిందరాజు, పగిడిద్ద రాజు పూజారులు, ఎంసిహెచ్‌టిం డాక్టర్ కీర్తి, స్టాఫ్ నర్స్ మమత, సూపర్‌వైజర్ సరస్వతి, ఆరోగ్య కార్యకర్త రాజ్యలక్ష్మి, తిరుపతయ్య, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉంచాలని నిరసన

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్




**ప్రజాపక్షం/ మహబూబాబాద్:** వానాకాలం సీజన్లో రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం నుండి 9.80 లక్షల టన్నుల యూరియా కేటాయిస్తే 6.60 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేశారు. 4,23 లక్షల టన్నుల యూరియా లోటు ఏర్పడిందని అన్నారు. వానాకాలం సీజన్ కొనసాగుతుందని, రైతులు నారుమళ్ళు పోసుకొని నాట్లు వేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, రైతులకు అవసరమైన యూరియా, డి ఏ పి, పురుగు మందు, కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరారు. దొడ్డు రకం యూరియాను రైతులకు అందించాలని కోరారు. యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.నీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న రైతు రుణమాఫీ ని అమలు చేయాలన్నారు. బ్యాంకుల్లో వెనక్కి వెళ్లిన రుణమాఫీ డబ్బులను తిరిగి రైతులకు ఇప్పించి ఇబ్బందులను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గునిగంటి రాజన్న, జిల్లా ఉపాధ్యక్షులు నల్లపు సుధాకర్, సహాయ కార్యదర్శులు మార్తినేని పాపారావు, కందాల రమేష్, మలేదీ కోటయ్య, జిల్లా నాయకులు బొబ్బ ఉపేందర్ రెడ్డి, నిరుడు జలంధర్, జోగ్య నాయక్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## కెటికె వన్ ఇంక్లైన్ సమస్యలు పరిష్కరించాలి

అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు సుధాకర్ రెడ్డి,జి శ్రీనివాస్

కార్మిక సమస్యలను అడిగి తెలుసుకున్న ఏఐటీయూసీ నాయకులు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి ఏరియాలోని కేటీకే వన్ ఇంక్లైన్లోని అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శిలు గురుజేపల్లి సుధాకర్ రెడ్డి, గంగసరపు శ్రీనివాస్ లు డిమాండ్ చేశారు. కేటీకే వన్ ఇంక్లైన్ లో ఫిట్ సెక్రటరీ సదయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కార్మిక సమస్యలను ఏఐటీయూసీ నాయకులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి,శ్రీనివాస్ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన స్ట్రక్చర్ మీటింగ్లో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కార్మిక సమస్యలపై స్ట్రక్చర్ మీటింగ్లో జి ఎంతో అనేక సమస్యలపై చర్చించడం జరిగిందని, అందులో అన్ని సమస్యలను అంగీకరించారు.అంగీకరించిన సమస్యలకు సర్క్యులర్ జారీ చేసి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫిట్ కమిటీ, టెంపుల్ కమిటీ సభ్యులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కెయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలు

కళాశాల ప్రిన్సిపాల్ కే బిక్షాలు



**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** కాకతీయ యూనివర్సిటీ లోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నుండి మొదటి దఫా ప్రవేశాలు ప్రారంభం అయినాయని, ఈ ప్రవేశాలు వచ్చే నెల రెండవ తేదీ వరకు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె బిక్షాలు ఒక ప్రకటన తెలిపారు. మహిళా ఇంజనీరింగ్ యూనివర్సిటీలోని పలు విభాగాల్లో సిఎస్‌సి లో 66, ఏఐఎమ్ఎల్‌లో66, డి.ఎస్.లో64,ఈఈఈలో 29, ఈసిఈ లో 63, ఐ.టి లో 62 సీట్లు అలాట్మెంట్ అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. బిక్షాలు, సూపరిండెంట్ వీరన్న నాయక్ తెలిపారు.

## యువతలో నైపుణ్యాలను పెంచేందుకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామీణ ప్రాంత నియోజకవర్గ కేంద్రాల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ) ఏర్పాటు చేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలను స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి సందర్శించారు. ఎమ్మెల్యేకు కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పూల బొకే ఇచ్చి శాలువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం రూ.42.64 కోట్లతో కొత్తగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ఏర్పాట్లను పరిశీలించారు. ఈ ఏటీసీలో రెండేళ్ల కాల పరిమితి కలిగిన ఆరు అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి పాస్ అయిన భూపాలపల్లి నియోజకవర్గ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియాగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఈ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లో కోర్సుల వివరాలని ఎమ్మెల్యే తెలిపారు. ఏడాది కోర్సులు మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, పార్టిషన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్ ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా, రెండేళ్ల కాల పరిమితితో ఉన్న కోర్సులు బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్, అడ్వాన్సుడ్ సిఎంసి మిషన్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్ పురుషులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మొత్తం 172 సీట్లు ఉన్నాయని, నియోజకవర్గం విద్యార్థులు ఇటి అవకాశాన్ని సద్వినియాగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అంతకుముందు మంజూరునగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లో కోర్సుల వివరాలను తెలిపే గోడపత్రికని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పిప్పాల రాజేందర్, అప్పం కిషన్, మాజీ కౌన్సిలర్లు శిరూప అనిల్, దాట్ల శ్రీనివాస్, నాయకులు మహేందర్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# రీల్

## ప్రభాస్‌తో పూరి ముచ్చట్లు




ప్రభాస్ హీరోగా రాజా సాబ్ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో రెగ్యులర్‌గా జరుగుతోంది. ఈ సినిమాకు మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. డిసెంబర్ లేదా వచ్చే యేడాది జనవరిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఆగమేఘాల మీద షూటింగ్ నిర్వహిస్తున్నారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి హీరోగా నిర్మిస్తున్న చిత్రం షూటింగ్ కూడా హైదరాబాద్‌లోనే జరుగుతోంది. ఈ రెండు పెద్ద షూటింగ్ లు ఒకే దగ్గర జరుగుతుండటంతో పూరి జగన్నాథ్, ప్రభాస్ ఇద్దరూ కలుసుకున్నారు. చాలా సేపు ముచ్చట్లు పెట్టుకున్నారు. రాజా సాబ్ సెట్ లోకి వెళ్లి ప్రభాస్‌ను కలిశారు. గతంలో పూరి జగన్నాథ్, ప్రభాస్ కలిసి ఏక్ నిరంజన్ సినిమా చేశారు. ప్రభాస్‌ను కలిసిన వారిలో చార్మి కూడా ఉన్నారు.

## సతీ లీలావతి టీజర్ విడుదల

లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'సతీ లీలావతి'. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమిలి కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. భార్య, భర్త మధ్య ఉండే అనుబంధాన్ని ఎమోషనల్‌గానే కాకుండా ఎంటర్‌టైనింగ్‌గానూ తెరకెక్కించిన ఫన్నీ ఎంటర్‌టైనర్ 'సతీ లీలావతి'. మూవీ టీజర్‌ను విడుదల చేశారు. టీజర్‌ను గమనిస్తే లావణ్య, దేవ్ మోహన్ జంట పెళ్లి చేసుకుని ఆనందంగా ఉంటుంది. కానీ నెక్ట్స్ సీన్‌లోనే దేవ్ మోహన్‌ను లావణ్య కొట్టి కట్టేసుంటుంది. వారి మధ్య జరిగే గొడవకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను టీజర్‌లో మనం గమనించవచ్చు. అలాగే భార్య భర్తల మధ్య జరిగే గొడవలో వి.కె.నరేష్, వి.టి.వి.గణేష్, సప్తగిరి, జాఫర్, మొట్ట రాజేంద్రన్ ఎందుకు ఇన్ వాల్వ్ అయ్యారు. అసలు గొడవేంటి? అనే విషయాలను తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందేనంటున్నారు దర్శక నిర్మాతలు. షూటింగ్ పూర్తి చేసుకున్న 'సతీ లీలావతి' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి.




## ఈ చిత్రంలో భావోద్వేగాలు కట్టిపడేస్తాయ్



– విజయ్ దేవరకొండ

'కింగ్డమ్' ప్రేక్షకుల ముందుకు వస్తున్న నేపథ్యంలో తాజాగా చిత్ర బృందం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కథానాయకుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. 'సినిమా అవుట్ పుట్ పట్ల మేము చాలా సంతృప్తిగా ఉన్నాము. బుకింగ్స్‌కి వస్తున్న అద్భుతమైన స్పందన చూసి మాకు సంతోషంగా ఉంది. తెలుగు ప్రేక్షకులు ఇస్తున్న భరోసాతోనే.. మేము సినిమా విడుదల ముందు ఇంత ప్రశాంతంగా ఉండగలుగుతున్నాము. 'జెర్సీ' సినిమా తీసిన గౌతమ్ తిన్ననూరి 'కింగ్డమ్' ఇది. ఈ చిత్రంలో భావోద్వేగాలు కట్టిపడేస్తాయి. చరిత్రలో ఏ యుద్ధం చూసుకున్నా.. కుటుంబం కోసమో, భూమి కోసమో, ప్రేమ కోసమో ఉంటుంది. ఈ యుద్ధం కూడా అలాంటిదే. కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. సినిమా మొదలైన రెండు నిమిషాలకే ప్రేక్షకులు 'కింగ్డమ్' ప్రపంచంలోకి వెళ్తారు. థియేటర్‌కి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఈ చిత్రం మంచి అనుభూతిని ఇస్తుంది.' అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగ వంశీ మాట్లాడుతూ.. 'ఈమధ్య కాలంలో సినిమాలకు ఓపెనింగ్స్ రాబట్టడం పెద్ద ఛాలెంజ్ అయిపోయింది. ఆ పరంగా చూస్తే మేము పాస్ అయ్యాము. బుకింగ్స్ బాగున్నాయి. మంచి వసూళ్లతో సినిమా ఘన విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను. కథానాయిక భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ.. 'కింగ్డమ్'లో మధు అనే కథకు కీలకమైన పాత్ర పోషించాను. గౌతమ్ గారు పాత్రను అద్భుతంగా మలిచారు అని అన్నారు.

## బ్రహ్మాండ ఫస్ట్ లుక్

మమత ఆర్ట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆమని ప్రధాన పాత్రలో మమత సమర్పించు చిత్రం 'బ్రహ్మాండ'. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ టీజర్ డిజైన్స్ చూశాను చాలా బాగా ఉన్నాయి సినిమా యూనిట్ అందరికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. నిర్మాత దాసరి సురేష్ మాట్లాడుతూ మా బ్రహ్మాండ చిత్రాన్ని అఖండ చిత్ర ప్రొడ్యూసర్ ఫస్ట్ లుక్ పోస్టర్ ఆవిష్కరించిన మిర్యాల రవీందర్ రెడ్డి కి నేనెప్పుడూ రుణపడి ఉంటాను అన్నారు. చిత్ర దర్శకుడు రాంబాబు మాట్లాడుతూ మా సినిమా టైటిల్ని ఆవిష్కరించిన రవీందర్ రెడ్డికి థాంక్స్ చెప్తూ ఇది మొదటి విజయంగా భావిస్తున్నానని చెప్పారు. మొట్టమొదటిసారిగా ఒగ్గు కళాకారుల నేపథ్యంలో వారి సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్న చిత్రం ఇది. ఒగ్గు కథ తెలంగాణ జానపద కళారూపం. ఒగ్గు అంటే శివుని చేతిలోని ఢమరుకం అని అర్థం. ఈ పదం కేవలం తెలంగాణ ప్రాంతంలోనే వినిపిస్తుంది. ఇది అచ్చమైన దేశీపదం. ఈ చిత్ర కథ, స్క్రీన్ ప్లే ప్రేక్షకులను తప్పకుండా రంజింప చేస్తుంది. యాక్షన్స్ అన్ని డివోషనల్ థ్రిల్లింగ్ ప్రేక్షకులకు గూస్ బంప్స్ వచ్చే విధంగా ఉంటాయి. సినిమాటోగ్రాఫర్ కాసుల కార్తీక్ మాట్లాడుతూ అఖండ ప్రొడ్యూసర్ చేతుల మీదుగా రిలీజ్ చేయటం చాలా ఆనందం గా ఉంది. అని అన్నారు. సినిమా హీరో బన్నీ రాజు మాట్లాడుతూ నేను హీరోగా చేసిన సినిమా టైటిల్ ని రవీందర్ రెడ్డి రిలీజ్ చేయడం చాలా ఆనందం వేసింది ఈ బ్రహ్మాండ సినిమా కూడా అఖండ లా విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని చెప్పారు.




## పాయల్ రాజ్‌పుత్ తండ్రి కన్నుమూత



టాలీవుడ్ హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ ఇంట విషాదం నెలకొంది. ఆమె తండ్రి విమల్ కుమార్ రాజ్ పుత్ (68) కన్నుమూశారు. హైదరాబాద్‌లో అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. ఢిల్లీలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. పాయల్ రాజ్‌పుత్ తన తండ్రితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ 'నా పక్కన లేకపోయినా, మీ ప్రేమ నన్ను ప్రతిరోజూ నడిపిస్తుంది. మీ చిరునవ్వు, మీ గొంతు, మీ ఉనికి నాకు చాలా గుర్తుంది. మీరు ఈ ప్రపంచం నుండి వెళ్ళిపోవచ్చు, కానీ నా హృదయం నుండి ఎప్పటికీ వెళ్ళిపోరు. లవ్ యు నాన్న..' అంటూ పోస్టు చేసింది.

## భార్యా భర్తల మధ్య అనుబంధమే సార్ మేడమ్



తమిళ హీరో విజయ్ సేతుపతి, నిత్యా మేనన్ జంటగా నటించిన ఫ్యామిలీ డ్రామా 'సార్ మేడమ్'. ఏ రగ్డ్ లైవ్ స్టోరీ అనే ట్యాగ్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పాండిరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సత్యజ్యోతి ఫిలిమ్స్ బ్యానర్ పై సెందిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించారు. ఇటివలే తమిళ్‌లో విడుదలైన ఈ చిత్రం అక్కడ సూపర్ హిట్ అయింది. ఆగస్ట్ 1న తెలుగులో విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ ల్యాబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ ఈ సినిమా తమిళ్‌లో చాలా పెద్ద హిట్ అయింది. తెలుగులో కూడా పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. ఈ సినిమాకి తెలుగు పాటలు రాంబాబు చాలా చక్కగా రాశారు. విన సొంపుగా వున్నాయి. హీరోయిన్ నిత్యా మీనన్ మాట్లాడుతూ తెలుగులో సినిమా చేసి చాలా రోజులు అయింది. అందుకే ఈ సినిమాకి తెలుగులో నేనే డబ్బింగ్ చెప్పాలని అనుకున్నాను. ఈ సినిమా విషయంలో చాలా ఆనందంగా ఉంది. విజయ్‌తో నేను ఆల్రెడీ ఒక సినిమా కలిసి చేశాను. ఇది అందరికీ కనెక్ట్ అయ్యే స్టోరీ. తమిళ్ లాగే తెలుగులో కూడా పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నాను'అన్నారు. డైరెక్టర్ పాండిరాజ్ మాట్లాడుతూ కార్తి నటించిన చిన్న బాబు సినిమా తెలుగులో చాలా పెద్ద హిట్ అయింది. ఆ సినిమాకి నేనే దర్శకత్వం వహించాను. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బి నందిని రెడ్డి, డిఓపి సుకుమార్, పాటల రచయిత రాంబాబు గోసాల, ఎన్ వి ఆర్ సినిమాస్ సురేష్, ప్రొడ్యూసర్ త్యాగరాజన్ పాల్గొన్నారు .

## రిషబ్ శెట్టితో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ చిత్రం

ప్రేక్షకులకు వైవిధ్యభరితమైన చిత్రాలను అందిస్తూ, వరుస ఘన విజయాలతో దూసుకుపోతోంది ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్. ఇప్పుడు ఈ సంస్థ మరో భారీ చిత్రానికి శ్రీకారం చుట్టింది. 'కాంతార' చిత్రంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కన్నడ అగ్ర కథానాయకుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి రిషబ్ శెట్టితో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఓ భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం 'కాంతార 2' చిత్ర పనుల్లో నిమగ్నమై ఉన్న రిషబ్, ఒక ఫిక్షనల్ హిస్టారికల్ యాక్షన్ డ్రామా కోసం సితారతో చేతులు కలిపారు. 18వ శతాబ్దంలో భారత్‌లోని అల్లకల్లోలంగా ఉన్న బెంగాల్ ప్రావిన్స్‌లో ఒక తిరుగుబాటుదారుడు ఎదిగిన క్రమం నేపథ్యంలో ఈ చిత్ర కథ ఉంటుంది. మంచి కథకుడిగా పేరు గాంచిన, ప్రతిభావంతులైన అశ్విన్ గంగరాజు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈసారి ఆయన ఓ అద్భుతమైన కథతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం తెలుగు, కన్నడ భాషలలో ఏకకాలంలో చిత్రీకరించబడుతుంది. తెలుగు, కన్నడతో పాటు తమిళం, హిందీ, మలయాళం భాషల్లో విడుదల కానుంది. ప్రొడక్షన్ నెం.36గా రూపుదిద్దుకోనున్న ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ప్రముఖ నటీనటులు, ప్రతిభగల సాంకేతిక నిపుణులు ఈ చిత్రం కోసం పని చేయనున్నారు.




## ఢిల్లీలలో ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

రోజుల ఉద్యమ కార్యాచరణను పకడ్బందీగా చేపట్టాలని ప్రణాళిక రూపొందించింది. ఆగస్టు 5,6,7 తేదీలలో సిఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎంపిలు, ఎంఎలేసిలు, ఎంఎల్‌ఎలు తమతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులను జిల్లాకు 50 మంది చొప్పున ఢిల్లీకి తీసుకెళ్లాలని, అక్కడే మకాం వేసి ఉద్యమాన్ని చేపట్టాలని టిపిసిసి వ్యూహ రచన చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్ గౌడ్ హైదరాబాద్ బుధవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో బుధవారం వారు భేటీ అయ్యారు. దాదాపు గంటన్నర పాటు జరిగిన ఈ సమావేశం తెలంగాణలో పార్టీ నిర్మాణం, 'జనహిత' పాదయాత్ర, బిసి రిజర్వేషన్లపై ఢిల్లీలో పోరాడేందుకు కార్యాచరణపై వారు చర్చించారు. ఈ నెల 31వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు యథావిధిగా కాంగ్రెస్ పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు 5, 6, 7 తేదీల్లో 42 శాతం బిసి రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం ఢిల్లీలో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రత్యేకంగా చర్చించారు. ఆగస్టు 6వ తేదీన జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, పార్టీ నేతలు, బిసి సంఘాల నేతలు పాల్గొంటారు. ఏడవ తేదీన రాష్ట్రపతిని కలిసి వినతి పత్రం అందజేస్తారు. ఢిల్లీ పర్యటన తర్వాత పాదయాత్ర యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించినట్లు టిపిసిసి తెలియజేసింది.




## పక్కా ఇండ్లు నిర్మించాలి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఊడిగం చేస్తూ, పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్నదని చాడ వెంకట్ రెడ్డి అన్నారు. మోదీ పాలనలో అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని అమలు చేయకుండా ప్రజాస్వామ్యం గొంతునొక్కుతూ ప్రజల హక్కులను కాలరాస్తున్నారన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను తుంగలో తొక్కుతూ రచయితలను, కవులను, కళాకారులను, విద్యావేత్తలను అణిచివేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను మంటగలుపుతున్నారని, నిరుద్యోగం, ఆకలి, దారిద్రం నిరంతరం పెరుగుతూ పేదలకు విద్య, వైద్యం అందక ప్రజలు ఆందోళనకు గురవుతున్నా కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. కమ్యూనిస్టులు అన్ని దేశాలలో ఉన్నారన్న విషయం రాష్ట్రంలో బిజెపి అధ్యక్షుడు రామ్ చందర్ రావు గుర్తెరగాలని, అసలు కమ్యూనిస్టులకు బద్ధ శత్రువే బిజెపి అని అన్నారు. పేదప్రజలపై దోపిడీ ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారని, వామపక్షాల దారులు వేరైనా గమ్యం ఒకటేనని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వ్యవస్థను కాపాడుకునేందుకు వామపక్ష, ప్రగతిశీల శక్తులు కలిసి ముందుకు సాగాలని అన్నారు. వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లాలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

**వరంగల్ నగరంలో సిపిఐ భారీ ప్రదర్శన...**

సిపిఐ జిల్లా ద్వితీయ మహాసభల సందర్భంగా వరంగల్ నగరంలో బుధవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. శివనగర్‌లోని సిపిఐ కార్యాలయం తమ్మెర భవన్ నుండి వరంగల్ చౌరస్తా మీదుగా పోచమ్మ మైదాన్ వరకు ప్రదర్శన కొనసాగించారు. ఈ ప్రదర్శన,అనంతరం జరిగిన సభలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర నాయకులు టి.వెంకట్రాములు, సిరబోయిన కరుణాకర్, పంజాల రమేష్, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, పల్లె నర్సింహా, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కే బాష్ మియా, పనాస ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణమ్మ పరవళ్లు



### జలకళతో ఉట్టిపడుతున్న సాగర్


### 26 గేట్ల ద్వారా నీటి విడుదల

**ప్రజాపక్షం/నందికొండ:** శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు భారీగా వరద ప్రవాహం కొనసాగుతుంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాజెక్టుల నుంచి శ్రీశైలంకు భారీగా వరద వచ్చి చేరుతుండటంతో మొత్తం 2,82,364 క్యూసెక్కుల నీరు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి సాగర్‌కు వచ్చి చేరుతుంది. దీనితో రిజర్వాయర్ నీటిమట్టం నిండుకుండను తలపిస్తూ ఉండటంతో ప్రాజెక్ట్ అధికారులు బుధవారం 10 గేట్లను 10 అడుగుల మేర 16 గేట్లను 5 అడుగుల మేర పైకి లేపి మొత్తం 26గేట్ల ద్వా రా నీటిని విడుదల చేస్తున్నారు.

**సాగర్ రిజర్వాయర్ సమాచారం..**

నాగార్జున సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా నీటి నిల్వ సామర్థం 312.0450 టిఎంసిలు ప్రస్తుత రిజర్వాయర్ నీటిమట్టం 586.20 అడుగులకు 301.3570 టిఎంసిల నీటి నిల్వతో ఉన్నది. కుడి కాలువ ద్వారా 8144 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7272 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసిఏఎంఆర్‌పి ద్వారా 1800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండగా ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 28,826 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌కు 2,82,364 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లోగా వచ్చి చేరుతూ ఉంటే 312158 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా దిగువకు విడుదలవుతుంది.

### పర్యాటకుల సందడే.. సందడి



సాగర్ అందాలను తిలకించడానికి పర్యాటకుల తాకిడి పెరుగుతుంది. దీనితో వాహనాల రద్దీ పెరగడంతో హిల్ కాలనీలో ఉన్న లాంచీ స్టేషన్, ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం, కొత్త, పాత వంతెనల వద్ద పర్యటకులతో నిండి పోయింది? దీనితో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడింది పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తూ ఉన్నారు. అయితే భద్రతా కారణాల దృష్ట్యా ప్రాజెక్టు అందాలను దగ్గర నుండి తిలకించడానికి ప్రాజెక్టు పైకి ఎవరిని అనుమతించకపోవడంతో పర్యాటకులు తీవ్ర నిరాశతో వెను తిరుగుతున్నారు. దీనితో పర్యాటకులు పవర్ హౌస్ వద్దకు చేరుకుని సెల్ఫీలతో సాగర్ అందాలను బంధిస్తున్నారు.

## 'సుప్రీం' అసహనం

(మొదటి పేజీ తరువాయి)

ముందు మీరు ఎందుకు హాజరయ్యారని ప్రశ్నించింది. మీరు అప్పటికప్పుడు దానిని ఎందుకు సవాల్ చేయలేదని అత్యున్నత న్యాయస్థానం జస్టిస్ యశ్వంత్‌వర్మను ప్రశ్నించింది. అంతర్గత విచారణ కమిటీకి వ్యతిరేకంగా మీరు ఇంతకుముందే కోర్టుకు వచ్చి ఉండాల్సింది అని ధర్మాసనం జస్టిస్ యశ్వంత్‌వర్మకు చెప్పింది. భారత ప్రధాన న్యాయమూర్తికి, రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి సమాచారం అందించగల న్యాయమూర్తి ఉన్నారని, నమ్మేందుకు ఆధారాలు ఉన్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ ఎజి.మాసిహ్‌లతో కూడిన ధర్మాసనంపేర్కొంది. 'ముందుకు సాగాలా? వద్దా అనేది రాజకీయ నిర్ణయం. కానీ, న్యాయవ్యవస్థ సమాజానికి ప్రక్రియ అనుసరించబడిందనే సందేశం పంపాలి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జస్టిస్ యశ్వంత్ వర్మ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ హాజరయ్యారు. తనను తొలగించాలని అంతర్గత విచారణ కమిటీ చేసిన సిఫారసు రాజ్యాంగ విరుద్ధం' అని జస్టిస్ యశ్వంత్‌వర్మ వాదించారు. తొలగింపును కొనసాగించాలని సిఫారసు చేయడం ప్రమాదకరమైన ఉదాహరణగా నిలుస్తుందని కపిల్ సిబల్ కోర్టుకు తెలిపారు. వీడియోటేప్ విడుదలైన తర్వాత యశ్వంత్‌వర్మ తనను సంప్రదించలేదని, అప్పటికే ఆయన ప్రతిష్ఠ దెబ్బతిన్నదని కపిల్ సిబల్ చెప్పారు. విచారణ సందర్భంగా జస్టిస్ దీపాంకర్‌దత్త మాట్లాడుతూ జస్టిస్ యశ్వంత్ వర్మ కనీసం ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ ఫిర్యాదుతో పోలీసులను సంప్రదించారా? అని న్యాయవాది మ్యాథ్యూస్ జె.నెడుంపరాలను ప్రశ్నించారు. అంతర్గత విచారణ ప్రొసీజర్‌ను సవాల్‌చేస్తూ జస్టిస్ యశ్వంత్‌వర్మ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తనను తొలగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం తన ఆదేశాన్ని రిజర్వ్ చేసింది. ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేయాలని కోరుతూ న్యాయవాది నెడుంపరా దాఖలు చేసిన ప్రత్యేక పిటిషన్‌పై కూడా సుప్రీంకోర్టు తన ఆదేశాన్ని రిజర్వ్ చేసింది. జస్టిస యశ్వంత్‌వర్మ మే8న అప్పటి భారత ప్రధానన్యాయమూర్తి సంజీవ్ ఖన్నా చేసిన సిఫారసును రద్దు చేయాలని, అతనిపై అభిశంసన ప్రక్రియను ప్రారంభించాలని కోరడం నిలిపివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే.

## సమాన వేతనం (మొదటి పేజీ తరువాయి)

కోసం ఫీల్డ్ అసిస్టెంట్లకు మొబైల్ ఫోన్ల మంజూరు తదితర అంశాలను క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క హామీనిచ్చారు. హైదరాబాద్, సచివాలయంలో బుధవారం మంత్రి సీతక్కతో ఫీల్డ్ అసిస్టెంట్లు సమావేశమై వారు తమ సమస్యలను వివరించారు.దీనిపై స్పందించిన మంత్రి సీతక్క సర్క్యూలర్ 4779ను రద్దు చేయాలని, ఈ సర్క్యూలర్ ద్వారా గత ప్రభుత్వంలో తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్ల పునర్ నియామకానికి సంబంధించిన సాధ్యాసాధ్యాలపై సమగ్రంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మండల ఆఫీసుల్లో ఉపాధి హామీ విభాగంలో పని చేస్తున్న 540 మంది ఎంసిసి అటెండర్‌ల జీతాలను వారి విజ్ఞప్తి మేరకు నేరుగా వారి సొంత ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లను ఫికస్డ్ టెన్యూర్ ఉద్యోగులుగా మార్చే అంశం, వేతనాల పెంపు, తదితర న్యాయపరమైన, ఆర్థికపరమైన అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అంశాలను కేబినెట్‌లో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. ఉపాధి హామీ నిధుల్లో కేంద్ర ప్రభుత్వం భారీ కోతలు విధించడంతో రాష్ట్రాలు నష్టపోతున్నాయని, ఫీల్డ్ అసిస్టెంట్ల జీతల భారాన్ని కేంద్రం ప్రభుత్వం పూర్తిగా రాష్ట్రాలపై మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని కష్టనష్టాల మధ్యలోనూ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిరంతరం సానుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. వేతన సవరణ,ఆరోగ్య భద్రత, బదిలీ అవకాశాలు, బీమా కల్పన వంటి పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు సంతృప్తి వ్యక్తం చేశారు.

## మోదీ ఎందుకు చెప్పట్లేదు

(మొదటి పేజీ తరువాయి)

మోదీ జంకుతున్నారని రాహుల్ అభిప్రాయపడ్డారు. భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ తీసుకురావడంలో కీలక పాత్ర పోషించానని ట్రంప్ తన వాదనను పునరావృతం చేసిన తర్వాత, ప్రతిపక్ష పార్టీ ప్రధాని మోదీపై తీవ్ర విమర్శలు చేసింది. అమెరికన్ నాయకుడు ప్రధానమంత్రి చుట్టూ పాములా చుట్టుకుని చేదు నిజాలను తన చెవిలో గుప్పించుకుంటున్నారన్నారు. ట్రంప్ తన వాదనలను పునరావృతం చేస్తున్న తాజా వ్యాఖ్యలు, భారతదేశం 20 నుండి 25 శాతం మధ్య అధిక అమెరికా సుంకాలను ఎదుర్కోవడానికి సిద్ధమవుతోందని రాహుల్‌ను మీడియా ప్రశ్నించగా, 'ట్రంప్ అబద్ధం చెబుతున్నారని ప్రధాని చెప్పలేరని స్పష్టంగా తెలుస్తుంది. ఏమి జరిగిందో స్పష్టంగా ఉంది. అందరికీ తెలుసు, ఆయన దానిని చెప్పలేకపోతున్నారు. అదే వాస్తవం' అని అన్నారు. ప్రధాన మంత్రి అలా చెబితే మోదీ బండారం బయటపడుతుందని, అందుకే ప్రధాని ఏమీ చెప్పలేకపోతున్నారని రాహుల్ ఎద్దేవా చేశారు. వాణిజ్య ఒప్పందం కోసం భారత ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని రాహుల్ గాంధీ అన్నారు. ఇప్పుడు, ఎలాంటి వాణిజ్య ఒప్పందం జరుగుతుందో అందరూ చూస్తున్నారని ఆయన పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో అన్నారు. ట్రంప్ అబద్ధం చెబుతున్నారని చెప్పే దమ్ము ప్రధాని మోదీకి లేదని, ఇందులో ఏదో అనుమానం కలుగుకుతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. భారత్, పాక్ మధ్య మధ్యవర్తిత్వానికి మూడవ పక్షాన్ని తాము ఎప్పుడూ అంగీకరించలేదని చెబుతున్న కేంద్రం ప్రభుత్వం, మరి ట్రంప్ మధ్యవర్తిత్వాన్ని ఎందుకు అంగీకరించారని, కారణాలు ఏమితో వారు దేశానికి చెప్పాలని ఖర్గే పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చ సందర్భంగా లోక్‌సభలో మోదీ చేసిన రెండు గంటల ప్రసంగంలో ఒక్కసారి కూడా ట్రంప్ పేరును ప్రస్తావించలేదన్నారు. ట్రంప్ అబద్ధం చెబుతున్నారని, అలాంటి అర్థంలేని మాటలను సహించబోమని' చెప్పే ధైర్యాన్ని ఆయన ఎందుకు చేయలేకపోయారని ఖర్గే నిలదీశారు. ట్రంప్ వ్యాఖ్యలను ఆయన ఖండించి, దేశ ప్రతిష్టను వక్రీకరించడానికి ప్రయత్నిస్తున్నారని చెబితా యావత్ దేశం హర్షించేదన్నారు. కాగా, ట్రంప్ తాజా వ్యాఖ్యల వీడియోను ట్యాగ్ చేస్తూ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ మోదీకి మంచి మిత్రుడైన ట్రంప్ అమెరికా, సౌదీ అరేబియా, ఖతార్, యుకెలో 30 సార్లు చెప్పిన విషయాన్ని ప్రధాని ఎందుకు నిస్సందేహంగా, నిర్ద్వంద్వంగా తిరస్కరించడం లేదని ప్రశ్నించారు. మోదీ చాలా బలహీనమైన స్థితిలో ఉన్నారని, తన తప్పులను కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారని జైరామ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి ఉపయోగించిన పదాలను జాగ్రత్తగా వింటే, అవి అస్పష్టంగా ఉన్నాయని, వారు పలు విషయాలను నేరుగా స్పష్టం చేయాలన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com